ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం 12.07.2026 | సంపుటి : 12 సంచిక : 353 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



కాళేశ్వరం ప్రాజెక్టుపై మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి.. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, పొన్నం,. ఎమ్మెల్యే విజయరమణరావు

# కాళేశ్వరాన్ని ఎన్డీఎస్ఏకు అప్పగించేందుకు సిద్ధం

## సీబీఐ విచారణపై కేంద్రాన్ని పార్లమెంట్‌లో నిలదీస్తాం
## ఈటలా... ఎన్డీఎస్ఏను ఒప్పించండి, మేం సహకరిస్తాం

- కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లు ఎత్తిపోత కుదరదు
- మేడిగడ్డ గేట్లు మూస్తే ప్రాజెక్ట్ కొట్టుకుపోతుంది
- భద్రాచలం మునిగిపోతుంది
- ఎత్తే ఉంచాలని ఎన్‌డిఎస్ఎ ఆదేశించింది
- ప్రజలను తప్పదోవ పట్టించేలా ఈటల వ్యాఖ్యలు
- బీఆర్ఎస్ నేతల సూచనలతోనే మాట మార్చిన ఈటల రాజేందర్
- జలశక్తి మంత్రిత్వ శాఖనుంచి అనుమతి తెస్తే అభ్యంతరం లేదు
- ఈటల, బీఆర్ఎస్ నేతలకే నిర్వహణ బాధ్యత అప్పగిస్తా
- మీడియాతో సీఎం రేవంత్ రెడ్డి స్పష్టీకరణ

హైదరాబాద్ (జనంసాక్షి ప్రత్యేక ప్రతినిధి): కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ (ఎన్డీఎస్ఏ) సూచనల మేరకే ముందుకు సాగుతుందని, అవసరమైతే ఆ సంస్థ పర్యవేక్షణలోనే పనులు చేపట్టేందుకు కూడా సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై సీబీఐ విచారణ ఎందుకు ముందుకు సాగడం లేదో కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేసిన ఆయన, అవసరమైతే ఈ అంశాన్ని పార్లమెంట్‌లోనూ ప్రస్తావించి కేంద్రాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు. శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి మిగతా 2లో..

"నీళ్లను ఎత్తిపోయాలని ఈటల రాజేందర్ కోరుతున్నారు. ప్రాజెక్టులను ఎన్డీఎస్ఏకు అప్పగిస్తాం. నీళ్లు ఎత్తిపోయాలని ఎన్డీఎస్ఏను కోరండి. మేం అయితే నీళ్లు ఎత్తిపోయం. అలా చేస్తే భద్రాచలం మునుగుతుంది. కిలాడీల కమిటీని ఈటల రాజేందర్ ఎన్డీఎస్ఏ వద్దకు తీసుకెళ్లి విజ్ఞప్తి చేయండి. గురువు కళ్లలో ఆనందం కోసం నేను నీళ్లు వదిలాను అని నిస్సిగ్గుగా మాట్లాడుతున్నారు. పట్టిసీమ కట్టిందే బీఆర్ఎస్ హయాంలో పట్టిసీమ కట్టి 105 టీఎంసీలు తరలించినప్పుడు హరీశ్ గాడిదలు కాస్తున్నారా?. తెలివితక్కువ మాటలు, అతితెలివి మాటలు మాట్లాడుతున్నారు. వాళ్లు బందిపోటు దొంగలకంటే ప్రమాదకరం. ఇప్పుడు ఈటల కూడా చేరారు"
- సీఎం రేవంత్ రెడ్డి,

## గోదావరిలో నీళ్లున్నా కావాలనే వృధాగా వదులుతున్నారు

ఇది కాలం తెచ్చిన కరువు కాదు..
కాంగ్రెస్ తెచ్చిన కరువు : కేటీఆర్

2లో..

## కన్నెపల్లి పంపులు కావాలనే తెరవడం లేదు

మరోసారి ప్రభుత్వంపై హరీశ్ ఆరోపణలు

## సీఎం రేవంత్‌తో ఎమిరేట్స్ ప్రతినిధుల భేటీ

2లో..

విమాన సర్వీసులను పెంచాలని కోరిన ముఖ్యమంత్రి



# పోక్సో ఉన్మాది కిరాతక చర్య


## రెండు గంటల్లో ఆరుగురి హత్య
## కక్షగట్టిన కత్తివేటుకు సొంత కుటుంబమూ బలి

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలానికి చెందిన రాజ్‌కుమార్‌ఘాతుకం

- మైనర్ బాలికను వేధిస్తున్నాడని మే16న పోక్సో కేసు నమోదు
- అరెస్టు చేయకుండా పోలీసుల నిర్లక్ష్యం
- ఎల్బీనగర్ కోర్టును ఆశ్రయించిన బెయిల్ పొందిన నిందితుడు
- అర్ధరాత్రి బాలిక ఇంట్లోకి వెళ్లి అమ్మ, నానమ్మ హత్య
- అనంతరం బాలికను బయటకు తీసుకెళ్లి గొంతుకోసి చంపిన దుర్మార్గుడు
- అనంతరం ఇంటికి వెళ్లి కట్టుకున్న భార్య ఇద్దరు పిల్లల గొంతుకోసి హత్య
- పరారీలో నిందితుడు.. 2 లక్షల రివార్డు ప్రకటించిన పోలీసులు



మృతులు : బాలిక | లక్ష్మి(అమ్మ) | రుక్కమ్మ (నానమ్మ)



మృతులు : సరిత (నిందితుడి భార్య) కుమారులు పరీక్షిత్, దైవీక్షిత్

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి/షాబాద్/(జనంసాక్షి): అర్ధరాత్రి రెండు గంటల వ్యవధిలో ఆరుగురి ప్రాణాలను కత్తికి బలి చేశాడు ఆ కిరాతకుడు. అన్యం పుణ్యం ఎరుగని చిన్నారులను సైతం గొంతు కోశాడు. ఈ ఘటనతో రంగారెడ్డి జిల్లా షాబాద్ ప్రాంతం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. మండల పరిధిలోని దైవాలగూడ కు చెందిన పార్వతి రాజ్ కుమార్ (28) ఓ మైనర్ బాలికను ప్రేమిస్తున్నానంటూ వేధిస్తూ తరచూ ఇబ్బంది పెట్టాడు. దీంతో బాలిక కుటుంబీకులు మే 16న షాబాద్ పోలీస్ స్టేషన్లో నిందితుడిపై ఫిర్యాదు చేశారు. ఫోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు వెంటనే అరెస్టు చేయకపోవడంతో ఎల్బీనగర్ కోర్టును ముందస్తు బెయిల్ కోసం ఆశ్రయించాడు. నిందితుడు జూన్ 12న కోర్టును ఆశ్రయించగా జూన్ 16న బెయిల్ మంజూరు చేసింది న్యాయస్థానం. దీంతో తనపై ఫోక్సో కేసు పెట్టారని కక్ష గట్టిన నిందితుడు రాజ్ కుమార్.. అర్ధరాత్రి నుండి రెక్కీ నిర్వహించి అతి కిరాతకంగా బాలిక అమ్మ చిట్యాల లక్ష్మి, నానమ్మ చిట్యాల రుక్కమ్మపై అర్ధరాత్రి కత్తితో దాడి చేసి హతమార్చాడు. బాలికను గ్రామ సమీపంలోని చెరువు వద్దకు తీసుకెళ్లి గొంతు కోసిచంపాడు. వెంటనే దగ్గరలో ఉన్న ఊరిలో ఇంట్లో నిద్రిస్తున్న భార్య పార్వతీ సరిత (30), కుమారులు పరీక్షిత్ (3), దైవీక్షిత్ (2) ఇద్దరిని కిరాతకంగా గొంతు కోసి హతమార్చాడు. వారి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి హత్యకు తనే పాల్పడ్డట్టు తెలిపాడు. తాను కూడా చనిపోతాను అంటూ పరారయ్యాడు. తెల్లవారెలోపు ఆరుగురు ప్రాణాలు కాస్త గాల్లో కలిసిపోయాయి. పోలీసుల నిర్లక్ష్యం వల్లే నిందితుడు ఆరుగురు ప్రాణాలు మిగతా 2లో..

# భారత్-న్యూజిలాండ్ బంధం మరింత బలోపేతం

- ప్రవాస భారతీయలు కృషి ఇందుకు ప్రధాన కారణం
- ఈ ప్రయాణం మున్ముందు మరింత విజయవంతమవుతుంది
- న్యూజిలాండ్ పర్యటనలో ప్రవాస భారతీయులతో మోడీ



ఆక్లాండ్,జులై 1(జనంసాక్షి): భారత్-న్యూజిలాండ్ వాకా(బోటు) ఇప్పుడు నూతన ప్రయాణాన్ని ఆరంభిం చేందుకు సిద్ధంగా ఉందని, ఇరు దేశాల మధ్య భాగస్వామ్యం మరింత బలోపేతం కానుందని భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రయాణం మున్ముందు మరింత విజయవంతమవు తుందనే పూర్తి నమ్మకం తనకుందన్న మోదీ.. అది తనవల్ల కాదని, అందుకు న్యూజిలాండ్‌లోని భారతీయులే కారణమన్నారు. న్యూజిలాండ్‌లో భారత ప్రధాని నరేంద్ర మోదీ రెండో రోజు పర్యటన కొనసాగింది. శనివారం ఆక్లాండ్‌లో ఆయన ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు. ఇరు దేశాల మధ్య సంబంధాలు స్నేహం, విశ్వాసం, విలువలు, బలమైన భవిష్యత్తు కోసం పరస్పర నిబద్ధతపై నిర్మితమయ్యా యని ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు మోదీ. న్యూజిలాండ్ సంప్రదాయంలో విశిష్ట స్థానం కలిగిన 'వాకా'ను గురించి ప్రస్తావిస్తూ.. 'అదో పడవ మాత్రమే కాదని, ఉమ్మడి ప్రయాణానికి చిహ్నం' అని పేర్కొన్నారు. ఆక్లాండ్ నుంచి వెల్లింగ్టన్ వరకు, క్రైస్ట్‌చర్చ్ నుంచి క్వీన్స్‌టౌన్ వరకు విస్తరించి ఉన్న భారతీయ సమాజమే ఈ స్వర్ణయుగ ప్రయాణానికి నిజమైన నావికులని కొనియాడారు. భారతీయుల ప్రతిభను గుర్తించి సరైన అవకాశాలు కల్పించే అద్భుత దేశం న్యూజిలాండ్ అని అన్నారు. ఎయిర్ న్యూజిలాండ్ సీఈఓగా మిగతా 2లో..

## ప్రముఖ గాయని జానకి ఇకలేరు

వయోధిక సమస్యలతో కన్నుమూత

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర సంతాపం



మైసూరు(జనంసాక్షి): ప్రముఖ గాయని ఎస్. జానకి కన్నుమూశారు. మైసూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం తుది శ్వాస విడిచారు. ఆమె వయసు 88 సంవత్సరాలు. వయోధిక సమస్యలతో ఆమె కన్నుమూసినట్లు మనవరాలు అప్సర విద్యుల ఇన్‌స్టా వేదికగా ప్రకటించారు. దక్షిణ భారత గానకోకిలగా పేరుగాంచిన జానకి అన్ని భాషల్లో కలిపి దాదాపు 50 వేలకు పైగా పాటలను పాడారు. 1938 ఏప్రిల్ 23న గుంటూరు జిల్లా రేపల్లె మండలం పల్లపట్ల గ్రామంలో ఎస్.జానకి జన్మించారు. తెలుగు చలన చిత్రసీమలో ఆణిముత్యాల్లాంటి పాటలకు ఆమె ప్రాణం పోశారు. తెలుగు, తమిళ, మలయాళం, కన్నడ భాషల్లో అద్భుతమైన పాటలను ఆలపించారు. ఆమె గాన మాధుర్యానికి నాలుగు జాతీయ అవార్డులు సహా, వివిధ సినీ అవార్డులు వరించాయి. సంగీత ప్రపంచానికి జానకి చేసిన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం.. 2013లో పద్మభూషణ్ పురస్కారంతో మిగతా 2లో..

# విహారంలో విషాదం

## వియత్నాంలో పర్యాటక బోటు బోల్తా పడి 15మంది జలసమాధి



- మృతుల్లో 10 మంది తమిళనాడు, పలువురు ఏపీ వాసులు
- దుర్ఘటనపై భారత ప్రధాని మోదీ, రాష్ట్రపతి ముర్ము దిగ్భ్రాంతి



హనోయ్,జులై 1(జనంసాక్షి): వియత్నాంలో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఫు క్వాక్ ద్వీపం సమీపంలో భారతీయ పర్యాటకులతో వెళ్తున్న బోటు ఒక్కసారిగా తీవ్రమైన అలలకు బోల్తా పడింది. ఈ ఘటనలో ఇప్పటి వరకు 15 మంది పర్యాటకులు జలసమాధి అయ్యారు. వెంటనే రంగంలోకి దిగిన సహాయ బృందాలు రక్షణ చర్యలు చేపట్టారు. స్థానిక అధికారులతో కలిసి నేవీ సిబ్బంది సహాయ చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఇందులో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. భారత కాలమాన ప్రకారం ఉదయం 11: 30 గంటలకు బోటు ప్రమాదం జరిగినట్లుగా తెలుస్తోంది. ఓ మొబైల్ కంపెనీ తరపున డీలర్స్ టూరిస్ట్‌లుగా వెళ్లారు. ఏపీ నుంచి 30, తెలంగాణ నుంచి 45 మంది వెళ్లారు. ప్రమాదం జరిగిన సమయంలో ఎవరూ కూడా లైఫ్ జాకెట్లు వేసుకోలేదని తెలుస్తోంది. ఇక మృతుల వివరాల కోసం అధికారులు హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేశారు. బాధిత కుటుంబాలు కంట్రోల్ రూమ్‌లను సంప్రదించవచ్చని, ఎలాంటి సహాయానికైనా, సందేహాలకైనా తాము అందుబాటులో ఉన్నామని భారత మిషన్ తెలిపింది. మొత్తం మిగతా 2లో..

# దేశంలో 7 బుల్లెట్ ట్రైన్లలో మూడు తెలంగాణకే

- హైస్పీడ్ బుల్లెట్ ట్రైన్ కారిడార్ హబ్‌గా తెలంగాణ
- దేశవ్యాప్తంగా 1300 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ
- సెమీ కండక్టర్ రంగంలో నైపుణ్యాలకు కొరత
- యువత ఈ అవకాశాలు అందిపుచ్చుకోవాలి
- కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి



హైదరాబాద్,జులై 1(జనంసాక్షి): తెలంగాణకు రైల్వే బడ్జెట్‌ను కేంద్రం భారీగా పెంచిందని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. తెలంగాణ బుల్లెట్ ట్రైన్స్ హబ్‌గా మారబోతోందని అన్నారు. హైదరాబాద్ హెచ్ఐసీసీలో వికసిత్ భారత్-2047.. సాంకేతికత పాత్ర' అనే అంశం నిర్వహించిన సదస్సులో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కలిసి అశ్వినీ వైష్ణవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైల్వే మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్, చెన్నై, బెంగళూరును కలుపుతూ బుల్లెట్ ట్రైన్లు రానున్నాయని తెలిపారు. యూపీఏ ప్రభుత్వం ఉమ్మడి ఏపీకి ఇచ్చిన రైల్వే మిగతా 2లో..

# నన్ను చంపాలనుకుంటే ఇరాన్ అంతమే

- వెయ్యి క్షిపణులు ఇరాన్‌పై ఏకకాలంలో దాడి చేస్తాం
- ఊహించని విధంగా ఆ దేశాన్ని నాశనమవుతుంది
- ఇప్పటికే అమెరికా సైన్యానికి ఆదేశాలు ఇచ్చి పెట్టాను
- సొంత సోషల్ మీడియా ట్రూత్‌లో ట్రంప్ హెచ్చరికలు



వాషింగ్టన్,జూలై11(జనంసాక్షి): అమెరికా-ఇరాన్ మధ్య తాత్కాలిక ఒప్పందం కుదిరినప్పటికీ.. ఉద్రిక్తతలు ఏమాత్రం సమసిపోలేదు. రెండుదేశాలు పరస్పరం దాడులు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో వార్నింగ్ ఇచ్చారు. ఒకవేళ వారు తనను హత్య చేయాలని ప్రయత్నిస్తే.. క్షిపణుల వర్షం తప్పదని హెచ్చరించారు. డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి ఘాటైన హెచ్చరిక జారీ చేశారు. తనపై హత్యాయత్నం చేయడానికి ఇరాన్ ప్రయత్నిస్తే, ఆ దేశంపై క్షిపణుల వర్షం తప్పదని వార్నింగ్ ఇచ్చారు. తాము ఇప్పటికే 1,000 క్షిపణులను సిద్ధం చేసి మిగతా 2లో..

## నెత్తుటి బాకీ తీర్చుకుంటాం

- బాధ్యులైన వారు పర్యవసానాలను ఎదుర్కోవాల్సి వస్తుంది
- ఇది మా దేశవ్యాప్తంగా ఉన్న డిమాండ్
- దానిని కచ్చితంగా నెరవేరుస్తాం : మొజ్తబా

టెహ్రాన్(జనంసాక్షి): అమెరికా-ఇరాన్ మధ్య మరోసారి తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్న వేళ ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ స్పందించారు. తన తండ్రి ఆయతుల్లా అలీ ఖమేనీ మరణానికి ప్రతీకారం తీర్చుకుంటానని ప్రతిజ్ఞ చేశారు. బాధ్యులైన వారు పర్యవసానాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇది తమ దేశవ్యాప్తంగా ఉన్న డిమాండ్ అని.. దానిని కచ్చితంగా నెరవేరుస్తానని అన్నారు. ఈ మేరకు ఆయన టెలిగ్రామ్‌లో ఓ సందేశాన్ని విడుదల చేశారు. "మా నాయకుడితో పాటు అమరులైన వారందరి కోసం.. ఆ హంతకులపై ప్రతీకారం తీర్చుకుంటాం" అని అందులో మిగతా 2లో..

# ఓటీటీ సినిమాలకూ సెన్సార్ షిప్

## తాజా పరిణామాలతో కేంద్రం యోచన



న్యూఢిల్లీ,జూలై11(జనంసాక్షి): భారతదేశంలో నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్, డిస్నీ హాట్‌స్టార్ వంటి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో వచ్చే సినిమాలు, వెబ్ సిరీస్‌లపై కేంద్ర ప్రభుత్వం నిఘా పెంచాలని చూస్తుంది. ప్రస్తుతం అమల్లో ఉన్న సమాచార సాంకేతిక రూల్స్, 2021 స్థానంలో సరికొత్త కఠిన నిబంధనలను తీసుకురావడానికి కసరత్తులు జరుగుతున్నట్లు సమాచారం. ప్రస్తుత విధానం ప్రకారం, ఓటీటీ కంటెంట్‌ను థియేటర్లలో విడుదలయ్యే సినిమాల మాదిరిగా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ముందస్తుగా పరిశీలించి ఎటువంటి సర్టిఫికేట్ ఇవ్వదు. ఇదంతా ఐటీ రూల్స్, 2021 పరిధిలోని డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్ ప్రకారమే నడుస్తోంది. దీనివల్ల ఆయా ప్లాట్‌ఫామ్‌లు తమ కంటెంట్‌ను వయస్సు ఆధారంగా విభజించి, కేవలం స్వీయ నియంత్రణ మాత్రమే పాటిస్తున్నాయి. అయితే, ఇటీవల కొన్ని ఓటీటీ సినిమాలు, వెబ్ సిరీస్‌లలో మితిమీరిన బోల్డ్ సీన్లు, బూతులు మరియు వివాదాస్పద రాజకీయ, సామాజికాంశాలు ఎక్కువవుతున్నాయనే ఫిర్యాదులు ప్రభుత్వానికి పెద్ద ఎత్తున అందాయి. తాజా ఉదాహరణగా, పంజాబీ నటుడు దిల్జీత్ దోసాంజ్ నటించిన 'సత్లుజ్' సినిమా నిలిచింది. ఈ చిత్రం థియేట్రికల్ విడుదల కోసం సెన్సార్ మిగతా 2లో..

## భారత్-న్యూజిలాండ్ బంధం మరింత బలోపేతం

నిఖిల్ రవిశంకర్, గవర్నర్ జనరల్‌గా ఆనంద్ సత్యానంద్, క్రికెట్‌లో రచిన్ రవీంద్ర, ఇష్ సోధి, అజాజ్ పటేల్ వంటి భారత సంతతి వ్యక్తులు రాణించడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. అలాగే ఆ దేశంలోని పలు ప్రాంతాలకు బాంబే హిల్స్, కోరమాండల్, కలకత్తా స్ట్రీట్, ఢిల్లీ క్రెసెంట్, అమృత్‌సర్ స్ట్రీట్ వంటి భారతీయ పేర్లుండటాన్ని ఇరు దేశాల మధ్య ఉన్న అనుబంధానికి సంకేతమని పేర్కొన్నారు. ఈ దేశంతో తనకు 30 ఏళ్ల అనుబంధం ఉందని గుర్తుచేసిన మోదీ.. రాజకీయాల్లోకి రాకముందే న్యూజిలాండ్‌ను సందర్శించే అవకాశం వచ్చిందని చెప్పారు. నాడు ఓ న్యూజిలాండ్ వాసి తనకు మఫ్లర్, టోపీ, గ్లౌజులు కానుకగా ఇచ్చిన విషయాన్ని స్మరించుకున్నారు. ఆ మఫ్లర్‌ను ఇప్పటికీ జాగ్రత్తగా భద్రపరుచుకున్నానని, అందులో న్యూజిలాండ్ దేశీయుల ప్రేమనూ అంతే ఆప్యాయంగా కాపాడుకుంటున్నట్టు చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా ఆ దేశ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ సహా ప్రభుత్వ ప్రతినిధులు, లేబర్ పార్టీ నాయకులకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. భారత్-న్యూజిలాండ్ బంధాలకు అక్కడి అన్ని రాజకీయ పార్టీలు మద్దతివ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లడంలో ఎన్‌ఆర్‌ఐల పాత్ర కీలకమని స్పష్టం చేశారు.

## పోక్సో ఉన్మాది కిరాతక చర్య

తీశాడని కుటుంబీకులు స్థానికులు షాబాద్ పోలీస్ స్టేషన్ ముందు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బాధితులను పరామర్శించేందుకు వెళ్తుంటే పోలీసుల అరెస్టు చేశారు. అనంతరం షాబాద్ మాజీ జెడ్పిటిసి సభ్యులు పట్నం అవినాష్ రెడ్డి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం బాధితులకు న్యాయం జరిగేవరకూ పోరాడుతామంటూ షాబాద్ పోలీస్ స్టేషన్ ముందు రాస్తారోకో నిర్వహించారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలగంటి మధుసూదన్ రెడ్డి బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందంటూ.. నిందితులను కఠినంగా శిక్షిస్తుందని తెలిపారు.

**15 బృందాలతో గాలింపు**

నిందితుడు రాజకుమార్ కోసం పోలీసులు 15 బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. తెల్లవారుజామున నుండే ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి డిసిపి యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు 15 బృందాలతో గాలింపు చర్యలు చేపట్టాయి. ఇప్పటికే కేసులో నిర్లక్ష్యం వహించిన సీఐ కాంతారెడ్డి, ఎస్ఐ రమేష్, ను సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది. ఘటనపై పోలీసులు కీలక ప్రకటన చేశారు. నిందితుడిపై రూ.2 లక్షల రివార్డు ప్రకటించారు.

## ప్రముఖ గాయని ఎస్.జానకి ఇకలేరు

సత్కరించింది. లెజెండరీ గాయకులు ఘంటసాల నుంచి బాలసుబ్రహ్మణ్యం వరకూ ఎంతో మంది గాయనీ గాయకులతో కలిసి ఎస్.జానకి అద్భుత గీతాలతో అలరించారు. తెలుగు ప్రేక్షకులు ఎప్పటికీ మరిచిపోలేని పాటలను ఎస్.జానకి ఆలపించారు. తొలిసారి మిమ్మల్ని (శ్రీవారికి ప్రేమలేఖ), మంచు కురిసే వేళలో, అరె ఏమైందీ (అభినందన), బంతి చామంతి (అభిలాష), సిరిమల్లె పువ్వా (పదహారేళ్ల వయసు), మౌనమేలనోయి (సాగర సంగమం), ప్రియతమా నా హృదయమా (ప్రేమ), అందాలలో (జగదేకవీరుడు అతిలోకసుందరి), ఈ దుర్యోధన దుశ్శాసన (ప్రతిఘటన), మాటే మంత్రము (సీతాకోకచిలుక), సుందరి నీవే (దళపతి- తెలుగు వెర్షన్) వంటి సూపర్‌హిట్ సాంగ్స్ పాడారు. "ప్రియమైన అమ్మమ్మ, దిగ్గజ గాయని ఎస్.జానకి కన్నుమూశారన్న వార్త తెలియజేయడానికి ఎంతో విచారిస్తున్నా. కుటుంబ సభ్యుల ప్రేమ, ఆప్యాయత మధ్య ప్రశాంతంగా మనల్ని విడిచి వెళ్లిపోయారు. ఆమె అద్భుతమైన జీవితాన్ని గడిపారు. తన గానంతో లక్షల మందికి ఆనందింపజేశారు. ఆమె ఒక దిగ్గజ గాయని. ఆమె పాటలు మధుర జ్ఞాపకాలు. ఈ దుఃఖ సమయంలో మా కుటుంబ ఏకాంతతను గౌరవించాల్సిందిగా అందరినీ కోరుతున్నా" అని అప్సర తెలిపారు. ప్రముఖ గాయని ఎస్. జానకి గారి మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. దక్షిణ భారత సినీ సంగీత ప్రపంచంలో జానకి గారు తన గళమాధుర్యంతో సంగీతాభిమానుల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని తెలిపారు. అనేక చిత్రాల్లో పాత్ర సన్నివేశాలకు, సందర్భాలకు అనుగుణంగా నవరసాలను పలికిస్తూ పాడిన పాటలు శ్రోతలను మంత్ర ముగ్ధులను చేశాయని పేర్కొన్నారు. వారు తెలుగు వారు కావడం తెలుగు ప్రజలకు గర్వకారణమని పేర్కొన్నారు. తెలుగు, తమిళం, హిందీతో పాటుగా మొత్తం 17 భాషల్లో 50 వేలకు పైగా పాటలు పాడి ఎన్నో జాతీయ పురస్కారాలు అందుకున్నారని గుర్తుచేశారు. జానకమ్మ గారి మరణం భారతీయ చలన చిత్ర పరిశ్రమకే కాకుండా కోట్లాది సంగీతాభిమానులకు తీరని లోటు అని పేర్కొన్నారు. భగవంతుడు వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ జానకి గారు కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి గారు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# కాళేశ్వరాన్ని ఎన్డీఎస్ఏకు అప్పగించేందుకు సిద్ధం



మాట్లాడుతూ, మహారాష్ట్రలో భారీ వర్షాలతో గోదావరిలో ప్రవాహం పెరిగినప్పటికీ కాళేశ్వరం ద్వారా నీటిని ఎత్తిపోయడం సాంకేతికంగా సాధ్యం కాదన్నారు. మేడిగడ్డ వద్ద నీటి ప్రవాహం ఉండటం వేరు, పంపింగ్‌కు అవసరమైన నీటిమట్టం ఉండటం వేరని చెప్పారు. కన్నెపల్లి (లక్ష్మి) పంప్‌హౌస్ ద్వారా నీటిని ఎత్తాలంటే కనీసం 93.50 మీటర్ల నీటిమట్టం అవసరమని, ప్రస్తుతం అక్కడ 89.90 మీటర్ల మాత్రమే ఉందని వివరించారు. ఈ పరిస్థితుల్లో నీళ్లు ఎత్తాలని డిమాండ్ చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని విమర్శించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను ఎన్డీఎస్ఏ సమగ్రంగా పరిశీలించి, మూడు బ్యారేజీలూ ప్రస్తుతం నీటి నిల్వకు సురక్షితం కావని తుది నివేదికలో స్పష్టం చేసిందన్నారు. పునరుద్ధరణ డిజైన్లు, మరమ్మతులు, భద్రతా చర్యలు అన్నీ ఎన్డీఎస్ఏ లేదా కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆమోదంతోనే చేపట్టాలని ఆ సంస్థ సిఫారసు చేసిందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఇటీవల ప్రత్యేక సాంకేతిక పర్యవేక్షణ కమిటీని నియమించిందని, ఆ కమిటీ కూడా నిర్మాణపరమైన లోపాలను గుర్తించిందన్నారు. బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్‌ను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ, వ్యక్తిగతంగా ఆయనపై గౌరవం ఉన్నప్పటికీ, సాగునీటి శాఖ అధికారులు, ఎన్డీఎస్ఏ నిపుణులతో మాట్లాడకుండా బీఆర్ఎస్ వాదననే సమర్థించడం సరికాదన్నారు. ఈటెల రాజేందర్ ముందు తాను రెండు డిమాండ్లు పెడుతున్నానని పేర్కొన్న ఆయన, మొదట ఎన్డీఎస్ఏను కలిసి ప్రస్తుత పరిస్థితుల్లో నీటిని ఎత్తిపోసే అవకాశం ఉందని ఒప్పించాలని, అలా జరిగితే ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని చెప్పారు. రెండోది, కాళేశ్వరం అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వం సీబీఐకి అప్పగించిన కేసు విచారణ వేగవంతం అయ్యేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. కాళేశ్వరం కేసును 2025 సెప్టెంబర్ 1న జీవో నెం.104 ద్వారా సీబీఐకి అప్పగించినప్పటికీ విచారణ ఇంకా వేగం పుంజుకోకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈ అంశంపై కేంద్రం సమాధానం చెప్పాల్సిందేనని, అవసరమైతే పార్లమెంట్‌లో కూడా ప్రశ్నిస్తామని హెచ్చరించారు. హరీష్ రావుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడిన ముఖ్యమంత్రి, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన తప్పులు, అవినీతి బయటపడకుండా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన నిర్ణయాలపై సమాధానం చెప్పకుండా ఇప్పుడు రాజకీయ విమర్శలు చేయడం సరికాదన్నారు. ఎన్డీఎస్ఏ నివేదికలను పక్కనబెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రచారం మానుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రాజకీయ విమర్శలను పక్కనబెట్టి ఎన్డీఎస్ఏ సూచనల మేరకే కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ పనులను కొనసాగిస్తుందని

## సీఎం రేవంత్‌తో ఎమిరేట్స్ ప్రతినిధుల భేటీ



హైదరాబాద్,జులై (జనంసాక్షి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎమిరైట్స్ వైమానిక సంస్థ ఇండియా వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సార్థన్ శనివారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై సీఎంతో చర్చించారు. ఎమిరైట్స్ వైమానిక సంస్థ 25 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సీఎంను మర్యాదపూర్వకంగా ఎమిరైట్స్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ కలిశారు. హైదరాబాద్‌లో ఎమిరైట్స్‌ఎ-38 సర్వీసులను ప్రారంభించేందుకు ఈ సంస్థ వైస్ ప్రెసిడెంట్ సుముఖత వ్యక్తం చేశారు. ఎమిరైట్స్ విమాన సర్వీసులను మరిన్ని పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. తెలంగాణలో మరో రెండు కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు కాబోతున్న నేపథ్యంలో అక్కడ కూడా ఎమిరైట్స్ ఆపరేషన్స్ కొనసాగించాలని సీఎం సూచించారు. విమాన సర్వీసులకు కావాల్సిన అన్నిరకాల సౌకర్యాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గచ్చిబౌలి స్పోర్ట్స్ యూనివర్శిటీలో క్రీడాకారులకు శిక్షణ అందించేందుకు స్పాన్సం షిప్‌నకు ముందుకు రావాలని సీఎం కోరారు. ఈ విషయంపై ఎమిరైట్స్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ సానుకూలంగా స్పందించారు.

## కావాలనే కన్నెపల్లి పంపులు తెరవడం లేదు

సిద్దిపేట,జులై11(జనంసాక్షి): ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్నది కాలం తెచ్చిన కరువు కాదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కుటిల బుద్ధితో తెచ్చిన కరువు అని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. గోదావరి నదిలో కావలసినన్ని నీళు ఉన్నప్పటికీ, కేసీఆర్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందోనన్న ఈర్ష్యతో కన్నెపల్లి పంప్ హౌస్ మోటార్లను ప్రభుత్వం కావాలనే ఆన్ చేయడం లేదని విమర్శించారు. సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం తిమ్మాయ్ పల్లి గ్రామంలో జరిగిన పెద్దమ్మ దేవాలయ ఉత్సవాల్లో హరీష్ రావు పాల్గొని మాట్లాడారు. సిద్దిపేట జిల్లా పెద్దమ్మ తల్లి రేవంత్ రెడ్డికి సద్బుద్ధిని ప్రసాదించాలని కోరుకున్నట్లు వెల్లడించారు. ఎంతటి కరవు వచ్చినా రైతాంగానికి నీరందించేలా కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని, మోటార్లు ఆన్ చేస్తే రంగనాయక సాగర్ నిండి, సిద్దిపేట నియోజకవర్గంలోని దాదాపు 70 నుంచి 80 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని స్పష్టం చేశారు. కాళేశ్వరంతో ఒక్క ఎకరం కూడా పండలేదని వెల్లడించిన ముఖ్యమంత్రి తిమ్మాయిపల్లి గ్రామానికి వచ్చి ప్రజలతో మాట్లాడితే అర్దమవుతుందని అన్నారు. తిమ్మాయిపల్లిలో తాగునీటి కోసం మహిళలు ఖాళీ బిందెలతో ఎదురుచూసే పరిస్థితి ఉండేదని, కాళేశ్వరం జలాల రాకతో ఈ ప్రాంతం బంగారు పంటలతో కళకళలాడుతోందని సంతోషం వ్యక్తం చేశారు. ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు నర్మెట ఫ్యాక్టరీ ద్వారా అద్భుతమైన ఆదాయం లభిస్తోందని తెలిపారు.

## గోదావరిలో నీళ్లున్నా కావాలనే వృధాగా వదులుతున్నారు



హైదరాబాద్,జులై11(జనంసాక్షి): ఇది కాలం తెచ్చిన కరువు కాదు కాంగ్రెస్ తెచ్చిన కరువు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. 2022 వరదల ఫోటోలు చూపి కన్నెపల్లి మునిగిందని అడ్డమైన మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఒకవైపు నీళ్లు లేక రైతులు ఏడుస్తుంటే.. రేవంత్ రెడ్డి ఏమో మా మీద కోపంతో నీళ్లు ఉన్నా కూడా ఇవ్వడం లేదని కేటీఆర్ మండిపడ్డారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఎక్కడా నీళ్లు లేకపోయినా కన్నెపల్లిలో మాత్రం నీళుఉన్నాయని.. మేడిగడ్డను ముట్టకుండా కన్నెపల్లి నుండి అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి, మిడ్ మానేరు అన్ని జలాశయాలు నింపొచ్చునని కేటీఆర్ వివరించారు. రిటైర్డ్ ఇంజనీర్ల నివేదిక చూసి అయినా సోయి తెచ్చుకో రేవంత్ రెడ్డి అని కేటీఆర్ హితవు పలికారు. మేడిగడ్డ గేట్లు మూసివేయకుండానే కన్నెపల్లి పంప్ హౌస్ నుండి నీళ్లు లిఫ్ట్ చేయవచ్చు అని రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ప్రభుత్వానికి లేఖ రాసింది. కన్నెపల్లి వద్ద ప్రస్తుతం 96.79 మీటర్ల నీళు ప్రవహిస్తున్నాయి, కానీ 94 మీటర్లకే పంపులు ఆన్ చేయవచ్చు. మరో 100 రోజులు కన్నెపల్లి వద్ద ఇదే తరహా ప్రవాహం ఉంటుంది. 100 రోజుల్లో రోజుకి 2 టీఎంసీల చొప్పున 200 టీఎంసీల లిఫ్ట్ చేస్తే, గోదావరి బేసిన్లో ఉన్న అన్ని రిజర్వాయర్లు నింపి సస్యశ్యామలం చేసే అవకాశం ఉందని ప్రభుత్వానికి రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ప్రభుత్వానికి లేఖ రాసిందన్నారు. మా మీద కక్షతో రైతుల నోట్లో మట్టి కొట్టకు.. కాళేశ్వరం ప్రాజెక్టును బద్నాం చేసే కుట్రలో రైతులకు నీళు ఇవ్వకుండా వాళ్లని ఆగం చేయకు రేవంత్ రెడ్డి అని కేటీఆర్ కోరారు. గోదావరిలో కళ్ల ముందు లక్ష క్యూసెక్కుల నీళ్లు వరదలాగా కిందకి పోతుంటే అక్కడ ఎత్తిపోయడానికి నీళ్లు లేవు అన్నవాడు బుర్రతక్కువ వాడా..? లేదా రైతుల కోసం ఈ పని చేయమన్నోడు బుర్రతక్కువ వాడా..? అని కేటీఆర్ అన్నారు. కన్నెపల్లి వద్ద 93 మీటర్ల నుండే నీళ్లు ఎత్తిపోసే అవకాశం ఉంటే.. రాజకీయ ద్వేషంతో కళ్లు మూసుకున్న రేవంత్ రెడ్డి బుర్రతక్కువ వాడివో కాదో చెప్పాలన్నారు. అలాగే మేడిగడ్డ వద్ద 97 మీటర్ల ఎత్తులో నీళ్లు పోతుంటే కళ్లు ఉండి చూడలేని నువ్వు బుర్రతక్కువ వాడివా.. లేదా వాస్తవాలు చూపించే మేము తెలివి లేనివాళ్లమో చెప్పాలని డిమాండ్ చేశారు. పోలవరం వల్ల మునిగే భద్రాచలాన్ని పట్టుకొని మేడిగడ్డ వల్ల మునిగిపోతుంది అంటున్న నీకు బుర్రలేదు.. అంటూ మండిపడ్డారు. రైతాంగం మొత్తం కన్నెపల్లి నుండి నీళ్లు ఇవ్వమంటే పట్టించుకోని వాడిని బుర్రతక్కువ వాడు అనాలా లుచ్చా అనాలా..? అని కేటీఆర్ ఫైర్ అయ్యారు. గురువు కోసం నీళ్లు కిందకి వదులుతున్నావా..? అని రైతులు అడిగితే దానికి సమాధానం చెప్పే దమ్ము లేని దద్దమ్మ అనాలా, దరిద్రుడు అనాలా, ఏమనాలో చెప్పాలని కేటీఆర్ అడిగారు.

## ఓటీటీ సినిమాలకూ సెన్సార్ షిప్

బోర్డ్ వద్దకు వెళ్లినప్పుడు ఏకంగా 120కి పైగా కట్స్ చెప్పారు. అందుకు నిర్మాతలు నిరాకరించి, నేరుగా ఓటీటీ వేదికపై విడుదల చేసినప్పటికీ, వివాదం రేగడంతో కేవలం 48 గంటల్లోనే ఆ సినిమాను తొలగించాల్సి వచ్చింది. ఇలాంటి ఘటనల నేపథ్యంలోనే, థియేటర్ల కోసం కాకుండా నేరుగా డిజిటల్ వేదికలపై వచ్చే కంటెంట్‌కు కూడా ముందస్తు పర్యవేక్షణ ఉండాలని ప్రభుత్వం గట్టిగా నిర్ణయించుకుంది. ఇందులో భాగంగానే ఓటీటీలో నేరుగా విడుదలయ్యే చిత్రాలకు కూడా సెన్సార్ సర్టిఫికేషన్ తప్పనిసరి చేయాలనే ప్రతిపాదనను పరిశీలిస్తున్నారు. కేవలం సినిమాలకే కాకుండా, ఓటీటీ వెబ్ సిరీస్‌లను కూడా ఈ సెన్సార్ పరిధిలోకి తీసుకురావాలా లేదా అనే అంశంపై వివిధ వర్గాలతో మరియు ఐటీ శాఖతో కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ప్రస్తుతం కీలక చర్చలు జరుపుతోంది. ఒకవేళ ఈ నిబంధనలు కనుక అమల్లోకి వస్తే, డిజిటల్ కంటెంట్ క్రియేటర్ల సృజనాత్మక స్వేచ్ఛపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# విహారంలో విషాదం

బోటులో 75 మంది భారతీయులు ఉండగా.. ఎక్కువగా తెలుగు రా ష్ట్రాలకు చెందినవారు, తమిళ నాడు వాసులు చనిపోయినట్లుగా తెలు స్తోంది. అయితే వారి పూర్తి వివరాలు, స్వస్థలాలు, కుటుంబ సభ్యు ల సమాచారం సేకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. భారత రాయబార కార్యాలయం కూ డా వియత్నాం అధికారులతో సంప్రదింపులు జరుపుతూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది. బోటు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగుతోంది. ప్రతికూల వాతావరణ పరిస్థితులా, సాంకేతిక లోపమా, లేక మరే ఇతర కారణమా అన్న కోణంలో అధికారులు విచారణ చేపట్టారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు అధికారిక దర్యాప్తు అనంతరం వెల్లడికానున్నాయి. ఈ విషాద ఘటనతో మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. తెలుగు రాష్ట్రాల్లోని బంధువులు, స్నేహితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాలను స్వదేశానికి తరలించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. ఈ విషయాన్ని వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం అధికారికంగా ధ్రువీకరించింది. ప్రస్తుతం స్థానిక అధికారులు ఘటనా స్థలంలో ముమ్మరంగా గాలింపు, సహాయక చర్యలు చేపడుతున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించిన కచ్చితమైన వివరాలు, బోటులో మొత్తం ఎంతమంది పర్యాటకులు ఉన్నారు.. వారి ప్రస్తుత పరిస్థితి ఏమిటన్నది ఇంకా పూర్తిగా తెలియరాలేదు. ఈ ఘటనపై భారత రాయబార కార్యాలయం సామాజిక మాధ్యమం 'ఎక్స్ లో స్పందిస్తూ.. 'ఓ విషాదకరమైన ఘటనలో, కొన్ని గంటల క్రితం వియత్నాంలోని ఫు క్వాక్ ద్వీపం సమీపంలో పలువురు భారతీయ పర్యాటకులతో వెళుతున్న బోటు బోల్తాపడింది. స్థానిక అధికారులు రెస్క్యూ ఆపరేషన్లు కొనసాగిస్తున్నారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నాం' అని పేర్కొంది. ప్రమాదానికి గురైన పర్యాటకుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించేందుకు, అవసరమైన సహాయం చేయడానికి భారత ప్రభుత్వం వియత్నాంలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటుచేసింది. ప్రమాద సమయంలో బోటులో సుమారు 30 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన సుమారు 18 మంది మరణించినట్లు సమాచారం. కృష్ణా జిల్లా మచిలీపట్నానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కిషోర్ కుటుంబం కూడా ఈ విహారయాత్రలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో కిషోర్ భార్య మరణించగా, అపస్మారక స్థితిలోకి వెళ్లిన కిషోర్‌ను స్థానిక ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. స్థానిక అధికారుల సహాయక చర్యలు పూర్తిగా ముగిసిన అనంతరం ఈ వివరాలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కడప జిల్లాకు చెందిన డిస్ట్రిబ్యూటర్ శ్రీధర్, మచిలీపట్నంకు చెందిన జయశ్రీ మరణించారు. కడపకు చెందిన మరో డిస్ట్రిబ్యూటర్ నయీం ఒడ్డున ఉండటంతో ప్రాణాలు దక్కించుకున్నారు. ట్రిప్‌లో భాగంగా వీరు మూడు పడవల్లో సముద్రంలో విహార యాత్రకు వెళ్లారు. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో హాన్ మే రుట్ నుంచి అన్‌థోయ్ పోర్టుకు ఒక స్పీడ్ బోట్ బయల్దేరింది. అందులో 32 మంది భారతీయులు, నలుగురు సిబ్బంది ఉన్నారు. ఈ పడవ తీరానికి 400 మీటర్ల దూరంలో ఉండగా.. సముద్రంలో ఒక్కసారిగా బోల్తా పడింది. దీంతో ప్రయాణికులు నీటిలో మునిగిపోయారు. ప్రమాదం జరిగిన వెంటనే గమనించిన సమీపంలోని ఇతర పర్యాటక బోట్ల నిర్వాహకులు.. అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అయితే, బోటు పూర్తిగా తలకిందులు కావడంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. అటు అలల ఉధృతి కూడా తీవ్రంగా ఉండటంతో టూరిస్టులను కాపాడటం కష్టంగా మారింది. వీరిలో కొందరిని రెస్క్యూ సిబ్బంది రక్షించి ఆసుపత్రికి తరలించారు. మరికొందరు గల్లంతవ్వగా వారి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. వాతావరణ మార్పుల కారణంగానే బోటు మునిగినట్లు తెలుస్తోంది.

10 మంది తమిళనాడుకు చెందిన వారే..

వియత్నాంలో జరిగిన ఘోర బోటు ప్రమాదంలో 15 మంది మరణించగా.. వారిలో 10 మంది తమిళనాడుకు చెందిన వారేనని తెలిసింది. మిగతా వారిలో ముగ్గురిని ఏపీ, ఇద్దరిని కేరళకు చెందిన వారిగా గుర్తించారు. ఈ ఘటనలో కడప జిల్లాకు చెందిన డిస్ట్రిబ్యూటర్ శ్రీధర్, మచిలీపట్నంకు చెందిన జయశ్రీ, హిందూపురానికి చెందిన రవితేజ ప్రాణాలు కోల్పోయారు. ఈ మేరకు వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం వివరాలు వెల్లడించింది.

రాష్ట్రపతి, ప్రధాని సంతాపం

బోటు ప్రమాద ఘటనపై భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు ప్రధాని మోదీ పేర్కొన్నారు. అక్కడున్న మన రాయబార కార్యాలయం, కాన్సులేట్‌లు అన్ని సహాయ సహకారాలు అందిస్తున్నాయని, వియత్నాం అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాయని చెప్పారు. మరోవైపు, ఈ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ పేర్కొన్నారు. రాష్ట్రానికి చెందిన బాధితులకు సహాయం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

# దేశంలో 7 బుల్లెట్ ట్రైన్లలో మూడు తెలంగాణకే

బడ్జెట్ రూ.880 కోట్లు మాత్రమే.. మోదీ సర్కార్ కేవలం తెలంగాణకే రూ.5వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను ఆధునికంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. దేశ వ్యాప్తంగా 1,300 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పనులు చేపట్టామని వివరించారు. ఇప్పటికే 260 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పూర్తయ్యిందని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఇందులో భాగంగా తెలంగాణలో 40 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణకు నిధులు ఇచ్చామన్నారు. దేశంలో 7 బుల్లెట్ ట్రైన్స్ ప్రకటిస్తే.. అందులో తెలంగాణకు 3 దక్కాయని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ కారణంగానే తెలంగాణకు మూడు బుల్లెట్ ట్రైన్స్ దక్కాయని వెల్లడించారు. ఇవి అందుబాటులోకి వస్తే.. హైదరాబాద్ నుంచి విజయవాడకు కేవలం 1 గంట 10 నిమిషాలు.. హైదరాబాద్ నుంచి ముంబైకి 2 గంటల 20 నిమిషాలు.. హైదరాబాద్ నుంచి చెన్నయ్‌కి రెండు గంటల్లో వెళ్లవచ్చని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ దేశంలో పెద్ద మార్పునకు శ్రీకారం చుట్టబోతోంది. కొంతమంది దీని క్రెడిట్ తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రెడిట్ కేవలం నరేంద్ర మోదీకి మాత్రమే దక్కుతుందని అన్నారు. 'వికసిత్ భారత్-2047' లక్ష్య సాధనలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని అశ్విని వైష్ణవ్ అన్నారు. వందేభారత్ రైళ్లు ప్రపంచస్థాయి సాంకేతిక ప్రమాణాలతో రూపొందించబడ్డాయని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. తెలంగాణకు ఇప్పటికే ఐదు వందేభారత్ రైళ్లు అందుబాటులోకి వచ్చాయని, త్వరలో మరిన్ని సేవలు ప్రారంభమవుతాయని చెప్పారు. గత 12 ఏళ్లలో దేశవ్యాప్తంగా 36,000 కి.మీ. కొత్త రైల్వే ట్రాక్‌లు నిర్మించామని తెలిపారు. అలాగే 2,700 కి.మీ. డెడికేటెడ్ ÷-రెట్ కారిడార్ పూర్తి చేసినట్లు వెల్లడించారు. దేశంలోని రైల్వే నెట్‌వర్క్‌లో 99.4శాతం విద్యుద్దీకరణ పూర్తయిందని, దీంతో డీజిల్‌పై ఆధారపడటం దాదాపు పూర్తిగా తగ్గిపోయిందని చెప్పారు. తెలంగాణకు ఇప్పటికే ఐదు వందేభారత్ రైళ్లు అందుబాటులోకి వచ్చాయని, త్వరలో మరిన్ని సేవలు ప్రారంభమవుతాయని చెప్పారు.

ఎలక్ట్రానిక్స్, ఐటీ, చిప్ డిజైన్ రంగాల్లో ముందంజ

ప్రపంచవ్యాప్తంగా సెమికండక్టర్ పరిశ్రమలో దాదాపు 10 లక్షల మంది నైపుణ్యం కలిగిన ఉద్యోగుల కొరత ఉందని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ అవకాశాన్ని భారత్ సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. దేశానికి ఎలక్ట్రానిక్స్, ఐటీ, చిప్ డిజైన్ రంగాల్లో ఇప్పటికే బలమైన పునాది ఉందని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఇండస్ట్రీ లీడర్ టౌన్ హాల్' సమావేశంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశంలో ఎలక్ట్రానిక్స్, సెమికండక్టర్, బుల్లెట్ ట్రైన్, రైల్వే ఆధునికీకరణ వంటి రంగాల్లో జరుగుతున్న మార్పులను వివరించారు. విద్యార్థులకు సెమికండక్టర్ డిజైన్‌లో ప్రోత్సాహం అందించేందుకు సైనాప్సిస్, క్యాడెన్స్ వంటి అత్యాధునిక ఎఐ టూల్స్‌ను 315 విశ్వవిద్యాలయాలకు ఉచితంగా అందించినట్లు వెల్లడించారు. విద్యార్థులు స్వయంగా చిప్‌లను డిజైన్ చేసి, మొహాలీలోని సెమికండక్టర్ ల్యాబ్‌లో వాటిని తయారు చేసి పరీక్షించే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. ప్రపంచంలో చాలా కొద్ది విశ్వవిద్యాలయాలకే ఇలాంటి సదుపాయాలు ఉన్నాయని అన్నారు. దేశంలోని ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం రెండంకెల వృద్ధిరేటుతో దూసుకెళ్తోందని అశ్విని వైష్ణవ్ తెలిపారు. ప్రస్తుతం ఈ పరిశ్రమ విలువ రూ.13 లక్షల కోట్లకు చేరుకుందని, త్వరలోనే రూ.20 లక్షల కోట్లకు పెరుగుతుందని చెప్పారు. ఈ రంగం ద్వారా ఇప్పటికే 25 లక్షల మందికి ఉపాధి లభిస్తోందని వెల్లడించారు. ఈ మధ్య భారత్ నుంచి అత్యధికంగా ఎగుమతి అయ్యే వస్తువుల్లో మొబైల్ ఫోన్లు అగ్రస్థానంలో నిలిచాయని, ఒకప్పుడు పెట్రోలియం, జెమ్స్ అండ్ జ్యువెలరీ ఆధిపత్యం ఉన్నా ఇప్పుడు ఎలక్ట్రానిక్స్ రంగం వాటిని అధిగమించిందని తెలిపారు. తెలంగాణలో ప్రస్తుతం 104 ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థలు పనిచేస్తున్నాయని అశ్విని వైష్ణవ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 4 భారీ ఎలక్ట్రానిక్స్ క్లస్టర్లను మంజూరు చేసిందని చెప్పారు. హైదరాబాద్‌లో హార్డ్‌వేర్ ప్రోటోటైప్ డిజైన్, టెస్టింగ్, వ్యాలిడేషన్ కోసం కామన్ ఫెసిలిటీ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. దేశంలో తొలి బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు ముంబై-అహ్మదాబాద్ మధ్య వేగంగా నిర్మాణంలో ఉందని.. 2027లో తొలి దశ సేవలు ప్రారంభమవుతాయని అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఇదే అనుభవంతో దేశంలో మరో ఏడు బుల్లెట్ ట్రైన్ కారిడార్లకు ఆమోదం లభించిందని తెలిపారు.

## నన్ను చంపాలనుకుంటే ఇరాన్ అంతమే..

ఉంచామని ఆయన పేర్కొన్నారు. అవసరమైతే వేల క్షిపణులతో భారీ ప్రతీకార దాడులు జరుగుతాయని ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక 'ట్రూత్' ద్వారా వెల్లడించారు. నన్ను హత్య చేయాలని ఇరాన్ ప్రయత్నిస్తే భారీ విధ్వంసం తప్పదు. 1,000 క్షిపణులు ఇప్పటికే లక్ష్యాలను గురిపెట్టి సిద్ధంగా ఉన్నాయి. అంతటితోనే ఆగదు. అవసరమైతే మరిన్ని దాడులు జరుగుతాయి. ఇప్పటికే ఈ విషయమై సైన్యానికి ఆదేశాలు అందాయి. ఇరాన్‌లోని అన్ని ప్రాంతాలను ధ్వంసం చేయడానికి అమెరికా సైన్యం సిద్ధంగా ఉంది' అని ట్రంప్ హెచ్చరించారు. తనపై ఇరాన్ హత్యాయత్నం చేసే అవకాశం ఉందని గతంలో కూడా ట్రంప్ ఆరోపించారు. అలాంటి ప్రయత్నం జరిగితే అమెరికా ప్రతిస్పందన అత్యంత తీవ్రంగా ఉంటుందని, ఇరాన్ కీలక సైనిక స్థావరాలపై భారీ దాడులు జరుగుతాయని స్పష్టం చేశారు. కాగా, ఇప్పటికే హోర్ముజ్ జలసంధి, అణు ఒప్పందం వంటి అంశాలపై ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలో ఈ హెచ్చరికలు పరిస్థితిని మరింత సంక్లిష్టం చేసే అవకాశం కనబడుతోంది. ఇరాన్‌లోని అన్ని ప్రాంతాలను పూర్తిగా ధ్వంసం చేయడానికి తమ సైన్యం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. అంతకుముందు మీడియాతో మాట్లాడుతూ ట్రంప్ ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. తనను చంపడంలో ఆ దేశం సఫలమైతే.. తదుపరి ఏం చేయాలన్నదానిపై ఇప్పటికే సూచనలు జారీ చేశానన్నారు. 'ఏదైనా జరిగితే.. ఇంతకు ముందెన్నడూ లేనంత భారీ స్థాయిలో ఇరాన్ పై బాంబుల వర్షం కురిపించాలని నేను సూచనలు జారీ చేశా. అయితే టెహ్రాన్ నన్ను చంపడంలో విఫలమవుతుందని ఆశిస్తున్నా అని పేర్కొన్నారు. హర్మూజ్‌లో ప్రయాణిస్తోన్న నౌకలపై ఇరాన్ దాడులు చేయడం.. ఆ వెంటనే ఆ దేశంపై అమెరికా క్షిపణుల వర్షం కురిపించడంతో మరోసారి పశ్చిమాసియాను యుద్ధమేఘాలు కమ్మేశాయి. ఈ క్రమంలోనే డీల్ ముగిసిందంటూ ట్రంప్ ప్రకటన చేశారు. దాంతో.. ఇప్పటికే అంగీకరించిన అంశాల్లో వేటినైనా ఉల్లంఘిస్తే ప్రతిచర్య తప్పదని ఇరాన్ హెచ్చరించింది. చర్చలను కొనసాగించాలని తాము కోరినట్లు ట్రంప్ చేసిన వ్యాఖ్యలను కూడా ఖండించింది. తాము లొంగిపోవడంతోనే యుద్ధం ముగియదని ఇరాన్ పార్లమెంటర్ స్పీకర్ ఘాలిబఫ్ పేర్కొన్నారు. యుద్ధాన్ని ముగించడం ప్రపంచ దేశాలకు ప్రాధాన్యాంశం. ఇరాన్ లొంగిపోవడంతో ఎప్పటికీ ఈ యుద్ధం ముగిసిపోదని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి. అమెరికన్లు ఎప్పుడైతే అవగాహన ఒప్పందాన్ని ఉల్లంఘిస్తారో.. అప్పుడు మమ్మల్ని మేము రక్షించుకోవడానికి సిద్ధంగా ఉంటాం అని వెల్లడించారు. అలాగే యుద్ధానికి సిద్ధంగా ఉన్నవారే.. అమెరికాతో చర్చలు జరపగలరని వ్యాఖ్యానించారు.

### నెత్తుటి బాకీ తీర్చుకుంటాం

పేర్కొన్నారు. అయితే, ఈ విషయం తన నాయకత్వంపై లేదా ఇతర అధికారులపైనా ఆధారపడి లేదన్నారు. తనను లక్ష్యంగా చేసుకోవడానికి ప్రయత్నిస్తే తీవ్ర ప్రతిస్పందన ఉంటుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌ను హెచ్చరించిన నేపథ్యంలో ఈ ప్రకటన వచ్చింది. ఇదిలాఉంటే, ఫిబ్రవరి 28 నాటి అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో ఆయతుల్లా అలీ ఖమేనీ మృతి చెందగా.. జులై 9న ఆయన అంత్యక్రియలు పూర్తయ్యాయి. అయితే, ఆ దాడిలో తీవ్రంగా గాయపడిన మొజ్తబా మాత్రం.. తండ్రి అంత్యక్రియల కార్యక్రమానికి హాజరుకాలేదు.

# చిరుతపులి దాడిలో ఆవు మృతి!



కుబీర్, జూలై 11, (జనంసాక్షి): కుబీర్ మండల పరిధిలోని డోదర్న తాండా–3 పరిసర అటవీ ప్రాంతంలో శనివారం చిరుతపులి దాడి కలకలం రేపింది. స్థానికులు, అటవీ శాఖ అధికారుల కథనం ప్రకారం.. శనివారం ఉదయం వ్యవసాయ పొలాల సమీపంలో పశువుల మంద మేస్తుండగా, ఒక్కసారిగా దూసుకొచ్చిన చిరుతపులి పశువుల మందపై దాడి చేసింది. ఈ దాడిలో డోదర్న తాండాకు చెందిన రైతు జాదవ్ ఉత్తమ్‌కు చెందిన ఒక ఆవుపై చిరుత దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. చిరుత పంజా విసిరి, మెడపై తీవ్రంగా కొరకడంతో ఆ ఆవు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. సమాచారం అందుకున్న వెంటనే అటవీ శాఖ అధికారులు, వెటర్నరీ వైద్య బృందం ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతి చెందిన పశువు మెడ భాగంలో ఉన్న లోతైన గాయాలు, అక్కడ లభించిన పాదముద్రల ఆధారంగా ఇది కచ్చితంగా చిరుతపులి దాడేనని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. ఆవు మృతితో నష్టపోయిన రైతు జాదవ్ ఉత్తమ్‌ను ప్రభుత్వం తరపున ఆదుకుంటామని అటవీ అధికారులు హామీ ఇచ్చారు. నష్టపరిహారానికి సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ పరిశీలనలో ఎఫ్ఎస్ఓ లక్ష్మణ్, ఎఫ్‌బీఓ రాజేష్, వెటర్నరీ అసిస్టెంట్ అవినాష్, యానిమల్ ట్రాకర్ శివ, గోరఖ్ నాథ్ తదితరులు ఉన్నారు. అటవీ ప్రాంత పరిసర గ్రామాల ప్రజలు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# యాదగిరిగుట్టను అత్యుత్తమ ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దాలి

- దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి కొండాసురేఖ
- యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం
- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ



యాదగిరిగుట్ట (జనంసాక్షి) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయాల మేరకు యాదగిరిగుట్టను దేశంలోనే అత్యుత్తమ ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండాసురేఖ యాదగిరిగుట్ట నూతన పాలకమండలికి సూచించారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం దేవస్థానం ఖ్యాతిని మరింత పెంచే బాధ్యత నూతన పాలక మండలిపై ఉందని వారు పాలకమండలికి దిశానిర్దేశం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నూతన పాలక మండలి ప్రమాణస్వీకారోత్సవంలో మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, ట్రస్ట్ బోర్డు ఎక్స్ అఫీషియో సభ్యులు స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దేవస్థానానికి చేరుకున్న మంత్రిగారికి ఆలయ అర్చకులు సంప్రదాయరీతిలో పూర్ణకుంభ స్వాగతం పలికారు. పూజా కార్యక్రమంలో పాల్గొన్న తర్వాత వేదపండితులు మంత్రి సురేఖ గారికి వేదాశీర్వచనం చేశారు. ఆలయ ఈవో భవానీ శంకర్ మంత్రి సురేఖకు లక్ష్మీ సమేత నరసింహస్వామి వారి చిత్రపటాన్ని బహూకరించారు. ఛైర్మన్ ఎం. సత్యనారాయణ రెడ్డితో పాటు హాజరైన పాలక మండలి సభ్యులు ఆలయ ముఖమండపం ప్రాంగణంలో మంత్రి సురేఖ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేసి, అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నదన్నారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్యాత్మిక వైభవాన్ని మరింత పెంపొందిస్తూ, దేశవ్యాప్తంగా భక్తులకు ఆదర్శ క్షేత్రంగా తీర్చిదిద్దేందుకు నూతన పాలక మండలి సమిష్టిగా కృషి చేయాలని మంత్రి పిలుపు నిచ్చారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఛైర్మన్, సభ్యులు అంకిత భావంతో పనిచేస్తూ ఆలయ అభివృద్ధి, పారదర్శక పాలన, భక్తులకు మరిన్ని సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు. ఆలయ పవిత్రత, సంప్రదాయాలను కాపాడుతూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని, పాలక మండలి సభ్యులందరూ సమన్వయంతో పనిచేసి దేవస్థానం మరింత అభివృద్ధి చెందేలా కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు.

## సమాచార వ్యవస్థ బలోపేతంతో నాణ్యమైన పోలీసింగ్

- డీఐజీ ఆర్. భాస్కరన్ సమీక్ష




నిర్మల్ బ్యూరో, జూలై 11 (జనంసాక్షి) : బాసర జోన్–2 డీఐజీ ఆర్. భాస్కరన్ తొలిసారిగా నిర్మల్ జిల్లాను సందర్శించి జిల్లా పోలీసు అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ జి.జానకి షర్మిల ఆయనకు స్వాగతం పలికారు. సమావేశంలో శాంతిభద్రతలు, పెండింగ్ కేసుల దర్యాప్తు, మహిళలు, చిన్నారుల భద్రత, సైబర్ నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలన, కమ్యూనిటీ పోలీసింగ్ అంశాలపై సమీక్షించారు. పోలీసు సమాచార వ్యవస్థను బలోపేతం చేసి, ప్రతి కేసులో శాస్త్రీయ దర్యాప్తు, వేగవంతమైన విచారణ చేపట్టాలని డీఐజీ అధికారులకు సూచించారు. అనంతరం ఎస్పీ డా. జి. జానకి షర్మిల పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో అమలు చేస్తున్న పోలీస్ అక్క"నారీ శక్తి', శివంగి టీమ్ గంజా గస్తీ వంటి వినూత్న కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, డీఎస్పీ శ్రీనివాస్‌తో పాటు జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## చారిత్రక పోరాటాలను గుర్తు చేసుకుందాం



హైదరాబాద్ (జనంసాక్షి) : నేషనల్ కో ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్స్ (ఎన్‌సీసీపీఏ) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వెంకట రెడ్డి అధ్యక్షతన ఉద్యోగుల చారిత్రక పోరాటాల చరిత్రను గుర్తు చేసుకునే సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ఎంఎన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఉద్యమాలు నిర్వహించాలనుకునే నాయకులు గత పోరాటాలను అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. 1946 జులై 11 నుండి జరిగిన దేశవ్యాప్త కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు పెద్ద ఎత్తున పోరాటం చేసి కరువు భత్యం, మెరుగైన వేతనాలు సాధించారని అన్నారు. 1960 జులై 11నుండి 5రోజుల పాటు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు సమ్మెచేశారు. దాదపు రెండు లక్షల మంది సమ్మెలో పాల్గొన్నారు. 10వేల మంది అరెస్టు అయ్యారు. వేలాది మంది ఉద్యోగాలు కోల్పోయారు. సమ్మెకాలంలో ఏ డిమాండ్ ని సాధించకపోయినా తదుపరి కాలంలో మెరుగైన డిఏ, వేతనాలు సాధించడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. ఈ సదస్సులో రామచంద్రుడు, సోమయ్య, జలాలుద్దీన్, ప్రేమ్ కుమార్, ప్రభాకర్, క్రిష్ణమోహన్, గడ్డం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానికులకు ఉపాధి ఉద్యోగావకాశాలు కల్పించాలి

- ఎంపీ గడ్డం వంశీకృష్ణ
- తాడిచర్ల బ్లాక్-02 గని సైట్ పరిశీలన



మల్హర్, జూలై 11(జనంసాక్షి) : నూతనంగా ఏర్పాటు చేయబోయే తాడిచర్ల బ్లాక్–2 కోల్ ప్రాజెక్టులో స్థానిక యువతకు పెద్దపీట వేస్తూ ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ సూచించారు. శనివారం ఆయన సింగరేణి ఉన్నతాధికారులతో కలిసి తాడిచర్ల బ్లాక్–2 గని సైట్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సింగరేణి అధికారులు ప్రాజెక్ట్ మ్యాప్ ద్వారా ఎంపీకి వివరాలు అందించారు. దాదాపు 40 నుంచి 50 ఏళ్ల జీవితకాలం ఉండే ఈ ప్రాజెక్టుకు మొత్తం 1800 పైచిలుకు హెక్టార్ల భూసేకరణ అవసరమని, అందులో ప్రస్తుతం ప్రాథమికంగా 290 హెక్టార్ల పట్టా భూమి సేకరించాల్సి ఉందని వివరించారు. అనంతరం ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ.. తాడిచెర్ల బ్లాక్ గనిని సింగరేణికి కేటాయించేలా పార్లమెంట్‌లో తాము నిరంతరం పోరాడామని గుర్తుచేశారు. దివంగత నేత కాకా వెంకటస్వామి కాలం నుంచి నేటి వరకు తమ కుటుంబం ఈ ప్రాంత ప్రజల శ్రేయస్సు, అభివృద్ధి కోసమే పాటుపడుతోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎలాంటి అడ్డంకులు లేకుండా ఈ ప్రాజెక్టుకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని కోరారు. భూనిర్వాసితులందరికీ ఎలాంటి రాజకీయ పక్షపాతం లేకుండా పూర్తి న్యాయం జరిగేలా అన్ని రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా చొరవ చూపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ఉన్నతాధికారులు, తహసీల్దార్ కె రవి కుమార్ పాల్గొన్నారు.

# అన్ని రంగాలకు సమానా ప్రాధాన్యత

**జిల్లాల సమగ్రాభివృద్ధికి నిరంతర కృషి**

**రాష్ట్ర ఆబ్కారీ మద్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు**



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జులై 11(జనంసాక్షి ): రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, గిరిజన సంక్షేమం, పేదల గృహ నిర్మాణం వంటి అన్ని రంగాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ జిల్లాల సమగ్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర ఆబ్కారీ మద్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం జిల్లాలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ కె.హరిత, జిల్లా ఎస్.పి. నితికా పంత్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, శాసనమండలి సభ్యులు దండే విఠల్, ఆసిఫాబాద్ శాసనసభ్యులు కోవ లక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల్ల మంగ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఆసిఫాబాద్ మండలం మానిక్‌గూడ, వాంకిడి మండలం కోమటిగూడ గ్రామాలలో 20 లక్షల రూపాయల చొప్పున నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలను ప్రారంభించడం జరిగిందని, ఈ భవనాల ద్వారా గ్రామస్థాయిలో ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. గ్రామపంచాయతీలు గ్రామాల అభివృద్ధికి కేంద్రబిందువులుగా మారాలని, ప్రజలకు అవసరమైన సేవలు పారదర్శకంగా అందించాలని అధికారులను ఆదేశించారు. కెరమెరి మండలం ధనోరా గ్రామంలో 10 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన మహిళా సమాఖ్య సంఘ భవనాన్ని ప్రారంభించడం జరిగిందని, మహిళా సంఘాలు ఆర్థికంగా మరింత బలోపేతం కావడానికి ప్రభుత్వం అనేక సంక్షేమ, స్వయం ఉపాధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. మహిళలు సంఘటితంగా ముందుకు సాగి స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని కుటుంబాలతో పాటు సమాజాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని తెలిపారు. ఆసిఫాబాద్ మండలం అడ గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించి నిరుపేద కుటుంబానికి సొంత ఇంటి కలను నెరవేర్చడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కెరమెరి మండలం సుర్దాపూర్ గ్రామానికి చెందిన పోడు రైతులు తాతముత్తాతల కాలం నుంచి తాము సాగు చేసుకుంటున్న భూములను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, సాగు భూములలోకి వెళ్లకుండా పోలీసుల ద్వారా ఇబ్బందులు ఎదురవుతున్నాయని రాష్ట్ర మంత్రి దృష్టికి తీసుకురాగా స్పందిస్తూ 2005 సంవత్సరానికి ముందు నుంచి సాగు చేస్తున్న పాత పోడు భూముల విషయంలో రైతులను ఎట్టి పరిస్థితులలోనూ ఇబ్బందులకు గురిచేయవద్దని అధికారులకు సూచించారు. అదే సమయంలో కొత్తగా అటవీ భూములను ఆక్రమిస్తూ పోడు సాగు చేయకూడదని, పోడు భూములకు సంబంధించిన అంశం కేంద్ర ప్రభుత్వ పరిధిలోని చట్టాలకు సంబంధించినదని, గిరిజనేతర రైతుల సంబంధిత సమస్యలపై అధికారులతో చర్చించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సుర్దాపూర్ గ్రామ రైతుల భూ సమస్యపై జిల్లా అధికారులు, అటవీశాఖ అధికారులతో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించి, చట్టపరమైన సాధ్యాసాధ్యాలను పరిశీలించి సాగుకు అనుకూలమైన పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని తెలిపారు. భూములు, ఆస్తులు శాశ్వతం కావని, పిల్లలే మనకు నిజమైన ఆస్తిఅని, వారిని బాగా చదివించి ఉన్నత స్థానాలలో నిలబెట్టడం ప్రతి తల్లిదండ్రుల బాధ్యత అని తెలిపారు. విద్య ద్వారానే కుటుంబాలు, గ్రామాలు, సమాజం అభివృద్ధి చెందుతాయని తెలిపారు. జిల్లా అభివృద్ధి, ప్రజల సంక్షేమం, గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన, మహిళల సాధికారత, రైతుల సమస్యల పరిష్కారం వంటి అంశాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు . ఈ కార్యక్రమాల్లో జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## పానీపూరీ రుచి చూసిన అశ్వినీ వైష్ణవ్

హైదరాబాద్, జులై 1 (జనంసాక్షి) : హైదరాబాద్‌లో పర్యటిస్తున్న కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ పానీ పూరి రుచి చూశారు. హెచ్ఐసీసీలో వికసిత్ భారత్–2047.. సాంకేతికత పాత్ర' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో కిషన్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెచ్ఐసీసీలోని చాట్‌బండార్ వద్ద పానీ పూరి తిన్నారు. అనంతరం యూపీఐ ద్వారా రూ.175 అశ్వినీ వైష్ణవ్ చెల్లించారు.

## ప్రభుత్వ విధులకు ఆటంకం

**నలుగురికి 14 రోజుల రిమాండ్**

గోపాల్‌పేట, జూలై 11 (జనంసాక్షి) : విధుల్లో ఉన్న పోలీసులతో దురుసుగా ప్రవర్తించి ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించిన నలుగురికి వనపర్తి కోర్టు 14 రోజుల జుడీషియల్ రిమాండ్ విధించింది. పోలీసుల వివరాల ప్రకారం, ఈ నెల 9న రాత్రి మున్ననూర్ గ్రామంలో నైట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న గోపాల్‌పేట ఎస్ఐ డి. శశిధర్ బృందం రామకృష్ణ కిరాణా దుకాణం వద్ద కొందరు వ్యక్తులు బహిరంగంగా గొడవపడుతుండగా అడ్డుకుంది. అక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించగా వారు పోలీసులతో వాగ్వాదానికి దిగి విధులకు ఆటంకం కలిగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు మున్ననూర్‌కు చెందిన దండు చంద్రయ్య (57), మండ్ల బాలరాజు (51), ఎర్ర శాంతన్న (50), అడ్డకుల ఆంజనేయులు (61)లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు 14 రోజుల జుడీషియల్ రిమాండ్ విధించి మహబూబ్‌నగర్ జిల్లా జైలుకు తరలించారు. ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించినా, శాంతిభద్రతలకు విఘాతం సృష్టించినా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## గ్రీన్ రిసార్ట్స్‌లో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

నర్సంపేట జూలై 11 (జనం సాక్షి) : నర్సంపేట పట్టణంలోని గ్రీన్ రిసార్ట్స్‌లోని ఓ గదిలో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై అరుణ్ తెలిపారు. అరెస్టు చేసిన వారిలో తమ్మిశెట్టి సురేష్, వీరమనేని సాగర్, శాకమూరి వెంకటేశ్వరరావు, వాంకుడోతు భద్రు, జాటోతు రమేష్ (ఖానాపురం గ్రామం నివాసితులు), వేములల కృష్ణారెడ్డి ఉన్నారు.

## గవర్నర్‌ను కలిసిన టీజీ-రెరా చైర్మన్



హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (టీజీ–రెరా) చైర్మన్ కె.ఎస్. శ్రీనివాస రాజు శనివారం లోక్ భవన్‌లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీజీ–రెరా పనితీరు, చేపడుతున్న కార్యక్రమాలు, రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగంలో పారదర్శకత, జవాబుదారీతనం, వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం అమలు చేస్తున్న చర్యల గురించి గవర్నర్‌కు ఆయన వివరించారు. అనంతరం బీసీ జాయింట్ యాక్షన్ కమిటీ (బీసీ జేఏసీ) చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ నాయకత్వంలోని ప్రతినిధి బృందం గవర్నర్‌ను కలిసింది. తదనంతరం బీజేపీ మైనారిటీ మోర్చా తెలంగాణకు చెందిన జగ్మోహన్ సింగ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం గవర్నర్‌ను కలిసింది.

## ఎస్. జానకి మృతి భారతీయ సంగీత రంగానికి తీరని లోటు : గవర్నర్ శుక్లా ప్రతాప్

హైదరాబాద్ (జనంసాక్షి) : ప్రముఖ నేపథ్య గాయని ఎస్. జానకి మృతి పట్ల తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శ్రీమతి జానకిని కోట్లాది మంది హృదయాలను తన మధుర గానంతో అలరించిన అపూర్వ గాయని అన్నారు. సంగీత ప్రపంచంలో చిరస్థాయిగా నిలిచే మహోన్నత వ్యక్తిత్వం జానకి గారిదని గవర్నర్ అభివర్ణించారు. తెలుగు నేలపై జన్మించిన ఆమె ఆరు దశాబ్దాలకు పైగా తన అసాధారణ ప్రతిభ, మధుర కంఠంతో భారతీయ సంగీత ప్రపంచాన్ని సుసంపన్నం చేశారని పేర్కొన్నారు. తరతరాల సంగీతాభిమానుల హృదయాల్లో ఆమె ఆలపించిన గీతాలు చిరస్థాయిగా నిలిచిపోతాయని, భారతీయ సంగీత రంగానికి ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమని గవర్నర్ అన్నారు. ఆమె మరణం భారతీయ సంగీత ప్రపంచానికి తీరని లోటని పేర్కొంటూ, ఆమె కుటుంబ సభ్యులకు, అభిమానులకు, సంగీత ప్రపంచానికి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# మక్తల్ నియోజకవర్గానికి 320 కోట్లతో హ్యామ్ రోడ్లు

- సోమవారం పైలాన్ ఆవిష్కరించి పనులు ప్రారంభించనున్న మంత్రులు
- మక్తల్- నారాయణపేట ఫోర్ లైన్ రోడ్డు కు 237 కోట్లు




మక్తల్, జూలై 11 (జనంసాక్షి) : మఖ్తల్ నియోజకవర్గానికి మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవతో ఏకంగా 320 కోట్ల రూపాయల నిధులు హ్యామ్ రోడ్ల కింద మంజూరు అయ్యాయని, ఈనెల 13వ తేదీ సోమవారం మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి పైలాన్ ఆవిష్కరించి పనులు ప్రారంభిస్తారని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు కట్టా సురేష్ గుప్తా, మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్కారి రవికుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మాగనూరు మండల అధ్యక్షుడు శివరాం రెడ్డి, వాకిటి హనుమంతు తెలిపారు. మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు టౌన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మఖ్తల్ నియోజకవర్గానికి ఏకంగా 320 కోట్లను హ్యామ్ రోడ్ల కింద మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవ తీసుకుని మంజూరు చేయించారని తెలిపారు. ఇందులో మఖ్తల్ – నారాయణపేట ఫోర్ లైన్ రోడ్డు కు 237.71 కోట్లు, మరికల్ – మినాస్‌పూర్ – లింగంపల్లి రోడ్డు కు 49.57 కోట్లు, ఆత్మకూరు – మరికల్ రోడ్డు కు 22.47 కోట్లు, మాగనూరు మండలం నల్లగట్టు – హిందూపూర్ రోడ్డుకు 10.49 కోట్లు మంజూరు అయ్యాయని తెలిపారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు మఖ్తల్ పట్టణంలోని గురుకుల సమీపంలో నారాయణపేట రోడ్డుకు మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు మరియు వాకిటి శ్రీహరి పైలాన్ ఆవిష్కరించి, పనులు ప్రారంభిస్తారని అనంతరం బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. నారాయణపేట రోడ్డు దశాబ్దాల తరబడి అధ్వాన్నంగా తయారైందని, గత ప్రభుత్వంలో ప్రజలు ఎంత మొత్తుకున్నా పాలకులు పట్టించుకోలేదన్నారు.

# సాంకేతిక విద్యకు ప్రభుత్వం పెద్దపీట

- జేఎన్‌టీయూ విద్యార్థులకు రవాణా, ఆధునిక మౌలిక వసతుల కల్పన
- కొత్త బస్సులు ప్రారంభించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ



చౌటకూర్, జూలై 11 ( జనం సాక్షి): విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యతో పాటు అత్యాధునిక సౌకర్యాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన రెండు నూతన బస్సులను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం కళాశాలలో ఏర్పాటు చేసిన స్మార్ట్ కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కళాశాలలకు రాకపోకలు సాగించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. కొత్త బస్సుల ద్వారా విద్యార్థుల సమయం ఆదా కావడంతో పాటు సమయపాలన మెరుగుపడుతుందని తెలిపారు. డిజిటల్ విద్యకు ప్రాధాన్యం ఇస్తూ ఏర్పాటు చేసిన స్మార్ట్ కంప్యూటర్ ల్యాబ్ ద్వారా విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునే అవకాశం లభిస్తుందని,భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఇది దోహదపడుతుందని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయూహెచ్ వైస్ ఛాన్సలర్ డా. కిషన్ కుమార్ రెడ్డి,అదనపు కలెక్టర్ పాండు, కళాశాల ప్రిన్సిపల్ విశ్వనాథరాజు, అందోల్ ఆర్డీఓ రమేష్ బాబు, ప్రజాప్రతినిధులు, అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
12 జూలై 2026

సంపాదకీయం

# నేరస్థుడి కత్తి వెనుక... వ్యవస్థ నిర్లక్ష్యం!

షాబాద్‌లో ఆరుగురి దారుణ హత్య మనముందు ఒక భయంకరమైన ప్రశ్నను నిలబెడుతోంది. ఒక పోక్సో నిందితుడు, తనపై కేసు పెట్టిన బాలికను, ఆమె తల్లిని, నాయనమ్మను కత్తితో నరికి చంపడమే కాక, సొంత భార్యనూ, ఇద్దరు చిన్నారి పిల్లలనూ పొట్టన పెట్టుకున్నాడు. ఇది ఒక వ్యక్తి చేసిన నేరమా, లేక వ్యవస్థ చేసిన నేరమా అని ఆలోచిస్తే, జవాబు రెండోదే అని స్పష్టమవుతుంది. పోక్సో కేసు నమోదైన నాటి నుంచి నిందితుడు స్వేచ్ఛగా తిరుగుతూ, బాధితురాలిని బెదిరించగలిగే స్థితిలో ఉన్నాడంటే, అది పోలీసు వ్యవస్థ వైఫల్యం తప్ప మరోటి కాదు.

**పోక్సో చట్టం కాగితాల మీద కఠినంగా కనిపిస్తుంది, కానీ ఆచరణలో అది నీరుగారిపోతున్న తీరు ఈ ఉదంతం మరోసారి బయటపెట్టింది. ఒక మైనర్ బాలికపై నేరం జరిగిందని తెలిసిన వెంటనే నిందితుడిని కటకటాల వెనక్కి పంపాల్సిన బాధ్యత పోలీసులది. కానీ చాలా కేసుల్లో బెయిల్ వచ్చేలా చూసుకోవడం, దర్యాప్తులో నిర్లక్ష్యం, సాక్ష్యాధారాలను సకాలంలో సేకరించకపోవడం వంటివి షరా మామూలుగా మారాయి. నిందితుడు బెదిరింపులకు దిగినా, బాధిత కుటుంబం రక్షణ కోరినా, పట్టించుకోని తీరు రాజ్యం యొక్క ఉదాసీనతకు నిదర్శనం. ఈ ఉదాసీనతే ఒక నేరస్థుడికి మరో ఆరు హత్యలు చేసే ధైర్యాన్ని ఇచ్చింది.**


బాధితురాలిని, ఆమె కుటుంబాన్ని రక్షించాల్సిన వ్యవస్థ, చివరికి వారి మృతదేహాలను లెక్కించే స్థితికి దిగజారడం సిగ్గుచేటు. ఎస్సైని సస్పెండ్ చేయడం, రివార్డు ప్రకటించడం లాంటి చర్యలు నేరం జరిగిన తర్వాత తీసుకునే మొక్కుబడి చర్యలే తప్ప, ఇలాంటి ఘటనలు జరగకుండా నివారించే విధానం కాదు. ప్రతిసారీ ఒక దారుణం జరిగాకే యంత్రాంగం మేల్కొనడం, ఆ తర్వాత మళ్ళీ నిద్రలోకి జారుకోవడం పరిపాటిగా మారింది.

పోక్సో కేసుల్లో నిందితుడి కదలికలపై నిరంతర నిఘా ఉండాలి. బాధిత కుటుంబాలకు తక్షణ రక్షణ, కేసు విచారణ వేగవంతం చేయడం, బెయిల్ షరతులను కచ్చితంగా అమలు చేయడం వంటివి తప్పనిసరి కావాలి. కానీ వాస్తవంలో ఇవి కాగితాలకే పరిమితమవుతున్నాయి. నిందితులకు రాజకీయ అండదండలు, పోలీసు యంత్రాంగంలో జవాబుదారీతనం లేకపోవడం, కేసుల విచారణలో జాప్యం ఇవన్నీ కలిసి ఒక ప్రమాదకరమైన వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. ఈ వాతావరణంలోనే నేరస్థులు ధైర్యంగా బాధితులపైనే మరోసారి దాడి చేసే స్థాయికి ఎదుగుతున్నారు.

ఈ ఆరు మరణాలు కేవలం ఒక నేరస్థుడి క్రూరత్వానికి సాక్ష్యం కాదు, రక్షణ కల్పించాల్సిన ప్రతి వ్యవస్థ విఫలమైనందుకు నిదర్శనం. బాధ్యులైన అధికారులపై చర్యలు, కేసుల్లో జవాబుదారీతనం, బాధిత కుటుంబాలకు నిజమైన రక్షణ కల్పించే వ్యవస్థాగత సంస్కరణలు లేకుండా, కేవలం సానుభూతి ప్రకటనలతో ఇలాంటి ఘటనలను ఆపలేం. రాజ్యం తన నిర్లక్ష్యాన్ని వెంటనే వదిలించుకోకపోతే, రేపు మరో బాధితురాలు, మరో కుటుంబం ఇదే విషాదాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది.

# తెలంగాణ రైతాంగ పోరాటానికి తాత్విక బలం - డి.వి.

*భారత విప్లవోద్యమా రథ సారధి కామ్రేడ్ దేవులపల్లి వేంకటేశ్వర రావు (డి.వి) 42 వ వర్ధంతి సందర్బంగా...*



భారత విప్లవోద్యమ అగ్రనేత, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సిద్దాంత కర్త, మాజీ ఏంపి, యుసీసీఆర్ఐ (ఎంఎల్) వ్యవస్థాపకులు కామ్రేడ్ దేవులపల్లి వేంకటేశ్వర రావు 42వ వర్ధంతి సందర్భంగా తెలంగాణ యువజన సంఘము ఘన నివాళులు అర్పిస్తుంది. నాటి నల్గొండ జిల్లాలోని బండమీది చందుపట్ల గ్రామనికీ చెందిన దేవులపల్లి వెంకటేశ్వర్ రావు, తన అమ్మమ్మ గారి గ్రామమైన నాటి వరంగల్ జిల్లా ఇనుగుర్తి గ్రామంలో 1917 జూన్ 01 తేదిన జన్మించారు. భూస్వామ్య దేశ్ ముఖ్‌ల సంపన్న కుటుంబంలో జన్మించిన కామ్రేడ్ డివి తన జీవితమంతా పేద ప్రజల కోరకు ఉద్యమించారు. ఉస్మా నియా విశ్వవిద్యాలయంలో బిఏ చదువుతున్నపుడు 'వందేమాతరం 'ఉద్యమంలో పాల్గొనడంతో కళాశాల యాజమాన్యం బహిష్కరించింది.
ఆయన నాగపూర్ వెళ్లి చదువుకున్నారు. నాగపూర్ జబల్పూర్ యూనివార్సిటీ లో బి.ఏ చదువుతున్నా రోజులలోనే దేవులపల్లి కి కామ్యునిస్టు సాహిత్యం తో సహావాసాం ఏర్పడింది.
నాగాపూర్ నుండి డిగ్రీ పట్టాతో పాటు కామ్యునిస్టు సాహిత్యం తీసుకువచ్చారు డివి. 1939లో బాల్య వితంతువు అయిన శ్రీ రంగమ్మతో వివాహం జరిగింది. వారికి కుమారుడు రుక్మ రావు, కూతురు క్రాంతి జన్మించారు.
ఆనాటికే నిజాం నిరంకుశ విధానాలతో, స్థానిక భూస్వామ్య పెత్తం దారులతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెట్టి చాకిరి తీవ్రంగా ఉంది. భూస్వామ్య కుటుంబంలో జన్మించిన దేవుల పల్లి నిజాం రాష్ట్రము లో నిషేధిత కామ్యునిస్టు పార్టీలో చేరి, పీడీత ప్రజలను చైతన్యం చేసి బంచెన్ దోర అనే చేతులకు బందుక్‌లు అందించి నిజాం నిరంకుశ విధానాలపై అలుపెరగని పోరాటం చేసారు. భువనగిరి ఆంధ్రమహాసభకి నాయకత్వం వాహించారు."
దున్నేవాడికే భూమి" నినాదంతో తెలంగాణలో మూడు వేల గ్రామల్లో పది లక్షల ఎకరాలు కామ్యునిస్టులు నాయకత్వంలో పేద ప్రజలు పంచుకున్నారు. తెలంగాణ గడ్డ పోరాట పటిమను ప్రపంచానికి సాయుధ రైతాంగ పోరాటం (1946 -51) ద్వారా పరిచయం చేసిన తెలంగాణ మట్టి మనిషి దేవులపల్లి వెంకటేశ్వర్ రావు.
దేవులపల్లి వెంకటేశ్వర్ రావు 1974లో ఇంగ్లాండ్‌కు చెందిన చరిత్ర పరిశోధకుడు బేరి పేవియర్ కి ఇచ్చిన ఇంటర్యూ, బేరి పెవియర్ ఆతరువాత 1981లో రాసిన తెలంగాణ మూవ్ మెంట్ అనే పుస్తకం లో తెలంగాణ రైతంగా సాయుధ పోరాటం నాడు డీవీ నాయకత్వం వహిస్తున్న నల్గొండ జిల్లా లో ప్రారంభం అయి, ఇతర ప్రాంతలకు విస్తరించింది అని సాయుధ పోరాటనికి కేంద్ర బిందువుగా ఉంది అని నొక్కి చెప్పారు.
పోరాట ప్రాంతం లో ఉండి ప్రజలను చైతన్యం చేస్తూ, పోరాట ఎత్తుగడలు అనుసరిస్తూ గేరిల్లా పోరాటం నడిపించిన డీవీ రచనలు, రాజకీయాలు ఏ నాటికైనా పాలక వర్గాలకు ప్రమాదం అని భావించి భవిష్యత్తు ప్రజలకు తెలియకుండా, డీవీ చరిత్ర చేరిపే కుట్రలు పాలక వర్గాలు, కొంతమంది కుహనా నాయకులు కుట్రలు చేసారు. వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా మొదలైన పోరాటం దొడ్డి కొమరయ్య అమరత్వం తర్వాత, పోరాట ప్రాంతం లో పంటల రక్షణ కొరకు అప్పటి వరకు "గుతపల సంఘము " పెట్టి ఉద్యమం చేసిన వారు ఆయుధం ఎత్తి గేరిల్లా పోరు కొనసాగించటం లో డీవీ పాత్ర అత్యంత గొప్పది.
1946 జూలై తరవాత నల్గొండ జిల్లాలో పోరాటం ఉధృతం అయినది. ప్రజల సాయుధ ప్రతి ఘటన ప్రారంభమైంది. క్రమంగా నిజాం ప్రభుత్వ నిర్బంధం తీవ్ర మైంది. కామ్రేడ్ డీవీ రహస్య జీవితంలోకి వెళ్ళి పోయారు. పక్కనే ఉన్నా ఆంధ్ర ప్రాంతం ( మద్రాస్ రాష్ట్రంలోని ) పరిధిలోని మునగాల పరగాణ కు చెందిన రామాపురం గ్రామంలో నల్గొండ జిల్లా పార్టీ కార్యాలయన్ని ఏర్పాటు చేసుకొని సంవత్సర కాలం కామ్రేడ్ డీవీ అక్కడే ఉండి,ఉద్యమ కార్య కలాపాలు, కార్యక్రమాలకు నాయకత్వం వహించారు.
ముఖ్య కార్యకర్తలకు డీవీ తుపాకీ శిక్షణ కూడా ఇక్కడే ఇచ్చారు.
కమ్యూనిస్ట్‌ల ఆదినంలోకి తెలంగాణ సాయుధ పోరాట ప్రాంతాలు వస్తున్న సమయంలో 1948 సెప్టెంబర్ 13న నిజాం నిరంకుశ పాలనపై "సైనిక చర్య "పేరుతో భారత ప్రభుత్వం "ఆపరేషన్ పోలో " ప్రకటించి, తెలంగాణ పోరాట ప్రాంతం లో వేలాది మంది పోరాడి అమరులు అయి, 3000 గ్రామాల్లో పది లక్షల ఎకరాలు ప్రజలు సాధించుకున్న భూములను తిరిగి, భూస్వాములకు కట్టా బేడుతూ, కనిపించిన కమ్యూనిస్ట్ నాయకులను కాల్చి వేస్తూన్న సమయంలోలో పోరాట ప్రాంతం నుండి బొంబాయి పోయి, సాయుధ పోరాటానికి వ్యతిరేకంగా రావి నారాయణ రెడ్డి గారు ప్రకటన చేసారు.
పాలక వర్గాలు, వారిఎజెంట్లు జరిపిన విష ప్రచారం కంటే, ఇలాంటి ఇతరులు జరిపిన ప్రచారం పోరాటనికి ఎక్కువ నష్టం చేసింది.
ఆ తర్వాత పోరాట ప్రాంతం లో ప్రత్యక్ష నాయకత్వంలో లేని వాళ్ళని, సాయుధ పోరాటాన్ని విరమించాలని పాలకులకు అను కూలంగా ప్రకటనలు చేసిన వారిని తెలంగాణ రైతంగా సాయుధ పోరాట యోధులుగా పాలక వర్గాలు, పాలక వర్గాల అనుకుల మీడియా ప్రకటించి, 1946 సాయుధ పోరాటం మొదలు నుండి 1951 అక్టోబర్ లో రష్యా కమ్యూనిస్ట్ నేత స్టాలిన్ సూచన పేరుతో సాయుధ పోరాట విరమణ నిర్ణయం. సాయుధ పోరాటానికి ప్రత్యక్ష నాయకత్వం వహిస్తున్న దేవులపల్లి, బీమి రెడ్డి నర్సింహా రెడ్డిలకు సమాచారం ఇవ్వకుండానే సుందరయ్య, బసవ పున్నయ్య, చంద్రా రాజేశ్వర్ రావు, మద్దూకూరి చంద్ర శేఖర్ గార్ల విరమణ ప్రకటన చేసే వరకు మహత్తర రైతంగా సాయుధ పోరాటం నడిపిన నాయకులు డీవీని, భవిష్యత్తు తరాలకు దేవులపల్లి వెంకటేశ్వర్ పోరాట చరిత్రని తెలియనియకుండా కుట్రలు సాగించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట విరమణ తరువాత 1957 లో జరిగిన ఎన్నికల్లో దేవులపల్లివేంకటేశ్వర రావు గారు అత్యధిక మెజార్టీతో గెలినప్పటీకీ, ఆ పంథాతో సమాధాన పడలేక పోయారు.
విప్లవోద్యమ నిర్మాణంలో కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి గారితో దేవులపల్లి గారికి ఉన్న స్నేహ సంబంధాలు విడదీయ రానివి.
భారత విప్లవోద్యమం కోసం ఇరువురు తమ ప్రాణాలు వదిలే వరకు అనేక నిర్బంధాలు, కేసులు, ఎదుర్కొంటూ, అజ్ఞాత జీవితం అనుభవిస్తూ, తమ ప్రాణాలు వదిలే వరకు పీడీత ప్రజల కోసం ఉద్యమించారు. 1969లో ఆనాటి పాలకులు 'హైదరాబాద్ కుట్ర కేసు' డి.వి మరియు ఇతరుల పై బనాయించి మద్రాస్ లో కామ్రేడ్ దేవులపల్లి , కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి గారిని అరెస్టు జైలు ఉంచిన సందర్భంగా కామ్యునిస్టు విప్లవకారులకు దిక్సూచి వంటి " భారత జనతా ప్రజాతంత్ర విప్లవం- ఒక వివరణ " అనే గ్రంథం జైలు లో ఉన్న సమయంలో రచించారు. ఈ సమయంలో కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి గారు "తాకట్టులో భారత దేశం " అనే గ్రంథం జైలు లోనే రచించారు. ఈ కేసు విచారణ సందర్భంగా జడ్జి గారి ముందు తామేందుకు విప్లవ లక్ష్యం ఎంచుకున్నామో వివరిస్తూ , పాలకుల అన్నిరకలుగా ప్రజలను భ్రమలకు గురి చేస్తూ , వారిని మోసగిస్తున్న మోస పూరిత విధానాలను ఎండగడుతూ సవివరంగా నాలుగు రోజుల పాటు వివరించారు.
కోర్ట్‌లో డీవీ గారు "భారత విప్లవం భారత ప్రజల జన్మహక్కు,
ఈ విప్లవం కోసం పని చేయడం విప్లవకారుల జన్మహక్కు, ఈ జన్మహక్కునుయే రాజ్యాంగం, యే చట్టాము, పాలక వర్గాల లక్షలాది సాయుధ బలాల పాశవిక నిర్బంద విధానమూ హరించ జాలదు, అణచి వేయాజాలదు. భారత విప్లవం జయించి తీరుతుంది. ప్రపంచ విప్లవ గమనం సూచిస్తున్నది ఇదే! అని ప్రకటించారు.
అందుకే ఈ " జనత ప్రజాతంత్ర విప్లవం - ఒక వివరణ" అనే విప్లవ గ్రంథం "' కోర్ట్ స్టేట్ మెంట్ "గా ప్రసిద్ధి చెందింది.
ఈ కుట్ర కేసు సందర్భంగా డీవీ, నాగిరెడ్డి జైలు లో ఉన్నా సమయం లోనే భారత విప్లవోద్యమం పేద దొరణుల వైపు మరల కుండా 1968-69 కాలంలో " పోరాట ఉద్యమానికి పునాధులు వేయండి " అనే సర్క్యులర్ విడుదల చేసి, "తక్షణ కార్యక్రమం " అనే రచన ద్వారా తిరిగి విప్లవొద్యము నిర్మించవలసిన తక్షణ కర్తవ్యాన్ని విప్లవ కారులకు తెలియజేసారు. కామ్రేడ్ దేవులపల్లి వెంకటేశ్వర్ రావు తన పోరాటజీవితమంతా అతి వాద, మిత వాద, అవకాశ వాద రాజకీయలకు వ్యతిరేకంగా ఉద్యమించారు.
కామ్రేడ్ దేవులపల్లి వేంకటేశ్వర రావు , కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి గారు 1975 లో భారత కామ్యునిస్టు విప్లవకారుల సమైక్యత కేంద్రం (మార్క్సిజం - లెనినిజం ) UCCRI ( M-L) పార్టీ ని స్థాపించారు. కామ్రేడ్ డీవీ దేశం లో విప్లవొద్యమ నిర్మాణం పై రచనలు చేస్తూనే, విప్లవోద్యమం కోసం పోరాడే కమ్యూనిస్ట్ విప్లవ కారుల జీవన విధానం ఎలా ఉండాలో కార్యకర్తలకు నిర్వహించిన " ఒరియే టేషన్ క్లాస్"లలో విప్లవ పార్టీ కార్యకర్తలంతా " నిరాడంబరంగా జీవించాలి - ఉన్నతంగా ఆలోచించాలి " అని బోధించారు. ఎమర్జె న్సీ విధించడంతో దేవులపల్లి అజ్ఞాతంలోకి వెళ్లి పోయారు. అజ్ఞాతంలో ఉంటూనే 1984 జూలై 12వ తేదీన తన 66వ ఏట తుదిశ్వాస విడిచారు. కామ్రేడ్ డీవీ 1939 లో కమ్యూనిస్ట్ పార్టీ లో చేరిన నాటి నుండి 1984 లో మరణించే వరకు అత్యంత క్రమ శిక్షణ పాటించాడు.
ఈ కారణం వలనే ఉమ్మడి కమ్యూనిస్ట్ పార్టీ లో ముగ్గురు సభ్యులతో గల కేంద్ర క్రమశిక్షణ కమిటీకి సభ్యులుగా నాడు ఉమ్మడి కమ్యూనిస్ట్ పార్టీ నియమించింది. 45 ఏళ్ల రాజకీయ జీవితంలో ఐదేళ్లు జైలులో, ఇరవై ఏళ్ళు అజ్ఞాత జీవితం, బహిరంగంగా ఉన్నా ఆ ఇరవై ఏళ్ళు ప్రజల కోసమే జీవించారు.
పీడిత ప్రజల ప్రియతమ నాయకులు కామ్రేడ్ దేవులపల్లి వేంకటేశ్వర రావు ( డి.వి ) ప్రజల గుండెల్లో నిలిచే ఉన్నారు. వారి సిద్ధాంతాలను నేటి యువత ఆదర్శంగా తీసుకొని ప్రజా సమస్యల పరిష్కారం కై ఉద్యమించాలి. తెలంగాణ సాయుధ పోరాట సిద్ధాంత కర్త, భారత విప్లవొద్యమా నిర్మాత కామ్రేడ్ దేవులపల్లి వెంకటేశ్వర్ రావు గారికి తెలంగాణ యువజన సంఘము రాష్ట్ర కమిటీ ఘననివాళులు అర్పిస్తుంది.



**- అనంతుల మధు**
**- తెలంగాణ యువజన సంఘము రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.**
**ఫోన్ : 9505866698**

# విశ్వాసం నుంచి అధికారానికి..

భారతదేశంలో మతం అనేది కేవలం వ్యక్తిగత విశ్వాసానికి సంబంధించిన విషయం మాత్రమే కాదు. అది వర్గ సంబంధాలను, సామాజిక ఆధిపత్యాన్ని, రాజకీయ అధికార నిర్మాణాన్ని ప్రభావితం చేసే ఒక చారిత్రక శక్తి. మార్క్సిస్టు దృక్పథంలో సమాజంలోని ఏ సంస్థనైనా దాని భౌతిక పునాదులు, ఉత్పత్తి సంబంధాలు, వర్గ ప్రయోజనాల నేపథ్యంలో అర్థం చేసుకోవాలి. ఈ కోణంలో పరిశీలిస్తే ఆలయాలు కేవలం ఆధ్యాత్మిక కేంద్రాలు మాత్రమే కాకుండా, చరిత్రలో వివిధ దశల్లో అధికార వర్గాల ఆధిపత్యాన్ని బలపరిచిన సామాజిక ఆర్థిక సంస్థలుగా కనిపిస్తాయి.
కార్ల్ మార్క్స్ మతాన్ని "పీడిత ప్రజల నిట్టూర్పు, హృదయం లేని ప్రపంచానికి హృదయం, ఆత్మలేని పరిస్థితులకు ఆత్మ"గా పేర్కొంటూనే, అదే సమయంలో అది "ప్రజలకు మత్తుమందు"గా కూడా పనిచేస్తుందని చెప్పాడు. ఈ వ్యాఖ్యను తరచుగా ఏకపక్షంగా అర్థం చేసుకుంటారు. మార్క్స్ ఉద్దేశ్యం ప్రజల విశ్వాసాలను అవమానించడం కాదు. ప్రజల బాధలకు మూలమైన భౌతిక పరిస్థితులను మార్చకుండా కేవలం ఆధ్యాత్మిక ఓదార్పు ఇవ్వడం సామాజిక అసమానతలను శాశ్వతం చేస్తుందని ఆయన సూచించాడు.
భారతదేశ చరిత్రను పరిశీలిస్తే.... ఆలయ వ్యవస్థ భూస్వామ్య సంబంధాలతో సన్నిహితంగా ముడిపడి ఉన్నట్లు కనిపిస్తుంది. అనేక రాజవంశాలు విస్తారమైన భూములను దేవాలయాలకు దానం చేశాయి. దేవాలయాలు కేవలం పూజా కేంద్రాలు కాకుండా భూముల యజమానులు, పన్నుల సేకరణ కేంద్రాలు, సామాజిక నియంత్రణ సంస్థలుగా పనిచేశాయి. రైతులు, శిల్పులు, చేతివృత్తిదారులు తమ శ్రమ ద్వారా సంపదను సృష్టించినప్పటికీ, ఆ సంపదపై నియంత్రణ పాలక వర్గాలు మరియు పురోహిత వర్గాల చేతుల్లో కేంద్రీకృతమైంది. రైతాంగం సృష్టించిన సంపదలో గణనీయమైన భాగం మతపరమైన అధికార వ్యవస్థల ద్వారా నియంత్రించబడింది. ఈ ప్రక్రియ కేవలం ఆర్థిక దోపిడీ మాత్రమే కాదు; అది సామాజిక ఆధిపత్యాన్ని కూడా బలపరిచింది. కుల వ్యవస్థ, భూస్వామ్య వ్యవస్థ, మతాధిపత్యం పరస్పరం ఒకదానిని మరొకటి బలోపేతం చేశాయి.
ఆధునిక భారతదేశంలో ఈ ప్రక్రియ కొత్త రూపాలను సంతరించుకుంది. ఆర్థిక ఉదారీకరణ అనంతరం మతం, మార్కెట్ మధ్య కొత్త సంబంధాలు ఏర్పడ్డాయి. ఆలయాలు భారీ ఆర్థిక కేంద్రాలుగా పరిణామం చెందాయి. యాత్రా పర్యాటకం, విరాళాల వ్యవస్థ, మతపరమైన వస్తువుల వ్యాపారం, భూముల విలువల పెరుగుదల, భారీ నిర్మాణ ప్రాజెక్టులన్నీ కలిసి ఒక కొత్త ఆలయ ఆర్థిక వ్యవస్థను నిర్మించాయి.
వివిధ అంచనాల ప్రకారం భారతదేశంలో ఆలయ ఆధారిత ఆర్థిక వ్యవస్థ విలువ మూడు లక్షల కోట్ల నుంచి ఆరు లక్షల కోట్ల రూపాయల మధ్య ఉందని పేర్కొంటున్నారు. దేశంలోని ఆధ్యాత్మిక పర్యాటక రంగం కోట్లాది ప్రజల జీవనోపాధికి ఆధారంగా నిలుస్తోంది. తిరుమల, షిర్డీ, వైష్ణోదేవి, అయోధ్య వంటి కేంద్రాలు ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థలను ప్రభావితం చేసే స్థాయికి ఎదిగాయి. ఈ ప్రక్రియలో ఒక ముఖ్యమైన పరిణామం మతం యొక్క వాణిజ్యీకరణ. భక్తి కూడా ఒక వినియోగ వస్తువుగా మారుతోంది. ప్రత్యేక దర్శనాలు, ఆధ్యాత్మిక పర్యాటక ప్యాకేజీలు, భారీ ఉత్సవాలు, మత ఆధారిత వ్యాపారాలు కోట్లాది రూపాయల లావాదేవీలకు దారితీస్తున్నాయి.
అయితే ప్రశ్న ఏమిటంటే.. ఈ సంపద ఎవరి చేతుల్లో కేంద్రీకృతమవుతోంది? దీనివల్ల లాభపడుతున్న వర్గాలు ఏవి? దీనివల్ల నష్టపోతున్న వర్గాలు ఏవి? ఇక్కడే హిందుత్వ రాజకీయాల ఎదుగుదలను అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది.
రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ మరియు దాని అనుబంధ సంస్థలు హిందూ ఐక్యత అనే భావనను ముందుకు తీసుకువస్తున్నప్పటికీ, మార్క్సిస్టు విశ్లేషణ ప్రకారం.. భావన సమాజంలోని వర్గ వైరుధ్యాలను ద్వితీయ స్థానానికి నెట్టే రాజకీయ ప్రక్రియగా కూడా పనిచేస్తుంది. నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, కార్మిక హక్కుల హ్రాసం, ఆదాయ అసమానతలు, భూహీనత వంటి వర్గపరమైన సమస్యల స్థానంలో మతపరమైన గుర్తింపులు రాజకీయ చర్చల కేంద్రంగా మారుతున్నాయి.
పాలక వర్గాలు తమ ఆధిపత్యాన్ని కొనసాగించడానికి కేవలం ఆర్థిక శక్తిపైనే ఆధారపడవు. అవి సమాజంలో ఒక భావజాల సమ్మతిని కూడా నిర్మిస్తాయి. మతం, జాతీయవాదం, సాంస్కృతిక ప్రతీకలు ఈ ప్రక్రియలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ఇటాలియన్ మార్క్సిస్టు ఆలోచనాపరుడు ఆంటోనియో గ్రాంసీ పేర్కొన్న భావజాల ఆధిపత్యం భావన భారత పరిస్థితుల్లో మరింత ప్రాసంగికంగా కనిపిస్తుంది.
అయోధ్య ఉద్యమం ఈ దృష్టిలో ఒక కీలక రాజకీయ పరిణామం. ఇది కేవలం ఒక ఆలయ నిర్మాణ ఉద్యమం కాదు. ఇది భారత రాజకీయాలలో కొత్త భావజాల సమీకరణాన్ని నిర్మించిన ఉద్యమం. మతపరమైన గుర్తింపును రాజకీయ సమీకరణానికి కేంద్రంగా మార్చిన చారిత్రక ప్రక్రియ.
అయోధ్యలో ప్రస్తుతం జరుగుతున్న భారీ ఆర్థిక అభివృద్ధి కూడా ఈ నేపథ్యంలో పరిశీలించాల్సిన అవసరం ఉంది. పర్యాటక రంగం, రియల్ ఎస్టేట్ విస్తరణ, పెద్ద పెట్టుబడుల ప్రవేశం, మౌలిక సదుపాయాల నిర్మాణం ఒక కొత్త ఆర్థిక వ్యవస్థను నిర్మిస్తున్నాయి. కానీ ఈ అభివృద్ధి ఫలితాలు సమాజంలోని అన్ని వర్గాలకు సమానంగా చేరుతున్నాయా? లేక కొద్దిమంది వర్గాలకే పరిమితమవుతున్నాయా? అనే ప్రశ్న మరింత ముఖ్యమవుతోంది.
ఇటీవలి కాలంలో ఆలయ విరాళాల నిర్వహణకు సంబంధించిన వివాదాలు మరోసారి ఒక ప్రాథమిక ప్రశ్నను ముందుకు తెచ్చాయి. ప్రజల విశ్వాసాల ఆధారంగా సమీకృతమవుతున్న అపారమైన సంపదపై ప్రజాస్వామ్య నియంత్రణ ఎంతవరకు ఉంది?
ఎక్కడ సంపద కేంద్రీకృతమవుతుందో అక్కడ అధికారం కూడా కేంద్రీకృతమవుతుంది. సంపద, రాజకీయ శక్తి, భావజాల ఆధిపత్యం ఒకే కేంద్రంలో కేంద్రీకృతమైనప్పుడు ప్రజాస్వామ్య సమతుల్యత దెబ్బతినే ప్రమాదం పెరుగుతుంది. ఇప్పటి భారతదేశంలో మతం, రాజకీయాలు, పెద్ద పెట్టుబడులు పరస్పరం ఒకదానిని మరొకటి బలపరుస్తున్నాయని అనేక పరిశీలకులు సూచిస్తున్నారు. మతపరమైన భావోద్వేగాలు రాజకీయ సమీకరణానికి ఉపయోగపడుతుండగా, రాజకీయ స్థిరత్వం పెద్ద పెట్టుబడులకు అనుకూల పరిస్థితులను సృష్టిస్తోంది. అదే సమయంలో భారీ ఆర్థిక వనరులు భావజాల ప్రచారానికి కొత్త అవకాశాలను కల్పిస్తున్నాయి. ఇది ఒక కొత్త చారిత్రక పరిస్థితిని సృష్టిస్తోంది. వర్గ వైరుధ్యాలు కొనసాగుతున్నప్పటికీ రాజకీయ చర్చల కేంద్రంలో మతపరమైన గుర్తింపులు నిలుస్తున్నాయి. ఆర్థిక అసమానతలు పెరుగుతున్నప్పటికీ సాంస్కృతిక సమీకరణలు మరింత ప్రాధాన్యం పొందుతున్నాయి.
ప్రజల మత విశ్వాసాలను గౌరవిస్తూనే సమాజంలోని భౌతిక వాస్తవాలను కూడా అర్థం చేసుకోవాలి. నిరుద్యోగం, పేదరికం, భూహీనత, సామాజిక అసమానతలు, విద్యా ఆరోగ్య సంక్షోభాలు వంటి సమస్యలకు పరిష్కారాలు కనుగొనకుండా కేవలం సాంస్కృతిక పునరుజ్జీవనం మాత్రమే సమాజాన్ని ముందుకు తీసుకెళ్లలేదు; తీసుకెళ్లదు కూడా. భారతదేశ భవిష్యత్తు ముందున్న ప్రధాన ప్రశ్న ఇదే. విశ్వాసం ప్రజల ఆధ్యాత్మిక అవసరంగా కొనసాగుతూనే, సంపద, అధికారం కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమయ్యే పరిస్థితులను ఎలా నివారించాలి? మతపరమైన భావోద్వేగాలను గౌరవిస్తూనే సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం, ప్రజాస్వామ్య జవాబుదారీతనాన్ని ఎలా బలోపేతం చేయాలి? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతకడం నేటి భారత సమాజం ముందున్న అత్యంత ముఖ్యమైన చారిత్రక అవసరం. ఎందుకంటే భారతదేశ భవిష్యత్తు కేవలం విశ్వాసం ఏ దిశగా సాగుతుందనే దానిపై కాదు, ఆ విశ్వాసం చుట్టూ నిర్మితమవుతున్న సంపద, అధికారం, రాజకీయ శక్తి ఎవరి ప్రయోజనాలకు సేవ చేస్తుందనే దానిపైన కూడా ఆధారపడి ఉంది.



**- మామిండ్ల రమేష్ రాజా**
**78932 30218**

# మతం-కులం మంటల్లో స్వరాజ్య స్ఫూర్తి!

***నాటి త్యాగాల సమైక్యతను మరిచామా?***



చరిత్ర పుటల్లో ఏ సార్వభౌమ దేశానికైనా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అనేవి ఒక్కరోజులో పండిన పంట కాదు. అది శతాబ్దాల నిర్బంధాలపై సాగిన సామూహిక తిరుగుబాటు, వేలాది అమరవీరుల ఉత్తుంగ త్యాగాల సమాహా రం, కోటానుకోట్ల భారతీయుల కన్నీటి జలపాతం. భగ్గున ప్రళయించినపుడు వచ్చిందొక విప్లవం, దిక్కులు జ్వలియించి తెచ్చి ఇచ్చింది స్వరాజ్యం అనే ఈ చారిత్రక వాక్యం కేవలం ఒక అలంకారిక పదబంధం కాదు, అది పరాయి పాలనలో నలిగిపోయిన అఖండ భారతదేశపు ఆత్మఘోష. యావత్ భారత జవజీవాల్లో అగ్నిలా రగిలిన జాతీయవాద ఆవేశం, నలుదిక్కులా దావానలం లా వ్యాపించిన సాయుధ, శాంతియుత తిరుగుబాటు జ్వాలలు చివరకు ఈ పుణ్యభూమికి స్వేచ్ఛా వాయువులను చేకూర్చాయనే నగ్న సత్యమే ఈ విశ్లేషణ. భారత స్వాతంత్ర్య సంగ్రామపు తొలి భగ్గుమనే నిప్పురవ్వ క్రీస్తుశకం 1857వ సంవత్సరంలో ఉత్తర భారతదేశంలో రాజుకుంది. మంగళ్ పాండే బ్రిటిష్ సైనిక నిబంధనలను ధిక్కరిస్తూ తుపాకీ మందుగుండు వాడకానికి నిరాకరించిన ఆ చారిత్రక క్షణం నుంచి, మాతృభూమి విముక్తికై ఝాన్సీ లక్ష్మీబాయి కత్తి ఝుళిపించి ఈస్టిండియా కంపెనీ సైన్యాన్ని గడగడలాడించిన వరకూ, ఆ ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం యావత్ జంబూద్వీపాన్ని ఒక్కసారిగా కుదిపేసింది. ఇది కేవలం ఒక సైనిక తిరుగుబాటు లేదా బ్యారక్‌లకే పరిమితమైన అసంతృప్తి కాదు, శతాబ్దాల పరాయి బానిసత్వానికి వ్యతిరేకంగా సామాన్య ప్రజానీకం నుంచి లేచిన తొలి సామూహిక ఆగ్రహ జ్వాల. ఆనాడు సైనిక బలగాలతో ఆ మంటలను సామ్రాజ్యవాద పాలకులు తాత్కాలికంగా అణచివేసినప్పటికీ, భారతీయుల అంతరాత్మల్లో రగిలిన స్వేచ్ఛా నిప్పు కణాలు ఎన్నటికీ ఆరిపోలేదు. అదే నివురు గప్పిన నిప్పు తర్వాతి తరాల వీరులకు దిక్సూచిగా మారి, దశాబ్దాల తరబడి కొనసాగే అప్రతిహత ప్రజా పోరాటానికి గట్టి పునాది వేసింది. భారత స్వరాజ్య సాధన కేవలం అహింసాయుత సత్యాగ్రహాలతోనే సాధ్యపడలేదనేది చారిత్రక వాస్తవం. దేశం నలుమూలలా యువశక్తి తమ ప్రాణాలను తృణప్రాయంగా త్యజించి, శత్రువును సాయుధంగా ఎదుర్కొనే విప్లవ మార్గాన్ని ఎంచుకుంది. భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వంటి అగ్నిస్ఫులింగాలు ఉరికంబం వైపు నవ్వుతూ సాగుతూ "ఇంక్విలాబ్ జిందాబాద్" అని నినదించిన ఆ హృదయవిదారక దృశ్యం నేటికీ ప్రతి భారతీయుడి రక్తాన్ని ఉరకలెత్తిస్తుంది. చంద్రశేఖర్ ఆజాద్ తుది శ్వాస వరకూ శత్రువుల చేతికి చిక్కకుండా, దేశం కోసం తానే తుపాకీతో ప్రాణం విడిచిన ఆ అసమాన ధీరత్వం, స్వరాజ్యం అంత సులభంగా లభించలేదని చాటిచెబుతోంది.
బెంగాల్ ప్రావిన్స్‌లో ఖుదీరామ్ బోస్, బరీంద్ర కుమార్ ఘోష్‌లు, పంజాబ్‌లో జలియన్‌వాలాబాగ్ హత్యాకాండకు ప్రతీకారం తీర్చుకున్న ధీరుడు ఉధమ్ సింగ్, మహారాష్ట్రలో విప్లవ పితామహుడు వాసుదేవ్ బల్వంత్ ఫడ్కే వంటి ఎందరో సాహస యువకులు భారతమాత విముక్తి కోసం తమ నెత్తుటిని ధారపోశారు. చిత్తగాంగ్ ఆయుధాగార దాడిలో మాస్టర్ దా సూర్యసేన్ నేతృత్వంలో పాఠశాల, కళాశాల విద్యార్థులు బ్రిటిష్ సైనిక బలగాలపై అకుంఠిత దీక్షతో తిరగబడిన వైనం, ఆ కాలపు యువతలో రగిలిన అచంచల దేశభక్తి జ్వాలకు ప్రత్యక్ష నిదర్శనం. వీరి పవిత్ర రక్తతర్పణమే ఆనాటి పారతంత్ర్యపు ఆకాశాన్ని ఎర్రబరిచి, దేశంలో నూతన స్వరాజ్య సూర్యోదయానికి రాజమార్గాన్ని సుగమం చేసింది.
ఇదే కాలంలో, అహింస, సత్యం అనే అమోఘమైన ఆయుధాలతో బ్రిటిష్ సామ్రాజ్యవాద పునాదులను కదిలించిన మహాత్ముడు మోహన్‌దాస్ కరమ్ చంద్ గాంధీ యుగ నూతన నాయకత్వం భారత స్వాతంత్ర్య పోరాటానికి ఒక సరికొత్త దిశను, దశను చూపింది. సహాయ నిరాకరణోద్యమం, ఉప్పు సత్యాగ్రహం, చారిత్రక క్విట్ ఇండియా ఉద్యమం వంటి ప్రజాపోరాటాలు లక్షలాది మంది కార్మికులను, కర్షకులను, సామాన్య గృహిణులను స్వాతంత్ర్య సమరంలో క్రియాశీల భాగస్వాములను చేశాయి. దండి యాత్రలో ఉప్పును తయారు చేసి ఉప్పు చట్టాలను ధిక్కరించిన గాంధీజీ వ్యూహాత్మక చర్య యావత్ ప్రపంచ దౌత్య దృష్టిని భారత స్వాతంత్ర్య సమరం వైపునకు మళ్లించింది. "కరెంగే యా మరేంగే" (సాధిద్దాం లేదా మరణిద్దాం) అనే తీవ్ర నినాదంతో 1942లో ఉవ్వెత్తున ఎగసిన క్విట్ ఇండియా ఉద్యమం బ్రిటిష్ వలస పాలనకు ఆఖరి హెచ్చరికగా నిలిచింది. మరోవైపు సుభాష్ చంద్రబోస్ నేతృత్వంలోని 'ఆజాద్ హింద్ ఫౌజ్' (భారత జాతీయ సైన్యం) దేశ సరిహద్దుల వెలుపల నుంచి బ్రిటిష్ అంతర్జాతీయ సామ్రాజ్యంపై నేరుగా సాయుధ దాడులకు నడుం బిగించింది. "తుమ్ ముఝే ఖూన్ దో, మై తుమ్హే ఆజాదీ దూంగా" (మీరు నాకు రక్తాన్నివ్వండి, నేను మీకు స్వేచ్ఛను ఇస్తాను) అనే నేతాజీ సింహగర్జన భారతీయ సాయుధ దళాలలో, యువతలో అనూహ్యమైన దేశభక్తి ఉత్తేజాన్ని నింపింది. దేశం లోపల సాగిన ప్రజాందోళనలు, దేశం వెలుపల నుంచి వచ్చిన అంతర్జాతీయ సైనిక వత్తిడి. ఈ రెండు వైపుల నుంచి రగిలిన విప్లవ అగ్నిజ్వాలలే చివరకు బ్రిటన్ పార్లమెంటును దిగిరాక తప్పని రాజకీయ, సైనిక పరిస్థితికి నెట్టివేశాయి. ఈ అఖండ మహా సంగ్రామంలో తెలుగు నాడు పోషించిన పాత్ర కూడా అత్యంత అనన్యసామాన్యమైనది. ఆయన అమరత్వం యావదాంధ్ర యువతలో అణచలేని స్వేచ్ఛాకాంక్షను మరింత బలపరిచింది. ఆంధ్ర రత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య నడిపిన చీరాల-పేరాల ఉద్యమం, పుల్లరి పన్నుకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలర్పించిన కన్నెగంటి హనుమంతు, పల్నాడు సత్యాగ్రహం వంటివి ఈ పుడమిపై స్వరాజ్య జ్వాలను నిరంతరం రగిలించాయి. 1947 ఆగస్టు 15న అర్ధరాత్రి వేళ భారతదేశం దాస్య శృంఖలాలను తెంచుకుని స్వేచ్ఛా వాయువులు పీల్చినప్పుడు, అది ఏ ఒక్క సిద్ధాంతానికో, ఏ ఒక్క కులానికో లేదా ఏ ఒక్క మతానికో పరిమితమైన విజయం కాదు. నాడు ఉరికంబం ఎక్కిన వీరులు గానీ, తుపాకీ గుండ్లకు ఎదురొడ్డిన ధీరులుగానీ తాము ఫలానా కులానికో, మతానికో చెందినవారమని పోరాడలేదు. భారతీయుడు అనే ఒకే ఒక్క అస్తిత్వంతో, అఖండ సమైక్యతా భావంతో బ్రిటీష్‌వారిని ఎదిరించారు. కానీ, దురదృష్టవశాత్తూ నేటి సమాజం కులాలుగా, మతాలుగా విడిపోయి అంతర్గత కలహాలతో కొట్టుకుమిట్టాడుతోంది. నాటి అమరవీరుల త్యాగాల పునాదులపై నిర్మితమైన ఈ స్వేచ్ఛా భారతాన్ని నేడు సంకుచిత స్వార్థ రాజకీయాలు, సామాజిక విభజనలు బలహీనపరుస్తున్నాయి. మంగళ్ పాండే కాలం నాటి రక్తార్పణ నుంచి భగత్ సింగ్ ఉరితాడు వరకూ, గాంధీజీ అహింసా మార్గం నుంచి నేతాజీ సైనిక దాడుల వరకూ సాగిన ఆ సుదీర్ఘ పోరాటంలో అందరి రుధిర ధారలు కలిసి ప్రవహించి చివరకు స్వరాజ్య గంగగా మారాయి. ఆ గంగను నేడు కులమతాల కాలుష్యంతో అపవిత్రం చేయడం అన్యాయం కాదా? ఈ చారిత్రక సత్యాలను, అమరవీరుల గాథలను స్మరించుకోవడం అంటే కేవలం గతాన్ని నెమరువేసుకుంటూ కీర్తించడం మాత్రమే కాదు. నాటి ఐక్యతను నేటి సమాజంలో తిరిగి ప్రతిష్టించడమే అసలైన కర్తవ్యం. స్వరాజ్యం సిద్ధించిన తర్వాత దేశంలో సుపరిపాలనను అందించడం, సామాజిక సమానత్వాన్ని నెలకొల్పడం, ఆర్థిక సుస్థిరతను సాధించడమే ఆ అమరవీరులకు మనం అర్పించగల నిజమైన నివాళి. భగ్గున ప్రళయించినపుడు వచ్చిందొక విప్లవం అనే సూక్తి మనకు నిరంతరం గుర్తుచేసేది ఒక్కటే ఈ స్వేచ్ఛ మనకు అంత సులభంగా రాలేదు. కులమతాల విభేదాలను పక్కనపెట్టి, అంతర్గత శత్రువుల నుంచి దేశ సమగ్రతను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత. రాబోయే తరాలకు ఆ దేశభక్తి, సమైక్యతా జ్వాలలను అఖండ దీపంగా అందించాల్సిన చారిత్రక బాధ్యత నేటి పౌరసమాజంపై ఎంతైనా ఉంది. ఈ స్వరాజ్య మహాగాథ ప్రతి ఇంటా ఒక నిత్య సమైక్యతా స్ఫూర్తిగా నిలవాలి.

**డా. సూర్యదేవర రామకృష్ణ,**
**9490754169**

# ఆయిల్‌పామ్ తోటల సాగుకు ప్రోత్సాహం



**గద్వాల నడిగడ్డ, జూలై 11 (జనం సాక్షి) :** ఆయిల్‌పామ్ తోటల సాగుకు ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో 2000 ఎకరాల్లో ఆయిల్ పామ్ తోటల సాగును లక్ష్యంగా నిర్ణయించామని, ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను రైతులు వినియోగించుకోవాలన్నారు. ఇటిక్యాల మండలం, బీచుపల్లి వద్ద ఉన్న తెలంగాణ రాష్ట్ర నూనె ఉత్పత్తి సహకార సంఘం ద్వారా రైతులకు అవసరమైన మొక్కలను సిద్ధంగా ఉంచడం జరిగిందన్నారు. ఆయిల్ పామ్ సాగుకు ఎకరాకు 57 మొక్కలను నాటుకోవచ్చని, ప్రతి మొక్క ధర రూ.193 కాగా ఇందులో రైతులు కేవలం రూ.20 చొప్పున చెల్లిస్తే సరిపోతుంది. తోటల్లో ఐదు హెక్టార్ల వరకు ఎస్సీ, ఎస్టీ రైతులకు బిందు సేద్య పరికరాలు ఏర్పాటు చేసుకోవడానికి 90 శాతం సబ్సిడీ అందజేయడం జరుగుతుందన్నారు. బీసీ రైతులకు 80 శాతం, ఇతర రైతులకు 70 శాతం సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన 1777 మంది రైతులు 7164.72 ఎకరాల్లో ఇప్పటివరకు ఆయిల్ పామ్ తోటలను సాగు చేశారన్నారు. ఇందులో 2014.53 ఎకరాల్లో 349 మంది రైతులకు 4619.64 టన్నుల దిగుబడి రాగా రూ.100267169 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. ఆయిల్ పామ్ తోటల సాగుకు దరఖాస్తు చేసుకునే రైతుల సాగు భూమి, విద్యుత్ సదుపాయం, నీటి లభ్యతను ముందుగా క్షేత్రస్థాయిలో ఉద్యానవన శాఖ అధికారులు పరిశీలించడం జరుగుతుందన్నారు. ముందుగా దరఖాస్తు చేసుకునే రైతులకు ప్రాధాన్య క్రమంలో క్షేత్ర పరిశీలన పూర్తయ్యాక మొక్కలను అందించడం జరుగుతుందని తెలిపారు. బిందు సేద్య సౌకర్యం ఏర్పాటు చేసుకోవడానికి కూడా దరఖాస్తులు అందజేస్తే పరికరాలను మంజూరు చేస్తారన్నారు. రైతులు తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద దరఖాస్తులను పొంది పూరించాక అవసరమైన డాక్యుమెంట్లను జతపరిచి ఇవ్వాలన్నారు. మొక్కల ఖరీదుకు సంబంధించి రైతుల వాటాగా చెల్లించాల్సిన డబ్బులు డిహెచ్ఎస్ఓ గద్వాల. పేరున మాత్రమే డిడి తీసి ఇవ్వాలన్నారు. మరిన్ని వివరాలకు రాజ్ కుమార్, జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ అధికారి 8977714301, గద్వాల ధరూర్ మల్దకల్ మండల రైతులు ఉద్యాన అధికారి రాజశేఖర్ 8977714295, అలంపూర్ మానవపాడు ఉండవెల్లి వడ్డేపల్లి ఇటిక్యాల ఎర్రవల్లి రైతులు ఉద్యాన అధికారి ఇమ్రాన్ 8977714296, ఐజా గట్టు కేటీ దొడ్డి రాజోలి మండలాలకు చెందిన రైతులు సంబంధిత ఉద్యానాధికారి మహేష్ 8977714297 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

## సర్ ప్రక్రియ వేగవంతానికి స్వచ్ఛంద సంస్థలు, విశ్రాంత ఉద్యోగుల సహకారం అవసరం

- మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజబాల్ రెడ్డి




**తాండూరు, జూలై 11 (జనంసాక్షి) :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమంలో భాగంగా తాండూర్ ఆర్డీఓ అనిత నిర్వహించిన సమీక్ష సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ నీరజబాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో సర్ ప్రక్రియను పూర్తి చేసే క్రమంలో కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. వాటిని తక్షణమే పరిష్కరించాల్సిన అవసరం ఉందని ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ తరపున బీఎల్ఏలు, కౌన్సిలర్లు క్షేత్ర స్థాయిలో చాలా సమర్థవంతంగా పనిచేస్తున్నారు. ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారని వివరించారు. కొన్ని ప్రాంతాల్లో కౌన్సిలర్లు స్వచ్ఛందంగా వాలంటీర్లను నియమించి సర్ పనులను వేగవంతం చేస్తున్నారని తెలిపారు. కౌన్సిలర్లు తమ సొంత ఖర్చుతో వాలంటీర్లను నియమించి ప్రక్రియను ముందుకు తీసుకెళ్తున్నారు. ఇది అభినందనీయమని అన్నారు. స్వచ్ఛంద సంస్థలు, విశ్రాంత ఉద్యోగుల సహకారం ఉంటే సర్ ప్రక్రియ మరింత వేగంగా, పారదర్శకంగా పూర్తవుతుంది. అందరం కలిసి పనిచేస్తే లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేయగలమ ని చైర్ పర్సన్ పిలుపునిచ్చారు. ఈ సమీక్ష సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ అభివృద్ధికి రూ.14 కోట్ల నిధులు

- అరుణ్ పటేల్ హామీతో మారనున్న కాలనీల రూపురేఖలు



**ఉప్పల్, జూలై 11 (జనం సాక్షి) :** వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని బాలకృష్ణ నగర్, సత్య నగర్ కాలనీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.14 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో రహదారులు, డ్రైనేజీలు, వీధిదీపాలు, విద్యుత్ స్తంభాలు తదితర మౌలిక వసతుల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. సుమారు మూడు నెలల క్రితం యువ నాయకుడు ఆకారపు అరుణ్ పటేల్ చేపట్టిన "బస్తీ బాట" కార్యక్రమంలో భాగంగా కాలనీల్లో పర్యటించి ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు కరెంట్ స్తంభాలు, వీధిదీపాలు, డ్రైనేజీ, అంతర్గత రహదారుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల ఇబ్బందులను గుర్తించిన ఆకారపు అరుణ్ పటేల్, ఉప్పల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందముల్ల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషి చేసి, నిధుల మంజూరుకు చొరవ చూపినట్లు నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి భారీగా నిధులు మంజూరవుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా వెంకట్ రెడ్డి నగర్ డివిజన్‌లోని బాలకృష్ణ నగర్, సత్య నగర్ ప్రాంతాల్లో ప్రతి గల్లీ, ప్రతి సందులో నాణ్యమైన రహదారులు, డ్రైనేజీలు, వీధిదీపాలు తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని చెప్పారు. ఉప్పల్ ప్రజలు గతంలో చూపిన విశ్వాసానికి ప్రతిఫలంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని, ఉప్పల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందముల్ల పరమేశ్వర్ రెడ్డి నిరంతర కృషితో కోట్ల రూపాయల అభివృద్ధి పనులు మంజూరవుతున్నాయని నాయకులు పేర్కొన్నారు. రూ.14 కోట్ల నిధుల మంజూరుపై హర్షం వ్యక్తం చేసిన స్థానిక ప్రజలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప్పల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందముల్ల పరమేశ్వర్ రెడ్డి, యువ నాయకుడు ఆకారపు అరుణ్ పటేల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధి పనులు పూర్తయితే వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

- అరెస్ట్ అయిన వారిలో ముగ్గురు కాంగ్రెస్ నాయకులు
- పేకాట అడ్డగా మారిన ఏఎంసీ చైర్మన్ ఇల్లు

**వికారాబాద్ జిల్లా బ్యూరో, జూలై 11 (జనం సాక్షి) :** ప్రజలకు సేవ చేయవలసిన ప్రజా ప్రతినిధులు రాజకీయ నాయకులు పట్టపగలు నడి వీధిలో రోజు పేకాట ఆడుతున్నారు. దారిన పోయే ప్రజలు ముక్కున వేలేసుకుని వీళ్లకు ఏం పోయే కాలం వచ్చింది. ప్రజలను దారిలో పెట్టే వారే ప్రజల ముందు పేకాట ఆడుతూ సమాజానికి ఏం సంకేతం ఇస్తారని శాపనార్థాలు పెట్టుకుంటూ వెళ్లడం శర మామూలు అయింది. ఈ విషయం ఆ నోట ఈ నోట టాస్క్ ఫోర్స్ కు చేరడంతో ఏఎంసీ చైర్మన్ ఇంటిపై దాడి జరిగింది. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా కోట్ పల్లి మండల కేంద్రంలో జరిగింది. కోట్ పల్లి ఏఎంసీ చైర్మన్ అంజయ్య ఇంటిపై టాస్క్ ఫోర్స్ పోలీసులు జరిపిన దాడిలో బుగ్గపూర్ మాజీ సర్పంచ్ వెంకటయ్య కోట్ పల్లి మాజీ ఎంపీటీసీ మహేష్ గౌడ్ భీమయ్య వీరంతా కాంగ్రెస్ పార్టీకి చెందిన కీలక నాయకులు కాగా వీరితో పాటు కో ట్ పల్లి కి చెందిన రత్నం అజీమ్ రమేష్ నర్సయ్యలు పేకాడుతూ పట్టుబడ్డారు. వీరందరూ బస్టాండ్ దగ్గర ఉన్న ఏఎంసీ చైర్మన్ ఇంట్లో పట్టా పగలు పేకాట ఆడుతున్నారు. కింది పోర్షన్ లో హోటల్ నడుపుతుండగా పై పోర్షన్ లో ఉన్న ఒక గదిలో రోజు పేకాట సాగుతుంది. వీరు నుంచి టాస్క్ ఫోర్స్ పోలీసులు సెల్ ఫోన్లు 35570 రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. వీరిని



అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. కాగా గత కొంతకాలంగా ఏఎంసీ చైర్మన్ ఇంట్లో పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు రోజు పేకాట ఆడుతున్న స్థానిక పోలీసులు పట్టించుకోలేదు. ఈ సమాచారం టాస్క్ ఫోర్స్ కు చేరడంతో వారు దాడి చేసి ఏడుగురిని అరెస్ట్ చేశారు వారి నుంచి సెల్ ఫోన్లు నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో టాస్క్ ఫోర్స్ సిఐ అన్వర్ పాష తోపాటు మిగతా సిబ్బంది పాల్గొన్నారు.

### ఓగలపూర్ కేసు ఏమైనట్లు...?

కోట్‌పల్లి మండలం ఓగలపూర్ గ్రామంలో పేకాట ఆడుతున్న పదిమందిని టాస్క్ ఫోర్ పోలీసులు గుర్తించి పట్టుకున్నట్లు ప్రచారం జరుగుతుంది. వారం రోజుల క్రితం వారు టాస్క్ ఫోర్స్ పోలీసులకు పట్టుబడిన సమాచారం బయటకు రాలేదని తెలుస్తుంది. టాస్క్ ఫోర్స్ పోలీసులు జరిపిన దాడిలో రాజకీయ నాయకులు ప్రజాప్రతినిధులు ఉన్న కారణంగానే కేసు వివరాలు బయట పెట్టలేదని ప్రచారం జరుగుతుంది. ఇది ఎంతవరకు వాస్తవం అన్నది టాస్క్ ఫోర్స్ పోలీసులు ప్రజలకు తెలియజేయవలసి ఉంది.

## అల్వాల్‌లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటుకు బాలసదన్ భవనం పరిశీలన



**అల్వాల్, జూలై 11 (జనంసాక్షి) :** మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వ ఆధీనంలో ఉన్న బాలసదన్ భవనాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ ఇంజనీర్ స్ఫూర్తి, జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు. అల్వాల్ ప్రాంతంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసే అవకాశాలపై అధికారులు స్థలాన్ని పరిశీలించి అందుబాటులో ఉన్న వసతులు, భవనం అనుకూలత తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, అల్వాల్ పరిసర ప్రాంత ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవలను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో ఈ ప్రాంతంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ప్రత్యేకంగా సూచించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆధీనంలోని బాలసదన్ భవనం ఇందుకు అనుకూలంగా ఉండటంతో సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించినట్లు పేర్కొన్నారు.

## డ్రగ్స్‌పై విద్యార్థుల కోసం సురక్ష మిత్ర



**వికారాబాద్ జిల్లా బ్యూరో, జూలై 11 (జనం సాక్షి) :** వికారాబాద్ జిల్లా పోలీసుల వినూత్న "సురక్ష మిత్ర" కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నేటి నుండి వారం రోజుల పాటు డ్రగ్స్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ శాఖ వినూత్నంగా ప్రారంభించిన "వికారాబాద్ సురక్ష మిత్ర" కార్యక్రమంలో భాగంగా శనివారం నుంచి ఈనెల 17 వరకు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. వివిధ పాఠశాలల్లో చదువుతున్న 5వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యార్థులకు డ్రగ్స్ నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది అని వికారాబాద్ జిల్లా ఎస్పీ తెలిపినారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల ఎస్‌హెచ్‌ఓలు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌డీపీఓలు, గ్రామ పోలీస్ అధికారులు సురక్ష మిత్ర వాలంటీర్లు సమన్వయంతో పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు ప్రత్యేక పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పిస్తారు. ఈ అవగాహన కార్యక్రమంలో విద్యార్థులకు డ్రగ్స్ అంటే ఏమిటి, మత్తు పదార్థాల వల్ల శారీరక, మానసిక ఆరోగ్యంపై కలిగే హానికర ప్రభావాలు, చదువు మరియు భవిష్యత్తుపై వాటి ప్రభావం, స్నేహితుల ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలి, డ్రగ్స్‌కు నో ఎలా చెప్పాలి, అనుమానాస్పద పరిస్థితుల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులను ఎలా సంప్రదించాలి, ఎన్ డి పి ఎస్ చట్టంలోని నిబంధనలు, ఆరోగ్యకరమైన జీవనశైలి, క్రీడలు, కళలు, హాబీల ప్రాధాన్యత వంటి అంశాలపై సులభమైన రీతిలో అవగాహన కల్పించబడుతుంది. అదేవిధంగా విద్యార్థులు తమ పాఠశాల, కుటుంబం మరియు సమాజంలో డ్రగ్స్ రహిత వాతావరణం ఏర్పడేందుకు సురక్ష మిత్రగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, డ్రగ్స్‌కు దూరంగా ఉండి ఇతరులను కూడా దూరంగా ఉంచేలా ప్రతిజ్ఞ చేయించనున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సురక్ష మిత్ర వాలంటీర్లు, గ్రామ పోలీస్ అధికారులు, పోలీస్ సిబ్బంది అందరూ కలిసి విద్యార్థుల్లో డ్రగ్స్‌పై అవగాహన పెంపొందించేందుకు కృషి చేయాలి. వారం రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో డ్రగ్స్‌పై అవగాహన పెంపొందించడంతో పాటు, సమాజంలో మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రజల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం ప్రధాన లక్ష్యమని, మాదకద్రవ్యాల రహిత వికారాబాద్‌ను సాధించడం కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదు, ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత. మన పిల్లల బంగారు భవిష్యత్తు కోసం ప్రారంభించిన ఈ 'సురక్ష మిత్ర' కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలని కోరుతున్నాను అని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా లోని పోలీస్ అధికారులు తమ తమ పరిధిలోని స్కూల్స్ లలో అవగాహనా కార్యక్రమాలు చెయ్యడం జరుగుతుందని తెలియజేశారు.

## ఓటర్ల జాబితా సవరణకు ప్రత్యేక ఎస్ఐఆర్ హెల్ప్‌డెస్క్‌లు



**ఖైరతాబాద్, జూలై 11 (జనం సాక్షి) :** ఓటర్ల జాబి తాల ప్రత్యేక విస్తృత సవరణ(ఎస్ఐఆర్) కార్యక్ర మంలో భాగంగా ఓటర్లకు సేవలను మరింత సుల భతరం చేయడంతో పాటు కొనసాగుతున్న సవర ణ ప్రక్రియపై మార్గనిర్దేశం చేసేందుకు 60-ఖైరతా బాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని సోమాజి గూడ ప్రెస్‌క్లబ్, బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లలో ప్రత్యేక ఎస్ఐఆర్ సహాయ కేంద్రాలు(హెల్ప్‌డెస్క్‌లు) శనివారం ఏర్పాటు చేశారు. ఓటర్లకు సౌకర్యవం తమైన సేవలు అందించేందుకు ఈ కేంద్రాల్లో సరైన సీటింగ్ ఏర్పా ట్లు, ఓటరు సహాయ కౌంటర్లు, అవసరమైన దర ఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంచారు. శిక్షణ పొందిన సిబ్బంది ఓటర్ల గణన ఫారాలు నింపడం, ఎస్ఐఆర్ మార్గదర్శకాలపై అవగాహన కల్పించ డం, ఓటరు వివరాల ధృవీకరణ, ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన సందేహాల నివృత్తిలో సహాయం చేస్తున్నారు. అలాగే అవసరమైన పత్రాలు, దరఖాస్తులను సమర్పించే విధానంపై కూడా ఓటర్లకు సూచనలు అందిస్తున్నారు. ఈ కేంద్రాల ద్వారా వేగవంతమైన సేవలు అందడంతో పాటు, ఖచ్చితమైన, నవీకరించిన ఓటర్ల జాబితాల రూప కల్పనలో ప్రజల భాగస్వామ్యం మరింత పెరుగు తుందని పేర్కొన్నారు.


## మెదక్ మాతా - శిశు ఆరోగ్య కేంద్రంలో సమస్యలపై సీపీఎం ఆందోళన

**మెదక్ బ్యూరో చీఫ్, జూలై 11 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా కేంద్రంలోని మాతా - శిశు ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆసుపత్రిని సందర్శించిన ప్రతినిధి బృందం రోగులు, వారి సహాయకులు, సిబ్బందితో మాట్లాడి సమస్యలను తెలుసుకుంది. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ, ఆసుపత్రిలో తాగునీరు, పారిశుద్ధ్యం, సహాయకులకు వసతి, మరుగుదొడ్లు, స్నానపు గదులు వంటి కనీస మౌలిక సదుపాయాలు కూడా లేకపోవడం బాధాకరమన్నారు. ఆసుపత్రి ఆవరణ అపరిశుభ్రంగా




ఉండటంతో పాటు పిచ్చిమొక్కలు పెరిగిపోవడం, రాత్రివేళ పాములు, తేళ్లు వార్డుల్లోకి వస్తున్నాయని ఆరోపించారు. ప్రయోగశాల పరీక్షల నివేదికలు ఆలస్యంగా రావడంతో రోగులు ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం. అడివయ్య, జిల్లా కార్యదర్శి కె. నర్సమ్మ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏ. మల్లేశం, కె. మల్లేశం, జిల్లా కమిటీ సభ్యుడు జె. సంతోష్‌తో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## నకిలీ డాక్టర్ అరెస్ట్



**మల్కాజిగిరి, జూన్ 11 (జనం సాక్షి) :** ఎలాంటి అర్హతలు లేకుండా క్లినిక్ నిర్వహిస్తూ, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఒక నకిలీ వైద్యుడిని మల్కాజిగిరి పోలీసులు గురువారం అరెస్టు చేశారు. సిఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం. మౌలాలిలోని షఫీనగర్, సుభాష్‌నగర్ సమీపంలో పాషా క్లినిక్ లో ఎలాంటి వైద్య అర్హతలు లేని వ్యక్తి క్లినిక్ నడుపుతున్నాడని విశ్వాసనీయ సమాచారంతో మల్కాజిగిరి ఏసిపి ఆదేశానుసారం క్లినిక్‌పై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆసమయంలో ఒక వ్యక్తి మెడలో స్టెతస్కోప్ వేసుకుని రోగులను పరీక్షిస్తుండగా పోలీసులు గుర్తించారు. అతడిని విచారించగా వైద్య అర్హత పత్రాలు గానీ, ప్రాక్టీస్ చేయడానికి తగిన ఆధారాలు గానీ చూపించలేకపోయాడు. నేరెడ్‌మెట్‌లోని ప్రగతినగర్‌కు చెందిన షేక్ జాన్ పాషా (52)గా గుర్తించారు. ఎటువంటి మెడికల్ డిగ్రీ లేకుండానే గత కొంతకాలంగా డాక్టర్‌గా చలామణీ అవుతూ, అమాయక ప్రజల వద్ద నుంచి ఫీజులు వసూలు చేస్తూ చికిత్స అందిస్తున్నట్లు నిందితుడు విచారణలో అంగీకరించాడు. క్లినిక్ నుంచి బీపీ మిషన్, స్టెతస్కోప్, ప్రిస్క్రిప్షన్ బుక్, ఇంజెక్షన్లు, థర్మామీటర్, గ్లూకోస్ బాటిల్స్, పారాసిటమాల్ బిళ్లలు, సిరప్‌లతో పాటు ఐవీ ఫ్లూయిడ్ సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని, స్వాధీనం చేసుకున్న సామాగ్రిని మల్కాజిగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించి ఇందులో పై కేసు నమోదు చేశామని తెలిపారు.

# నిమ్స్ న్యూరో సర్జరీ విభాగానికి రూ.కోటి విలువైన అత్యాధునిక పరికరం

- సీఎస్ఆర్ కింద మిసోనిక్స్ నెక్సస్ బోన్ స్కాల్పెల్ సిస్టమ్ అందజేత

**ఖైరతాబాద్, జూలై 11 (జనం సాక్షి) :** నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) న్యూ రోసర్జరీ విభాగానికి సుమారు రూ.1 కోటి విలువైన అత్యాధునిక మిసోనిక్స్ నెక్సస్ బోన్ స్కాల్పెల్ సిస్టమ్‌ను బీహెచ్ఈఎల్-జీఈ గ్యాస్ టర్బైన్ సర్వీ సెస్ ప్రైవేట్ లిమిటెడ్ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా అంద జేసింది. రోటరీ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ సన్‌రైజ్, రో టరీ సన్‌రైజ్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ పరికరా న్ని నిమ్స్‌కు విరాళంగా అందించారు. ఈ కార్యక్ర మానికి బీహెచ్ఈఎల్-జీఈ గ్యాస్ టర్బైన్ సర్వీ సెస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ధర్మేష్ సావే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నిమ్స్ డై రెక్టర్ ప్రొఫెసర్ డా.రాహుల్ దేవ్‌రాజ్, డీన్ డా.పి. చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డా.జి.కె. పరంజ్యోతి, న్యూరోసర్జరీ విభాగాధిపతి ప్రొఫెసర్ డా.వై.వంశీ కృష్ణ సమక్షంలో పరికరాన్ని ప్రారం భించారు. ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ డా.రాహుల్ దేవ్‌రాజ్ మాట్లాడుతూ అత్యాధునిక మిసోనిక్స్ నెక్సస్ బోన్ స్కాల్పెల్ సిస్టమ్ అందు బాటులోకి రావడం నిమ్స్‌కు మరో మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. ఈ పరికరం ద్వారా క్లిష్ట మైన మెదడు, వెన్నెముక శస్త్రచికిత్సలను మరింత ఖచ్చితత్వంతో, అత్యంత భద్రతతో నిర్వహించే అవకాశం ఉంటుందని తెలిపారు. శస్త్రచికిత్సల సమయంలో మృదుకణజాలానికి కలిగే నష్టం తగ్గ డంతో పాటు రోగులు వేగంగా కోలుకునేందుకు, మెరుగైన వైద్య ఫలితాలు సాధించేందుకు ఈ సాం కేతికత దోహదపడుతుందని పేర్కొన్నారు. సీఎ స్ఆర్ కార్యక్రమంలో భాగంగా విలువైన పరికరాన్ని అందించిన బీహెచ్ఈఎల్-జీఈ గ్యాస్ టర్బైన్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, రోటరీ క్లబ్ ఆఫ్ సికిం ద్రాబాద్ సన్‌రైజ్, రోటరీ సన్‌రైజ్ సర్వీస్ ట్రస్ట్ ప్రతి నిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3150 జిల్లా గవర్నర్(2025-26) డా.ఎస్.వి.రామ్




ప్రసాద్, బీహెచ్ఈఎల్-జీఈ గ్యాస్ టర్బైన్ సర్వీసెస్ జా యింట్ మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్ యూరుపాక, రోటరీ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ సన్‌రైజ్ అధ్యక్షుడు రంజయ్ గోయెల్, ట్రస్ట్ చైర్మన్ రాజ్‌హన్స్ బాంకా, ట్రస్ట్ సెక్రటరీ శ్రీనివాస్ గుమిడెల్లి, ట్రస్ట్ ట్రెజరర్ రవి లాడియా, అధ్యాపకులు, వైద్యులు, రెసిడెంట్ వై ద్యులు, నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
12 జూలై 2026

# ఉద్యోగాల భర్తీ కోసం జూలై 15న ఇందిరాపార్క్ వద్ద సీపీఎం మహాధర్నా

- ఉద్యోగాలు భర్తీ చేస్తామని యువతను మోసం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు
- మహాధర్నా కరపత్రం విడుదల



**సంగారెడ్డి, జూలై 11 (జనం సాక్షి) :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జూలై 15న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మహా ధర్నా చేపడుతున్నామని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అన్నారు. శనివారం సంగారెడ్డిలో సిపిఎం జిల్లా కార్యాలయంలో కరపత్రాన్ని విడుదల ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ ఉద్యోగాల భర్తీ పేరుతో యువతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని ఆయన అన్నారు. భారతదేశం నేడు ప్రపంచంలోనే అత్యధిక యువశక్తి కలిగిన దేశం మనదన్నారు. యువశక్తి సామర్థ్యాన్ని దేశాభివృద్ధికి ఉపయోగించుకోవడంలో పాలకులు విఫలమవుతున్నారనీ తెలిపారు. నిరుద్యోగ కోరల్లో చిక్కిన యువత భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందని, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత పాలకులపై ఉందనీ తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు కావస్తున్నా నేటికి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేవన్నారు. నిరుద్యోగం రోజు రోజుకు పెరుగుతున్నదనీ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం ఏమీ ఎరుగనట్లు నిరుద్యోగ యువత ఆశలతో రాజకీయాలు చేస్తూ వారి భవిష్యత్తును అంధకారంలోకి నెట్టివేస్తున్నాయన్నారు. తమ అధీనంలో ఉండే ప్రభుత్వ కొలువుల నియామకాలను చేపట్టడంలో రెండు ప్రభుత్వాలు మీన మేషాలు లెక్కిస్తున్నాయన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీతో 2014లో మోడీ సర్కార్ అధికారంలోకి వచ్చి 12 ఏళు గడుస్తున్నప్పటికీ ఆ హామీని నెరవేర్చలేదన్నారు. ఉద్యోగాల కోసం ప్రశ్నించే యువతకు సమాధానం చెప్పాల్సిన పాలకులు, పకోడీలు, బజ్జీలు వేయడం కూడా ఉద్యోగాలే అంటూ వ్యాఖ్యలు చేయడం అత్యంత, బాధ్యతారహితమైన వైఖరన్నారు. మోడీ ప్రభుత్వం అధికారానికి వచ్చిన తర్వాత ఐటీ రంగం వేలసంఖ్యలో ఉద్యోగాలు కల్పిస్తామన్న హామి నెరవేరలేదన్నారు. మేక్ ఇన్ ఇండియా పేరుతో ప్రజాధనాన్ని వృధా చేయడమే తప్ప కొత్త రిక్రూట్మెంట్లులేవన్నారు. మరోవైపు ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదన్నారు. మరోవైపు ఈ సంస్థలను ప్రైవేటికి అప్పగిస్తూ ఉద్యోగాలను కుదించేస్తున్నదన్నారు.

అలాగే తెలంగాణ రాష్ట్రంలో ఎన్నో ఆశలు, ఆకాంక్షలు, వేలాది మంది యువత త్యాగాలు, నిరుద్యోగుల ఆత్మబలిదానాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందనీ తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి నిరుద్యోగ సమస్య కూడా ప్రధానమైందన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై యూత్ డిక్లరేషన్ ప్రకటించడం జరిగిందన్నారు. కానీ పూర్తిస్థాయిలో ఉద్యోగుల ప్రకటనలు తప్ప భర్తీలు లేవని విమర్శించారు. నిరుద్యోగ యువత జూలై 15 ఇందిరాపార్క్ వద్ద జరిగే ధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం నర్సింలు, జిల్లా కమిటీ సభ్యులు కృష్ణ, నాయకులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మట్టి రవాణాపై పోలీసుల కొరడా

- రెండు ట్రాక్టర్లు, జేసీబీ సీజ్
- డ్రైవర్లు, యజమానులపై కేసులు

**కల్వకుర్తి, జూలై 11 (జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలంలోనిపంజాగుల గ్రామ పరిధిలోని కేఎల్ఐ కాలువ నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టిని తవ్వి తరలిస్తున్నరెండు ట్రాక్టర్లు,ఒక జేసీబీని పోలీసులు శుక్రవారం పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.అక్రమ మట్టి రవాణా జరుగుతున్నట్లు సమాచారంఅందడంతో పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం డ్రైవర్లు,వాహన యజమానులపై కేసులు నమోదు చేశారు.ఈ సందర్భంగా ఎస్ఐ కురుమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టి,ఇసుక లేదా,ఇతర ఖనిజాలను తవ్వడం,రవాణా చేయడం చట్టవిరుద్ధమని స్పష్టం ఎస్సై కురుమూర్తి చేశారు.అక్రమ తవ్వకాలు, రవాణాకు పాల్పడే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని,చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఇటువంటి అక్రమాలపై ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కల్వకుర్తి ఎస్ఐ కురుమూర్తికోరారు.



## కేంద్ర ప్రభుత్వం నిధులతోనే గ్రామాల అభివృద్ధి



**సదాశివపేట, జూలై 11 (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని బిజెపి మండల అధ్యక్షుడు కర్ణం ఆదిత్య అన్నారు. శనివారం సదాశివపేట మండలం బొబ్బిలిగామ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు 10 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ సవ్వ ఉమాదేవి, స్థానిక బిజెపి నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కర్ణ ఆదిత్య మాట్లాడుతూ గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం, మౌలిక వసతులను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి ఉక్కిస భరత్, ఉప సర్పంచ్ లు విజేందర్, కిరణ్ కుమార్, గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, వీఆర్వో శ్రీనివాస్, ముఖేష్, అనిల్, కల్పగురి నాగరాజు, జగన్నాథ్ రెడ్డి, ప్రశాంత్ , మొగులయ్య, వేణు, సుభాష్, దుర్గారాజ్, సుభాన్, లక్ష్మణ్, ప్రసాద్, సత్యనారాయణ, శ్రీకృష్ణ, సాకేత్, బన్నీ, గ్రామ మాజీ సర్పంచ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# భూ రీ-సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- మంత్రి పొంగులేటి
- మార్చి-2027 నాటికి మూడు విడతల్లో రీ-సర్వే పూర్తి చేయాలి
- లైసెన్స్ సర్వేయర్లకు ఎకరానికి రూ.60 చెల్లింపు
- సాదాబైనామా, ఇందిరమ్మ ఇళ్లు, 2బీహెచ్‌కే ఇళ్ల పురోగతిపై సమీక్ష



**మెదక్ బ్యూరో చీఫ్, జూలై 11 (జనం సాక్షి) :** భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం, భూ భారతి చట్టం సమర్థవంతమైన అమలుకు రాష్ట్రవ్యాప్తంగా భూ రీ-సర్వేను అత్యంత ప్రాధాన్యంతో చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఖమ్మం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి భూ రీ-సర్వే, సాదాబైనామా దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్లు, 2బీహెచ్‌కే ఇళ్ల పంపిణీ, విద్యార్థుల యూనిఫాంల పంపిణీపై సమీక్షించారు. మెదక్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్ నగేష్ పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ తొలి విడతలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ-సర్వే చేపట్టి, మార్చి-2027 నాటికి మూడు విడతల్లో రాష్ట్రవ్యాప్తంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రీ-సర్వేలో పనిచేసే లైసెన్స్ సర్వేయర్లకు ఎకరానికి రూ.60 చెల్లిస్తామని, జూలై 28లోపు విధుల్లో చేరని వారి లైసెన్సులు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. ధరణి కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులను నిబంధనల మేరకు వేగంగా పరిష్కరించాలని, నిషేధిత జాబితాలోని భూముల సమస్యలను కూడా పరిష్కరించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న 2బీహెచ్‌కే ఇళ్లను లబ్ధిదారులకు అందజేయాలని, పనుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ తొలి విడత రీ-సర్వేను నవంబర్‌లోపు పూర్తి చేయాలని సూచించగా, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ ఆగస్టు 15 నాటికి ప్రతి విద్యార్థికి కనీసం ఒక జత యూనిఫాం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

## చేనేత కార్మికుల అభివృద్ధికి కృషి చేయాలి

- కేంద్ర ప్రభుత్వ అదనపు న్యాయవాది నందు నామాజీ



**నారాయణపేట, జూలై 11 (జనం సాక్షి) :** చేనేత కార్మికుల కు ఉపాధి అవకాశాలు పెంచి వారి అభివృద్ధికి కృషి చేయాలని నూతనంగా నారాయణపేట జిల్లా కేంద్రంలోని దూల్ పేట సిల్క్ సొసైటీ అధ్యక్షుడు బి.అంబాదాస్‌కు కేంద్ర ప్రభుత్వ అదనపు న్యాయవాది నందు నామాజీ సూచించారు. అంబాదాస్ సిల్క్ సొసైటీ అధ్యక్షుడుగా ఎన్నిక అయిన సందర్భంగా నందు నామాజీ శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. అంబాదాస్ మాట్లాడుతూ చేనేత కార్మికులు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారి అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు.

## ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ హరిప్రియ



**జడ్చర్ల, జూలై 11 (జనంసాక్షి) :** ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్-2026)లో భాగంగా చేపట్టిన డిజిటలైజేషన్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్, జడ్చర్ల ఈఆర్ఓ జె. ఎల్.బి హరిప్రియ అధికారులను ఆదేశించారు. శనివారం జడ్చర్ల మండలం, కొత్త తండా గ్రామంలోని పోలింగ్ స్టేషన్-154 ను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ, డిజిటలైజేషన్ పురోగతిని సమీక్షించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా, పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నర్సింగ రావు, స్థానిక ప్రజాప్రతినిధులు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

## అర్హులు ఓటును కోల్పోవద్దు



**మల్దకల్, జూలై 11 (జనంసాక్షి) :** క్షేత్రస్థాయిలో సర్"ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ 2026 ప్రక్రియను శనివారం మండలంలోని నీలిపల్లి గ్రామంలో తహసిల్దార్ ఝాన్సీ రాణిఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆయా పోలింగ్ కేంద్రాల వార్డులలో విధులు నిర్వర్తిస్తున్న బిఎల్ఓల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలోని బిఎల్ఓలు బిఎల్ఎలతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా సమన్వయంతో ఈ ప్రక్రియను వేగవంతంగా గడువులోగా పూర్తిచేయాలనిసూచించారు. ముఖ్యంగా ప్రస్తుతం తమ సొంత ఊరిలో అందుబాటులో లేని వారు ఇటీవల ఇల్లు మారిన కుటుంబాలు లేదా ఓటర్ లిస్ట్ లో పేరు లేదని ఆందోళన చెందుతున్న అర్హులైన ఓటర్లందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేవిధంగా అవసరమైన మేరకు చర్యలు తీసుకొని తగిన సమాచారాన్నిఅందించి అలాంటి వారిని గుర్తించి పూర్తి వివరాలతో ఆన్లైన్‌లో ఎన్యుమరేషన్ చేయాలని తెలిపారు. సర్ ప్రక్రియపై ప్రజలు నిర్లక్ష్యం వీడాలని అర్హులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటు కోల్పోద్దని ఈ ప్రక్రియపై అవగాహన కలిగి తమ ఓటును కాపాడుకోవాలని వెంటనే ఆన్‌లైన్ ఎన్యుమరేషన్‌లో భాగస్వాములు కావాలని సూచించారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ సమర్థవంతంగా వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటివరకు నమోదవుతున్న వివరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మహేందర్, సీనియర్ అసిస్టెంట్ కరీం, జిపిఓలు బిఎల్ఓ, బిఎల్ఏ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచస్థాయి సాంకేతిక విద్య అందించాలనేదే ప్రభుత్వ లక్ష్యం

- స్మార్ట్ కంప్యూటర్ ల్యాబ్ ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం
- జేఎన్‌టీయూ సుల్తాన్‌పూర్‌కు రెండు కొత్త బస్సులు
- విద్యార్థులకు అందుబాటులో స్మార్ట్ కంప్యూటర్ ల్యాబ్
- మంత్రి దామోదర రాజనర్సింహ



**సంగారెడ్డి బ్యూరో, జూలై 11 (జనం సాక్షి) :** విద్యార్థులకు ప్రపంచ స్థాయి సాంకేతిక విద్య అందించాలనే లక్ష్యంతో విద్యాసంస్థల్లో అవసరమైన సదుపాయాలను దశలవారీగా కల్పిస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్‌లోని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన రెండు నూతన బస్సులను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శనివారం ప్రారంభించారు. అలాగే విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన స్మార్ట్ కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యతో పాటు సురక్షితమైన రవాణా సౌకర్యాలు, ఆధునిక మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కొత్త బస్సుల వల్ల విద్యార్థుల రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారడంతో పాటు సమయపాలన మెరుగుపడుతుందని తెలిపారు. స్మార్ట్ కంప్యూటర్ ల్యాబ్ ద్వారా విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకుని ఉద్యోగ అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకునే అవకాశం ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి సాంకేతిక విద్య అందించాలనే లక్ష్యంతో విద్యాసంస్థల్లో అవసరమైన సదుపాయాలను దశలవారీగా కల్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూహెచ్ వైస్ ఛాన్సలర్ డా. కిషన్ కుమార్ రెడ్డి, అదనపు కలెక్టర్ పాండు, కళాశాల ప్రిన్సిపల్ విశ్వనాథరాజు, అందోల్ ఆర్డీఓ రమేష్ బాబు, ప్రజాప్రతినిధులు, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు ఉద్యమాలకు సిద్ధం కావాలి

- పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు వై.జనార్దన్ రెడ్డి పిలుపు




**నారాయణపేట, జూలై 11 (జనం సాక్షి) :** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలకు సిద్ధం కావాలని పిఆర్‌టియుటిఎస్ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు యాదగిరి జనార్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పిఆర్‌టియుటిఎస్ నారాయణపేట మండల శాఖ అధ్యక్షులు ఎం రఘువీర్, మండల ప్రధాన కార్యదర్శి ఎం. జనార్దన్‌ల ఆధ్వర్యంలో నారాయణపేట మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు కోటకొండ, కొల్లంపల్లి, జాజాపూర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల తిరుమలపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు కోటకొండ, అమ్మి రెడ్డిపల్లి, కొల్లంపల్లి, జాజాపూర్ తదితర పాఠశాలలో పిఆర్టియు టీఎస్ 2026-2027 విద్యా సంవత్సరము సభ్యత్వ నమోదును కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా శాఖ అధ్యక్షులు వై.జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వము వెంటనే 51 శాతం ఫిట్మెంట్‌తో పిఆర్సిని అన్ని పెండింగ్ డిఎలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. నెల రోజుల్లోగా ప్రభుత్వము పిఆర్సి నివేదికను తెప్పించుకొని పీఆర్సిని అమలు చేయక పోతే ఉపాధ్యాయ లోకము ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కేవలం జీతభ త్యాల మీద ఆధారపడి నిరంతరం ప్రభుత్వ పాఠశాలను పరిరక్షిస్తున్న ఉపాధ్యాయులు అసహనమునకు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వము వారి అసహనాన్ని పరీక్షిస్తే ఉద్యమం మొదలవుతుందని స్పష్టం చేశారు. తీవ్రమైన ఉద్యమరూపం దాల్చకముందే పిఆర్సి ప్రకటించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా హెల్త్ కార్డుల విషయంలో ఉపాధ్యాయులు ఎలాంటి అపోహలకు వెళ్లకుండా ఆందోళన చెందవలసిన అవసరం లేదని ప్రస్తుతం నాణ్యమైన వైద్యం అందేలా చర్య తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం సర్వీస్‌లోని ఉపాధ్యాయులకు టెట్‌ను ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లో నిర్వహించి క్వాలిఫై మార్కులను తగ్గించాలని కోరారు. మరీ ముఖ్యంగా సర్వీసు రూల్స్ రూపొందించి మండల విద్యాశాఖ అధికారులు, జూనియర్ లెక్చరర్లు తదితర ప్రమోషన్లను అందజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వై. నారాయణ రెడ్డి, కే శ్రీనివాస్, జిల్లా సైన్స్ అధికారి భాను ప్రకాష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నర్సింగ్ రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు సాయిలు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ సునీత, భారతి, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, పవన్, నవీన్, వినయ్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయ బృందం నారాయణ, తిరుపతి రెడ్డి, శివకుమార్, వెంకట చారి, మధుసూదన్, శిరీష, నిర్మల, విజయమ్మ బాల కృష్ణప్ప, స్నేహలత, పరిమళ తిమ్మప్ప, భాస్కర్, రజిని, రాములు రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణ వేగవంతం చేయాలి

- పంజుగులలో ప్రక్రియను పరిశీలించిన ఎమ్మార్వో ఇబ్రహీం

**కల్వకుర్తి, జూలై 11 (జనంసాక్షి) :** కల్వకుర్తి మండలంలోని పంజుగుల గ్రామంలోప్రత్యేక ఓటరు జాబితాసవరణ ప్రక్రియను శనివారం మండల రెవెన్యూ అధికారి ఇబ్రహీం పరిశీలించారు. ఆయనతో పాటు రెవెన్యూ తనిఖీ అధికారి అబ్దుల్ రావుఫ్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న ప్రక్రియను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మండల రెవెన్యూ అధికారి మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. ప్రజాప్రతినిధులతో పాటు అన్ని రాజకీయ పార్టీల ఓటరు జాబితా ప్రతినిధులు సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్షేత్రస్థాయి అధికారులు ఉషా అశోక్, అలివేలు, దారమోని గణేష్, వేణుగోపాల్, రవి నాయక్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# అవమానం భరించలేక యువకుడి ఆత్మహత్య

- అవమానపరిచిన వ్యక్తిపై కేసు నమోదు



**హనుమకొండ ప్రతినిధి / దామెర జూలై 11 (జనం సాక్షి) :** దామెర మండలం కొగిల్వాయి గ్రామంలోని చర్చి వద్ద ఈనెల ఐదవ తేదీ రాత్రి 7 గంటలకు అదే గ్రామానికి చెందిన ఈర్ల తరుణ్ అనే వ్యక్తి గడ్డం వికాస్ అనే వ్యక్తిని ఇష్టమైన రీతిలో దుర్భాషలాడుతూ కొట్టి అవమానపరిచి చావమని ప్రేరేపించగా వికాస్ అవమానం భరించలేక ఇంటికి వెళ్లి పురుగుల మందు తాగడం జరిగింది చికిత్స నిమిత్తం ఎంజిఎంకు తరలించగా అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం అజారా హాస్పిటల్ తరలించారు. మెరుగైన చికిత్స పొందుతూ 11వ తేదీ ఉదయం 11:55 మృతి చెందడం జరిగిందని వైద్యులు నిర్ధారించడం జరిగింది నా కొడుకు మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని మృతుడి తండ్రి గడ్డం రమేష్ దామెర పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా దామెర ఎస్సై వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరుగుతున్నదని తెలియజేశారు.

# నిరుద్యోగ యువతను మోసం చేస్తున్న పాలకులు

- డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్



**హనుమకొండ ప్రతినిధి, జులై 11 (జనంసాక్షి) :** నిరుద్యోగ యువతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ మోసం చేస్తున్నాయని డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ విమర్శించారు. సోమవారం హనుమకొండ రాంనగర్, సుందరయ్య భవన్ లో డివైఎఫ్ఐ జిల్లా రెండవ మహాసభ నిర్వహించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 12 ఏండ్లు గడుస్తున్నప్పటికీ ఆ హామీని ఇప్పటివరకు నెరవేర్చలేదని, ఉద్యోగాల కోసం ప్రశ్నించే యువతకు సమాధానం చెప్పాల్సిన కేంద్ర మంత్రులు పకోడీలు బజ్జీలు వేయడం కూడా ఉద్యోగాలు అంటూ నిరుద్యోగ యువతను హేళన చేస్తే మాట్లాడుతున్నారని, కేంద్ర ప్రభుత్వ శాఖలో 10 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్న, భర్తీకి నోచుకోవడం లేదని, మేక్ ఇన్ ఇండియా పేరుతో ప్రజాధనాన్ని వృధా చేయడం తప్ప రిక్రూట్మెంట్ లేదని, ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ, ప్రైవేటు కార్పొరేట్ సంస్థలకు అప్ప చెప్తున్నారని, విమర్శించారు. రాష్ట్రంలో గత టీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతను మోసం చేస్తే ప్రస్తుతం అధికారులు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ అమలు చేయకుండా నోటిఫికేషన్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తుందని, 20వేల కానిస్టేబుల్ పోస్టులు ఖాళీగా ఉంటే 7000 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చిందని, రాష్ట్రంలో ప్రతి ఏడాది అన్ని ప్రభుత్వ శాఖల్లో సుమారు 9000 మంది పదవి విరమణ పొందుతున్న, ఇప్పటికీ రెండు లక్షలు పైగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి ఇవన్నీ భర్తీ చేయడంలో కాలయాపన చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు హామీ ఇచ్చి మోసం చేసిందని పాలకులు నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీల అమలు కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మహాసభ ప్రారంభానికి ముందు డివైఎఫ్ఐ జెండాను జిల్లా ఉపాధ్యక్షులు మంద సుచందర్ ఎగరవేశారు. ఈ మా సభలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి, జిల్లా నాయకులు సముద్రాల అనిల్, జంపాల రమేష్, కురుకు రంజిత్, చిలక జంపన్న, బొమ్మ కంటి మణికంత, దద్దు రాజు, సునీత రావు, జయంతి, రాజేష్, క్రాంతి, లు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా జరగాలి



- అర్హుల పేర్లు పోకుండా జాగ్రత్త పడాలి
- ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు

**వరంగల్ ఈస్ట్, జులై 11 (జనం సాక్షి) :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా జరిగేలా బిఎల్ఏ లు బాధ్యతగా వ్యవహరించాలని వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యులు, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. శనివారం నగరంలోని 43వ డివిజన్ లో గల పలు గ్రామాలలోని బిఎల్ఏ లకు తిమ్మాపురంలోని క్యాంపు కార్యాలయంలో హన్మకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కెఆర్ దిలీప్ రాజ్, ఎస్ఐఆర్ ప్రక్రియ ఇంచార్జ్ సౌమ్య దిలీప్ రాజ్ ల అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పారదర్శక ఓటరు జాబితా రూపకల్పన కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియను పక్కాగా నిర్వహిస్తూ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారంలో పొందుపర్చిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి పక్కాగా నిర్ధారణ చేసుకోవాలని బిఎల్ఏలను ఆదేశించారు. ఈ ప్రక్రియ ద్వారా అర్హులైన ఓటర్లను జాబితాలో చేర్చడం, అనర్హులను తొలగించడం, అవసరమైన మార్పులు, చేర్పులు చేపట్టి ఖచ్చితమైన ఓటర్ల జాబితాను రూపొందిస్తారని వివరించారు. అంతరం ఇప్పటివరకు ఎస్ఐఆర్ ప్రక్రియ ఎంత శాతం పూర్తయింది, ఓటర్లు అందరికి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందా తదితర వివరాలు అడిగి తెలుసుకొని బిఎల్ఏలకు సర్ ప్రక్రియ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు మాడుగుల రాజ్ కుమార్, మాజీ కార్పొరేటర్ అరుణ విక్టర్, మాజీ డివిజన్ అధ్యక్షులు చింత ప్రకాష్, మాజీ మండల అధ్యక్షులు వడ్డేపల్లి ప్రకాష్, సీనియర్ నాయకులు గంటా నరేందర్ రెడ్డి, కొమురెల్లి యాదవ్, దూలం అనిల్ కుమార్, శివ కుమార్, అరుణ, దశరథం, సుభాకర్, జాన్సన్, కాగిత రాజు, డివిజన్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

# మా భూమి మాకు ఇప్పించండి

- ఆకారపు రాజమ్మ రాజమల్లు



**ధర్మసాగర్ జులై 11 (జనంసాక్షి) :** మా భూమి మాకు ఇప్పించండి అని ఆకారపు రాజమ్మ రాజమల్లు వెంకట్ స్వామి ప్రభుత్వాన్ని కోరుతున్నారు శనివారం మండలంలోని పెద్ద పెండ్యాల గ్రామంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు పెద్ద పెండ్యాల గ్రామానికి చెందిన ఆకారపు రాజయ్య రాచమల్లు వెంకటస్వామి 2001లో అదే గ్రామానికి చెందిన రాజారపు కొమురయ్య వద్ద సర్వే నెం.142లో 10 గుంటల వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి అప్పటి నుంచి సాగు చేస్తున్నామని చెప్పారు తాజాగా కొమురయ్య కుమారుడు రాజారపు విజయ్ తమకు తెలియకుండా ఆ భూమికి తన పేరుతో పట్టా చేయించుకున్నాడని ఆరోపించారు. 2001లో డబ్బులు ఇచ్చి అగ్రిమెంట్ పత్రాలు ఉన్నప్పటికీ అప్పట్లో ఆర్ ఓ ఆర్ లో కొన్ని అవకతవకల వల్ల పట్టా రాలేదని ఇప్పుడు డబ్బు పలుకుబడితో విజయ్ పట్టా తీసుకున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు ఈ వివాదంపై సర్పంచ్ గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీ జరిగి రూ 3 లక్షలు ఇవ్వాలని నిర్ణయించిన తాను అంగీకరించలేదని దీంతో పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశామని తెలిపారు. 25 ఏళ్లుగా తామే సాగు చేస్తున్నామని పోలీసులు కూడా విచారణ పూర్తయ్యే వరకు విజయ్ భూమిలోకి వెళ్లవద్దని చెప్పారని వివరించారు ప్రభుత్వం జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని వారు కోరారు

# వెలవెలబోయిన రెవెన్యూ కార్యాలయాలు

- ఎస్ఐఆర్ గడువు దగ్గరపడటంతో క్షేత్రస్థాయిలో సిబ్బంది
- బిఎల్ఓగా గ్రామాల్లోకి అధికారాలు



**దిలావర్‌పూర్, జూలై 10 (జనంసాక్షి) :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం గడువు దగ్గరపడటంతో రెవిన్యూ వ్యవస్థ మొత్తం గ్రామాల వైపు మళ్లింది. దీంతో మండల రెవిన్యూ కార్యాలయాలు వెలవెలబోతున్నాయి. అధికారులందరూ బీఎల్ఓలుగా గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేసే పనిలో నిమగ్నమయ్యారు. దీంతో కార్యాలయాల్లో ఆయా అధికారుల కుర్చీలు ఖాళీగా కనిపిస్తున్నాయి. చిన్న పనుల కోసం కార్యాలయానికి వచ్చిన ప్రజలు అధికారులు అందుబాటులో లేక వెనుతిరుగుతున్నారు. ఇంకా రెండు వారాలు ఈ తతంగం ఇలాగే కొనసాగనుందని కార్యాలయంలో ఉన్న కొద్దిమంది సిబ్బంది అంటున్నారు

### గ్రామాలు అధికారులతో సందడి

ఎస్ఐఆర్ గడువు సమీపిస్తున్న నేపథ్యంలో తహసీల్దార్ పర్యవేక్షణలో ఆర్ఐ, వీఆర్వోలు సహా రెవిన్యూ సిబ్బంది అందరూ క్షేత్రస్థాయిలో తిరుగుతున్నారు. గ్రామాల్లో ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, అలాగే ఆన్లైన్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. "గడువులోగా 100% ఇంటింటి సర్వే పూర్తి చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం. ప్రజలు కూడా సహకరించాలి" అని పాలనాధికారులు తెలిపారు. దీంతో గత కొన్ని రోజులుగా గ్రామాలు అధికారులతో సందడిగా మారాయి.



### అంగన్వాడీ, ఇతర వ్యవస్థలపై అధిక భారం

ఈసారి అంగన్వాడీ టీచర్లతో సహా ఐకెపి, ఆశలకు కూడా బీఎల్ఓ బాధ్యతలు అప్పగించడంతో వారిపై పని భారం రెట్టింపు అయింది. ఒకవైపు అంగన్వాడీలో చిన్నపిల్లలను చూసుకోవడం, మరోవైపు ఇంటింటికి తిరిగి ఎస్ఐఆర్ ఫారాలు పూర్తి చేయడం వారికి కత్తిమీద సాములా మారింది. "ఆయాలు, అదనపు టీచర్లు లేకుండా చిన్నపిల్లలను ఒంటరిగా అదుపు చేయడం ఇప్పటికే కష్టంగా ఉంది. ఇప్పుడు బీఎల్ఓ డ్యూటీ కూడా తోడైంది. ఉదయం నుంచి రాత్రి వరకు పని చేస్తున్నాం. ఇది మాకు అదనపు భారంగా ఉంది" అని ఓ అంగన్వాడీ టీచర్ ఆవేదన వ్యక్తం చేశారు. "పిల్లలను వదిలేసి ఫీల్డ్‌కు వెళ్లలేం. ఫీల్డ్‌కు వెళ్లకుండా ఉంటే టార్గెట్ పూర్తి కాదు. మధ్యలో ఇరుక్కుపోయాం" అని మరో అంగన్వాడీ బీఎల్ఓ వాపోయారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ కార్యక్రమాన్ని గడువులోగా పూర్తి చేయడానికి అధికారులు, సిబ్బంది శ్రమిస్తున్నారు. అయితే సిబ్బంది కొరత, అదనపు బాధ్యతలతో ఫీల్డ్ స్థాయిలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలుస్తోంది.

### సమాజ స్పందన కరువు - అవగాహన అవసరం

అయితే ఎస్ఐఆర్ పట్ల సమాజం నుంచి ఆశించిన స్థాయిలో స్పందన కనిపించడం లేదు. గత వారం, పది రోజుల అనుభవంలో కేవలం 30 నుంచి 40% మంది మాత్రమే వివరాలు అందిస్తున్నారు. మిగిలిన వారిలో అవగాహన లోపించడంతో సరైన సమాచారం ఇవ్వకపోతే ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. "సరైన వివరాలు నింపడం రాకపోయినా, తెలియకపోయినా, ఓపిక లేకపోయినా ముప్పు తప్పదు. ఓటు లేకపోతే ఓటు వేయలేము. కాబట్టి నిర్లక్ష్యం చేయవద్దు" అని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ప్రజాస్వామ్య విలువలు కాపాడేందుకు యువత, కార్యకర్తలు, గ్రామీణ, పట్టణ ప్రాంతాల ఉన్నత విద్యావంతులు, సామాజిక కార్యకర్తలు, గ్రామ అభివృద్ధి కమిటీలు, పెద్దలు ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. వేగవంతంగా అందరూ ఎస్ఐఆర్‌కు సహకరించి ఓటు హక్కు పొందాలని పిలుపునిచ్చారు.

# 14లోపు 100 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలి

- ఎస్ఐఆర్ ప్రక్రియలో నిర్లక్ష్యం సహించేది లేదు
- తక్కువ పురోగతి ఉన్న పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



**హనుమకొండ ప్రతినిధి, జూలై 11 (జనంసాక్షి) :** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని, ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం సహించేది లేదని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి స్పష్టం చేశారు. శనివారం హనుమకొండ పట్టణంలోని గాంధీనగర్, అశోక్ కాలనీ, గోకుల్ నగర్, లష్కర్ సింగారం, లష్కర్ బజార్ తదితర ప్రాంతాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి ఎస్ఐఆర్ నమోదు ఫారాల స్వీకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో సమీక్షించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులతో (బీఎల్ఓలు) మాట్లాడిన కలెక్టర్, ఫారముల స్వీకరణ, వాటి డిజిటలైజేషన్ పురోగతి, పెండింగ్ వివరాలను స్వయంగా పరిశీలించారు. లష్కర్ బజార్ పరిధిలో డిజిటలైజేషన్ పురోగతి ఆశించిన స్థాయిలో లేకపోవడంతో సంబంధిత బీఎల్ఓను మందలించారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన గడువులను తప్పనిసరిగా పాటించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నెల 14వ తేదీలోపు ఎస్ఐఆర్ నమోదు ఫారాల డిజిటలైజేషన్‌ను వంద శాతం పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి రోజు అందిన దరఖాస్తులను అదే రోజు డిజిటలైజ్ చేసి పెండింగ్ లేకుండా చూడాలని, పనుల్లో నాణ్యతతో పాటు వేగం కూడా ఉండాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రభుత్వ ఉద్యోగులు, ఐకేపీ ఏపీఎంలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వీఓఏలు, రిసోర్స్ పర్సన్ల సేవలను వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. సంబంధిత సిబ్బంది బీఎల్ఓలకు పూర్తిస్థాయిలో సహకరించి ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రత్యేక కార్యాచరణతో ఆదివారం వరకు అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయిలో ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొని పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో హనుమకొండ ఆర్డీఓ వెంకటేష్, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఎన్నికల సూపర్వైజర్లు, బూత్ లెవల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లింగాపూర్ టోల్ గేట్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

- అతివేగంతో వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన లారీ
- సంఘటన స్థలంలోనే మృతిచెందిన చిరు వ్యాపారి
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన వెంకటాపూర్ పోలీసులు



**వెంకటాపూర్ (రామప్ప),జూలై11(జనం సాక్షి):** ములుగు వెంకటాపూర్ మండలం లింగాపూర్ గ్రామ శివారులోని టోల్ గేట్ సమీపంలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి ములుగు మీదుగా ఏటూరునాగారం వైపు అతివేగంతో వెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ రోడ్డు ప్రమాదంలో ములుగు జిల్లాలోని మల్లంపల్లి మండల కేంద్రానికి చెందిన తుర్పాటి పెద్దులు(55)చిరు వ్యాపారి సంఘటనస్థలంలోనే మృతి చెందారు. విషయం తెలుసుకున్న వెంకటాపూర్ ఎస్ఐ చల్ల రాజుతోపాటు పోలీస్ సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని ముందుగా పెద్దులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ములుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడంతోపాటు రోడ్డు ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అదేవిధంగా ఈ రోడ్డు ప్రమాదం తో జాతీయ రహదారిపై ఏర్పడిన ట్రాఫిక్ ను సైతం పోలీసులు దగ్గరుండి క్లియర్ చేశారు. మల్లంపల్లి కి చెందిన పెద్దులు గత కొంతకాలంగా తన ద్విచక్ర వాహనం (ఎక్సల్ బండి )పైన చిరు వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో పెద్దులు శనివారం తన ఎక్సల్ బండి పై మల్లంపల్లి నుండి ములుగు మీదుగా గోవిందరావుపేట మండలం



మచ్చాపూర్ గ్రామానికి వెళ్తున్న క్రమంలో వెనుక నుండి లారీ అతివేగంతో వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిం ది. దీంతో ద్విచక్ర వాహ నంపై ఉన్న పెద్దులు లారీ టైర్ కింద పడడంతో లారీ అతని శరీరం మీదుగా వెళ్ళిం ది. ఈ ప్రమాదంలో పెద్దులు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఎల్లమ్మ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై రాజు మీడియా కు తెలిపారు.

# గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం

- మహిళల ఆర్థిక సాధికారతే ప్రభుత్వ లక్ష్యం
- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి
- గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**చెన్నారావుపేట, జూలై 11 (జనంసాక్షి) :** గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అమీనాబాద్ గ్రామంలో రూ. 20 లక్షలతో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులు, ఎల్లాయగూడెం గ్రామంలో రూ. 10 లక్షలతో గ్రామపంచాయతీ భవన నిర్మాణ మిగులు పనులు, రూ. 10 లక్షలతో మహిళా కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులు, చెన్నారావుపేటలో రూ. 10 లక్షలతో గ్రామపంచాయతీ భవన నిర్మాణ మిగులు పనులు, రూ. 10 లక్షలతో మహిళ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులు, అక్కల్ చెడలో రూ. 10 లక్షలతో గ్రామపంచాయతీ భవన నిర్మాణ మిగులు పనులు, లింగాపురం గ్రామంలో రూ. 10 లక్షలతో గ్రామపంచాయతీ భవన నిర్మాణ మిగులు పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి మహిళలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. అంతేకాక గ్రామాల్లోని మహిళల ఆర్థిక సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రతి గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు ప్రభుత్వం ఎల్లవేళలా కట్టుబడి ఉందన్నారు. గ్రామంలో సుపరిపాలనను అందించేందుకే నూతన గ్రామపంచాయతీ భవనం, మిగులు పనులకు నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. అంతేకాక మహిళలకు కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులకు నిధులను మంజూరు చేసి త్వరితగతిన పనులను పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, తహసిల్దార్ మహమ్మద్ ఆబిద్ అలీ, ఎంపీడీవో వెంకట సాయి శివానంద్, ఏపీఎం తిలక్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సిద్దన రమేష్, చెన్నారావుపేట సొసైటీ చైర్మన్ భూక్య గోపాల్ నాయక్, అమీనాబాద్ సొసైటీ చైర్మన్ మొగిలి వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, గ్రామాల సర్పంచులు కంది శ్వేత కృష్ణ చైతన్య రెడ్డి, ధార రంజిత్, జినుకల కనకమల్లు, భూక్య బుజ్జి సురేష్, పురం అనిత రాంబాబు, ఉప సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు, కాంగ్రెస్ యూత్ మండల అధ్యక్షులు బండి హరీష్, పులిశేరు రాజేందర్, పంచాయతీ కార్యదర్శులు సుప్రజ, వికాస్, సుమలత, అనిత, పలు గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచ్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# ఆకాశంలో అద్భుతం!

**చెన్నారావుపేట, జూలై 11 (జనంసాక్షి):** ఆకాశంలో సూర్యుడు చాలా అద్భుతంగా కనిపించాడు. శనివారం ఉదయం 11 గంటల నుండి 12 గంటల 10 నిమిషాల వరకు సూర్యుడు ఆకాశంలో పలువురిని అబ్బురపరిచాడు. ఎత్తయిన వాతావరణంలో సిరస్ మేఘాలు ఉండడంవల్ల వాటిలోని మంచు స్ఫటికాల ద్వారా సూర్యకాంతి వంగి ఈ వలయం ఏర్పడుతుందని సైన్స్ శాస్త్రవేత్తలు తెలిపారు. దీనిని సూర్య హాలో అంటారని దాదాపు పూర్తి వలయంలా కనిపించడం అరుదైన, అందమైన దృశ్యంగానే చెప్పవచ్చని పేర్కొన్నారు. ఆకాశంలో సూర్యుడు వింతగా కనిపించడంతో ఈ దృశ్యాలను కొందరు తమ సెల్ ఫోన్లలో బంధించుకున్నారు.

# నులిపురుగుల నిర్మూలన కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి



**జయ శంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ఈ నెల 13న జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పకడ్బందీగా నిర్వహిస్తుందని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ మధుసూదన్ తెలిపారు. జిల్లాలో 1 నుండి 19 సంవత్సరాల వయసు గల 70,773 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు ఇస్తామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్వాడి కేంద్రాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. 13న మాత్రలు వేసుకున్న వారికి 20న మాపప్ నిర్వహిస్తామన్నారు. ఈ మాత్ర వల్ల పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం తగ్గి ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

# జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కలిసిన జిల్లా కలెక్టర్



**మంచిర్యాల ప్రతినిధి జూలై 11, (జనంసాక్షి) :** ఆసిఫాబాద్ పర్యటనలో భాగంగా శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సింగరేణి అతిథి గృహానికి విచ్చేసిన రాష్ట్ర ఆబ్కారీ మధ్య నిషేధ, పర్యాటక, పురావస్తు శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ.భాస్కర్, ఆబ్కారీ మద్యనిషేధ శాఖ పర్యవేక్షకులు చాణక్య, సింగరేణి సంస్థ శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ శ్రీనివాస్ లతో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

## టీఐసీసీ ప్రభుత్వ స్థలాలను కాపాడాలి



**కాప్రా, జూలై 11 (జనం సాక్షి) :** చర్లపల్లి పారిశ్రామికవాడలో ప్రభుత్వ అనుమతులతో నిర్మించుకున్న పరిశ్రమలను కూల్చివేస్తామంటూ కొంతమంది ఆక్రమణదారులు బెదిరిస్తున్న టి ఎస్ ఐ సి అధికారులు చర్యలు తీసుకోవడం లేదని బాధితుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చర్లపల్లి పారిశ్రామిక వాడ ఫేస్ 2లో 1989లో ప్రభుత్వం పారిశ్రామిక అవసరాలకు స్థలాలు కేటాయించింది. చాగంటి శశిధర్, శ్రీనివాస్ లకు 1989లో అప్పటి ఏపీఐఐసీ సంస్థ ప్లాట్ నెంబర్ 125/ఏ, ప్లాట్ నెంబర్ 125/డీ కేటాయించింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పారిశ్రామిక వాడలోని పరిశ్రమలకు రక్షణ కోసం పరిశ్రమలకు ఆనుకుని ఆరు మీటర్ల గ్రీన్ బెల్ట్ ఏరియా కేటాయిస్తుంది. ఇటీవల కొంతమంది వ్యక్తులు వచ్చి తమ పరిశ్రమల పక్కనే ఉన్న గ్రీన్ బెల్ట్ ఏరియాలోని ప్రహరీ గోడను కూల్చివేశారు. ఈ విషయమై చర్లపల్లి ఐల అధికారులకు తెలియజేసిన ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇదే అదునుగా భావించిన ఆక్రమణదారులు ప్రైవేట్ సర్వే చేసుకొని తమకు ప్రభుత్వం కేటాయించిన పరిశ్రమలలో తమ ప్లాట్లు ఉన్నాయని కూల్చివేసి స్వాధీనం చేసుకుంటామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఈ విషయమై ఐలా అధికారులకు ఫిర్యాదు చేసిన ఆక్రమణదారులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలియజేస్తున్నాం. ప్రభుత్వం కేటాయించిన స్థలాలకే రక్షణ లేకుండా పోతే ఐల ఎవరికి రక్షణ కల్పిస్తుందని ప్రశ్నిస్తున్నాం. ఇప్పటికైనా టీఎస్ఐఐసి ఉన్నతాధికారులు స్పందించి సర్వే చేయించి తమ స్థలాలను రక్షించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నాం . ఐల అధికారులు స్పందించకుంటే పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ని , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలసి తమ సమస్యను వివరిస్తామని తెలియజేస్తున్నాం.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది వికృతానందం

- 32 ఏళ్ల క్రితం కన్ను పోతే.. ఇప్పుడు రాజకీయం చేస్తారా?
- ముగ్గురు మంత్రులు.. ఆరు కళ్లతో సాధించిందేమిటి?
- నా అభివృద్ధిలో పదో వంతైనా ఖమ్మంలో చేశారా?
- హామీలు నెరవేర్చని కాంగ్రెస్‌కు ఏ 'అంగవైకల్యం' అడ్డొచ్చింది?
- జడ్పీటీసీ స్థాయి దాటని సీఎం మాటలు.. ఇకనైనా మారండి
- బీజేపీతో టచ్‌లో ఉన్నది రేవంత్, కాంగ్రెస్ మంత్రులే..
- జగన్నాథపురం సభలో సీఎం వ్యాఖ్యలపై నిప్పులు చెరిగిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

**ఖమ్మం బ్యూరో, జూలై 11 (జనంసాక్షి) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శారీరక లోపాలను ఎత్తిచూపుతూ వికృతానందం పొందుతున్నారని, 'బాడీ షేమింగ్' చేయడం ఆయనకు అలవాటుగా మారిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పువ్వాడ అజయ్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నిన్న జగన్నాధపురం సభలో తనను ఉద్దేశించి సీఎం చేసిన వ్యాఖ్యలపై పువ్వాడ నిప్పులు చెరిగారు. శనివారం ఆయన ఖమ్మంలో మీడియాతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి వైఖరిని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు.

### ఒక్క కన్నున్నా ఒరగబెట్టా.. మీ ఆరు కళ్లతో ఏం చేశారు..?

"32 ఏళ్ల క్రితం జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో నా కన్ను పోయింది. ఈ విషయాన్ని నేనెప్పుడూ దాచలేదు, రాష్ట్ర, జిల్లా ప్రజలందరికీ ముందే చెప్పా. గతంలోనూ నాపై ఇలాంటి చౌకబారు విమర్శలే చేశారు. నాకు ఒక్క కన్ను ఉన్నా.. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపించా. మరి ఇప్పుడు జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నారు.. ఆరు కళ్లతో చూస్తున్నారు కదా! నా హయాంలో జరిగిన అభివృద్ధిలో కనీసం పదో వంతైనా ఈ రెండున్నర ఏళ్లలో చేశారా?" అని పువ్వాడ సూటిగా ప్రశ్నించారు. ఇలాంటి వ్యక్తిగత విమర్శలతో తన ఆత్మవిశ్వాసాన్ని ఎవరూ దెబ్బతీయలేరని స్పష్టం చేశారు.

### మీకు ఏ 'వైకల్యం' అడ్డొచ్చింది..?

పూర్తి ఆరోగ్యంగా ఉన్నామని చెప్పుకునే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన వాగ్దానాలను ఎందుకు పూర్తి చేయలేదని పువ్వాడ నిలదీశారు. ఆరు గ్యారంటీలు, రైతు భరోసా హామీలు నెరవేర్చకపోవడానికి ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏ అంగవైకల్యం అడ్డొచ్చింది? అని ఘాటుగా ప్రశ్నించారు. ముఖ్యమంత్రి పదవిలో ఉండి ఇంతలా స్థాయి దిగజార్చుకుని మాట్లాడటం రేవంత్ విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు. ఇప్పటికీ జడ్పీటీసీ స్థాయి నాయకుడిలాగే మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి.. ఇకనైనా మారి, ముఖ్యమంత్రిలా మాట్లాడటం నేర్చుకోవాలని హితవు పలికారు.



### బీజేపీతో టచ్‌లో ఉన్నది మీరే.. ఆ ఈడీ రైడ్స్ ఏమయ్యాయి..?

బీఆర్ఎస్ నేతలు బీజేపీతో టచ్‌లో ఉన్నారని అబద్ధాలు చెప్తున్నారని.. నిజానికి సీఎం రేవంత్, కాంగ్రెస్ మంత్రులే ఢిల్లీ పెద్దలతో టచ్‌లో ఉన్నారని ఆరోపించారు. ఖమ్మం జిల్లాకు చెందిన ఒక మంత్రిపై ఈడీ రైడ్స్ జరిగిన తర్వాత ఆ సమాచారం ఎందుకు బయటకు రావడం లేదని, లోపాయికారీ ఒప్పందాలు ఏమైనా జరిగాయా అని ప్రశ్నించారు. "నాపై ఉన్న కక్షను ఈ విధంగా పర్సనల్ గా తీర్చుకుంటున్నారు. దానికి నాకేం అభ్యంతరం లేదు. కానీ కక్షసాధింపులు పక్కన పెట్టి ప్రజలకు మంచి చేయడం నేర్చుకోండి. తెలంగాణలో గత 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనే ప్రజలకు స్వర్ణయుగం" అని పువ్వాడ అజయ్ కుమార్ స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, టిఆర్ఎస్ నాయకులు జి కృష్ణ, గొల్లపూడి రాంప్రసాద్, పగడాల నాగరాజు, బచ్చు విజయకుమార్, బత్తుల మురళి, నాగండ్ల కోటి, జ్యోతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థాన నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవం



**యాదగిరిగుట్ట, జూలై 11 (జనంసాక్షి) :** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థాన నూతన ట్రస్ట్ బోర్డు (పాలక మండలి) ప్రమాణ స్వీకార మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా, భక్తి శ్రద్ధల నడుమ నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ మరియు అటవీ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరుకాగా, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల అయిలయ్య , భువనగిరి పార్లమెంట్ సభ్యులు శ్రీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొని నూతన పాలక మండలి సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకుల వేదమంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ ఆధ్యాత్మిక వాతావరణంలో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థాన నూతన ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా నియమితులైన మన్నె సత్యనారాయణరెడ్డి అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు. వారితో పాటు నామినేటెడ్ సభ్యులుగా నియమితులైన కొణిదెల సురేఖ, జి. వినోద్ వెంకటస్వామి, చిలప్పుగారి విజయరాజం, విజయేందర్ తుల్ల, పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, గుండు మల్లయ్య, స్వాతి కంతమనేని, శ్రీ ఎం. రాఘవేంద్ర రావు, డి. లక్ష్మీనారాయణ నాయక్‌లు కూడా ప్రమాణ స్వీకారం చేశారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, యాదాద్రి క్షేత్రాన్ని దేశంలోనే అత్యుత్తమ ఆధ్యాత్మిక కేంద్రంగా మరింత అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. భక్తులకు మరింత నాణ్యమైన సేవలు అందించే దిశగా ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రం తెలంగాణ రాష్ట్ర ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలుస్తోందని అన్నారు. దేశ విదేశాల నుంచి వచ్చే లక్షలాది మంది భక్తులకు మరింత మెరుగైన వసతులు, పారదర్శకమైన పరిపాలన, సత్వర సేవలు అందించేందుకు నూతన పాలక మండలి సమిష్టిగా, అంకితభావంతో పనిచేయాలని సూచించారు. భక్తుల సౌకర్యాల విస్తరణ, పరిశుభ్రత, తాగునీరు, వసతి, క్యూ లైన్ల నిర్వహణ, అన్నదాన సేవలు, పార్కింగ్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి (ఈఓ), ఆలయ ప్రధాన అర్చకులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, నూతన ట్రస్ట్ బోర్డు సభ్యులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# తెలంగాణలో 500 మాంటిస్సోరి పాఠశాలలే లక్ష్యం

- డైరెక్టర్ షిజు ఆగస్టిన్
- 'ఏఐపీఎస్‌ఏ - జీవీజేబీ మిషన్ తెలంగాణ - 500' ప్రారంభం



**ముషీరాబాద్, జూలై 11 (జనం సాక్షి) :** తెలంగాణలోని 500 మండలాల్లో 500 మాంటిస్సోరి పాఠశాలలను స్థాపించి, 500 మంది మహిళా పారిశ్రామికవేత్తలను విద్యా రంగంలో తీర్చిదిద్దడమే 'ఏఐపీఎస్‌ఏ - జీవీజేబీ మిషన్ తెలంగాణ - 500' ప్రధాన లక్ష్యమని ఏఐపీఎస్‌ఏ డైరెక్టర్ షిజు ఆగస్టిన్ తెలిపారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన 'ఏఐపీఎస్‌ఏ - జీవీజేబీ మిషన్ తెలంగాణ - 500' ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నాణ్యమైన మాంటిస్సోరి విద్యను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు మహిళలకు విద్యా రంగంలో స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఏఐవైహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు వి. ప్రభాకర్ మాట్లాడుతూ, మాంటిస్సోరి విద్యా విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి చిన్నారులకు ఉత్తమ విద్యా వాతావరణాన్ని కల్పించేందుకు ఈ మిషన్ దోహదపడుతుందని తెలిపారు. జీవీజేబీ వ్యవస్థాపకులు డా. సోమశేఖర్ మాట్లాడుతూ, ఆధునిక బోధనా విధానాలు, ఉపాధ్యాయ శిక్షణ, సాంకేతికత ఆధారిత విద్య ద్వారా చిన్నారులకు నాణ్యమైన విద్య అందించేందుకు జీవీజేబీ కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమం తెలంగాణ విద్యా రంగంలో సానుకూల మార్పులకు నాంది పలుకుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జీవీజేబీ డైరెక్టర్ శ్రీనివాస్ రాంభట్ల మాట్లాడుతూ, మిషన్ తెలంగాణ - 500 అమలుకు సమగ్ర కార్యాచరణ సిద్ధం చేశామని, రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా మాంటిస్సోరి పాఠశాలలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. పాఠశాలల యాజమాన్యాలు, మహిళా పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. యాదగిరి, విద్యా రంగ ప్రముఖులు మోహన్ సింగ్, దేవరాయ సాయిలు, రవి, భాగ్య, కృష్ణ, పాఠశాలల ప్రతినిధులు, ఏఐవైహెచ్‌పీఎస్, టీఆర్ఎస్ఎంఏ నాయకులు, విద్యావేత్తలు తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీల హక్కుల పరిరక్షణకు నిరంతరం పోరాడుతాం



**ముషీరాబాద్, జూలై 11 (జనం సాక్షి) :** మైనార్టీల రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణతో పాటు రాజకీయ, విద్య, ఉపాధి రంగాల్లో వారికి తగిన ప్రాతినిధ్యం కల్పించే వరకు పోరాటం కొనసాగిస్తామని అమీరేమిల్లత్-ఏ-ఇస్లామియా తెలంగాణ-- ఆంధ్రప్రదేశ్ నాయకులు మౌలానా హుస్సేముద్దీన్ హుస్సమి, తెలంగాణ రాష్ట్ర మైనార్టీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ వాహబ్ తెలిపారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం తెలంగాణ మైనార్టీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, ప్రొఫెసర్ ఎం.ఏ. మాలిక్ హాజరయ్యారు. వక్తలు మాట్లాడుతూ, మైనార్టీల హక్కుల పరిరక్షణలో రాష్ట్ర ప్రభుత్వం ఆశించిన స్థాయిలో పనిచేయలేదని విమర్శించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం మత రాజకీయాలను ప్రోత్సహించడం ద్వారా సామాజిక సామరస్యానికి భంగం కలిగించే పరిస్థితులు సృష్టిస్తోందని ఆరోపించారు. మైనార్టీలకు రాజకీయ, విద్య, ఉపాధి రంగాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని, మైనార్టీ విద్యాసంస్థల అభివృద్ధి, పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. వక్ఫ్ భూములకు పూర్తి రక్షణ కల్పించడంతో పాటు రాజ్యాంగ హక్కులపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం, సమానత్వం, సమగ్ర అభివృద్ధి లక్ష్యాల సాధనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మైనార్టీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మొహమ్మద్ వసీం, లీగల్ సెల్ ఇన్‌చార్జ్ షేక్ ఫహీముల్లా, కార్యదర్శి మహమ్మద్ తాజుద్దీన్తో పాటు పలువురు మైనార్టీ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆరుగురు హత్యలకు ప్రభుత్వ వైఫల్యమే కారణం

- మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి
- బాధితులను పరామర్శించేందుకు వెళ్తుండగా బీఆర్ఎస్ నేతల అరెస్టు

**చేవెళ్ల, జూన్ 11 (జనం సాక్షి) :** షాబాద్ మండలంలో జరిగిన ఆరుగురు హత్యల ఘటనపై మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి రాష్ట్ర ప్రభుత్వ తీరును తీవ్రంగా తప్పుబట్టారు. బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్తున్న ఆమెతో పాటు మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని మల్కాపూర్ స్టేజీ వద్ద చేవెళ్ల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, పట్నం నరేందర్ రెడ్డిని శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు, సబితాఇంద్రా రెడ్డి, పద్మా దేవేందర్ రెడ్డిని చేవెళ్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. పోక్సో కేసు నమోదైనప్పటికీ నిందితుడిపై పోలీసులు సకాలంలో చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ దారుణం చోటుచేసుకుందని ఆరోపించారు. నిందితుడు ఆరుగురిని



హత్య చేయడం అత్యంత బాధాకరమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హోంశాఖ శాంతిభద్రతల పరిరక్షణలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. నిందితుడిని అరెస్టు చేయడంలోనూ తీవ్ర జాప్యం జరిగిందన్నారు. మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిర్బంధ పాలన కొనసాగుతోందని, ఈ ఘటన హోంశాఖ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. అనంతరం చేవెళ్ల ప్రభుత్వాసుపత్రికి చేరుకున్న నేతలు మృతదేహాల వద్దకు వెళ్లి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. వారి వెంట స్థానిక బిఆర్ఎస్ నేతలు ఉన్నారు.

# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే భూ రీ-సర్వే లక్ష్యం

- సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి
- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**యాదాద్రి, కరస్పాండెంట్ జూలై 11 (జనం సాక్షి) :** భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే రాష్ట్రవ్యాప్తంగా భూ రీ-సర్వేను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ధరణిని రద్దు చేసి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని, రైతుల భూములకు పూర్తి భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ భారతి అమల్లోకి వచ్చి 15 నెలలు పూర్తయినా ప్రజల అంచనాలకు పూర్తిస్థాయిలో చేరలేకపోయామని తెలిపారు. ధరణి కాలంలో పెండింగ్‌లో ఉన్న



9.6 లక్షల సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం కోసం భూ భారతిలో అవకాశం కల్పించి, హైకోర్టు సమస్యలను పరిష్కరించినప్పటికీ, అధిక సంఖ్యలో దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయనే అభిప్రాయం ప్రజల్లో ఉందన్నారు. తిరస్కరణలకు గల కారణాలను గుర్తించి, నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే భూ రీ-సర్వే తప్పనిసరి అని మేధావులు సూచించడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఇందుకోసం శిక్షణ పొందిన 5,700 మంది లైసెన్స్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని, రెగ్యులర్ సర్వేయర్లు, లైసెన్స్ సర్వేయర్లు సమన్వయంతో పని చేయాలని సూచించారు. రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ మాట్లాడుతూ తొలి విడతలో ఎంపిక చేసిన 70 గ్రామాల్లో భూ రీ-సర్వేను నవంబర్‌లోపు పూర్తి చేయాలని, రెండో విడతలో మరో 70 గ్రామాల్లో మార్చి 2027లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. రీ-సర్వే పూర్తయితే సాదాబైనామా దరఖాస్తుల తిరస్కరణలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు. తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ విపి గౌతమ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో సుమారు 41 వేల గుడిసెలను గుర్తించామని, అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసి ఆగస్టు నాటికి రెండు లక్షల ఇళ్ల లక్ష్యాన్ని చేరుకోవాలని, పెండింగ్‌లో ఉన్న రెండు పడక గదుల ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు అప్పగించాలని సూచించారు. సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల విద్యార్థుల ఏకరూప దుస్తులన్నీ స్వయం సహాయక సంఘాల మహిళా టైలర్ల ద్వారానే కుట్టిస్తున్నామని తెలిపారు. టెండర్ ఆలస్యంతో వస్త్రం ఆలస్యంగా వచ్చినప్పటికీ జూలై 15లోపు రెసిడెన్షియల్ బాలికలకు, జూలై 30లోపు బాలురకు యూనిఫాంలు అందించాలని సూచించారు. ఆగస్టు 15 నాటికి రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి కనీసం ఒక జత యూనిఫాం అందేలా కలెక్టర్లు, డీఆర్‌డీఏ, గురుకులాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

## రూ.16.92 కోట్లతో కోదాడ ఆర్టీసీ బస్టాండ్‌కు శంకుస్థాపన

- ఆధునిక హంగులతో బస్టాండ్, డిపో నిర్మాణం
- కోదాడను ఆదర్శ రవాణా కేంద్రంగా తీర్చిదిద్దుతామన్న మంత్రులు



**కోదాడ, జూలై 11 (జనం సాక్షి) :** కోదాడ పట్టణంలో రూ.16.92 కోట్లతో నిర్మించనున్న అత్యాధునిక టీఎస్ఆర్టీసీ బస్టాండ్, డిపో నిర్మాణ పనులకు శనివారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి శంకుస్థాపన చేశారు. ఐదున్నర ఎకరాల్లో ప్రయాణికుల సౌకర్యాలు, వాణిజ్య సముదాయాలతో బస్టాండ్‌ను నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కోదాడ బస్టాండ్‌ను రాష్ట్రంలోనే ఆదర్శ బస్టాండ్‌గా అభివృద్ధి చేస్తామని చెప్పారు. మహాలక్ష్మి పథకం ద్వారా రోజుకు 30 లక్షల మంది మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారని, ఇప్పటివరకు 326 కోట్లకు పైగా ప్రయాణాలు నమోదై రూ.11,406 కోట్ల మేర మహిళలకు ప్రయాణ ఖర్చు ఆదా అయ్యిందన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కోదాడ నియోజకవర్గంలో రవాణా, విద్య, వైద్యం, సాగునీటి రంగాలకు భారీగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి మాట్లాడుతూ ఆధునిక సౌకర్యాలతో బస్టాండ్ నిర్మాణం పూర్తయితే కోదాడకు ప్రత్యేక గుర్తింపు వస్తుందని అన్నారు. అనంతరం కోదాడ - నరసింహులగూడెం -మోతే మార్గంలో కొత్త ఆర్టీసీ బస్సు సర్వీసును మంత్రులు ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.




# మ్యూచువల్ ఫండ్లలోకి పెట్టుబడుల జోరు



**భౌగోళిక ఉద్రిక్తతలు కాస్త నెమ్మదించడం, దేశీయ స్థూల ఆర్థిక రంగానికి సంబంధించి సానుకూల పరిస్థితులు ఉంటాయనే అంచనాలు.. రిటెయిల్ పెట్టుబడిదారుల బలమైన భాగస్వామ్యంతో జూన్‌లో మ్యూచువల్ ఫండ్లలోకి పెట్టుబడుల వెల్లువ కొనసాగింది. ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్ పథకాల్లోకి పెట్టుబడులు మేతో పోలిస్తే, జూన్‌లో 26.5% పెరిగి, రూ.28,973 కోట్లకు చేరాయి. క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్)లో వచ్చిన నెలవారీ పెట్టుబడులు కొత్త చరిత్ర సృష్టించినట్లు భారతీయ మ్యూచువల్ ఫండ్ల సంఘం (యాంఫీ) తెలిపింది.**

**హైదరాబాద్:** భౌగోళిక ఉద్రిక్తతలు కాస్త నెమ్మదించడం, దేశీయ స్థూల ఆర్థిక రంగానికి సంబంధించి సానుకూల పరిస్థితులు ఉంటాయనే అంచనాలు.. రిటెయిల్ పెట్టుబడిదారుల బలమైన భాగస్వామ్యంతో జూన్‌లో మ్యూచువల్ ఫండ్లలోకి పెట్టుబడుల వెల్లువ కొనసాగింది. ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్ పథకాల్లోకి పెట్టుబడులు మేతో పోలిస్తే, జూన్‌లో 26.5% పెరిగి, రూ.28,973 కోట్లకు చేరాయి. క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్)లో వచ్చిన నెలవారీ పెట్టుబడులు కొత్త చరిత్ర సృష్టించినట్లు భారతీయ మ్యూచువల్ ఫండ్ల సంఘం (యాంఫీ) శుక్రవారం తెలిపింది. మొత్తం మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ నికర నిర్వహణ ఆస్తుల విలువ (ఏయూఎం) రూ.82.22 లక్షల కోట్లకు పెరిగింది. రిటెయిల్ మదుపరుల్లో క్రమశిక్షణతో కూడిన దీర్ఘకాలిక పెట్టుబడులపై అవగాహన పెరుగుతుందనడానికి సిప్ గణాంకాలే నిదర్శనమని యాంఫీ వెల్లడించింది. జూన్‌లో సిప్ పెట్టుబడులు అత్యధికంగా రూ.31,781.20 కోట్లుగా నమోదయ్యాయి. మేలో ఇవి రూ.30,954 కోట్లుగా ఉన్నాయి. ప్రస్తుతం సిప్ ఆస్తుల విలువ రూ.17,70,482.25 కోట్లకు చేరింది. మొత్తం మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ ఆస్తుల్లో ఇవి 21.5%. జూన్ చివరికి క్రియాశీల సిప్ ఖాతాల సంఖ్య 9.78 కోట్లకు పెరిగింది. 2021 మార్చి నుంచి ఈక్విటీ పథకాల్లోకి పెట్టుబడులు కొనసాగడం వరుసగా ఇది 64వ నెల. 2026 ప్రథమార్థం (జనవరి-జూన్)లో ఈక్విటీ పథకాల్లోకి మొత్తం రూ.1.81 లక్షల కోట్ల నికర పెట్టుబడులు వచ్చాయి. 2025 ఇదే కాలంలో వచ్చిన రూ.1.61 లక్షల కోట్ల కంటే ఇవి 12% అధికం. మేలో నమోదైన రూ.22,908 కోట్ల పెట్టుబడులు, ఏడాది కాలంలో తక్కువ. మేలో గోల్డ్ ఈటీఎఫ్ నుంచి రూ.725 కోట్ల పెట్టుబడులు వెనక్కి వెళ్లాయి. జూన్‌లో వీటిల్లోకి రూ.3,443.23 కోట్ల నికర పెట్టుబడులు వచ్చాయి. జనవరి-జూన్ మధ్య బంగారం ఈటీఎఫ్‌లలోకి రూ.37,319 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. క్రితం ఏడాది ప్రథమార్థంలో రూ.8,021 కోట్లే ఇందులోకి వచ్చాయి. డెట్ ఫండ్ల నుంచి జూన్‌లో రూ.1.09 లక్షల కోట్లు వెనక్కి వెళ్లాయి. త్రైమాసికం ముగింపు నేపథ్యంలో సంస్థాగత మదుపరులు, తమ పన్ను చెల్లింపులు, ఇతర నగదు అవసరాల కోసం అల్ట్రా షార్ట్ టర్మ్ పథకాల నుంచి నిధులు ఉపసంహరించుకోవడమే దీనికి కారణం. లిక్విడ్ ఫండ్ల నుంచి మేలో రూ.29,681 కోట్లు వెనక్కి వెళ్లగా, జూన్‌లో ఉపసంహరణలు రూ.42,293.29 కోట్లకు పెరిగాయి. మొత్తం మీద డెట్ పరిశ్రమ నుంచి నికరంగా జూన్‌లో రూ.52,948.78 కోట్ల ఉపసంహరణలు జరిగాయి. కొత్తగా ఏడు పథకాలు మార్కెట్లో అందుబాటులోకి వచ్చాయి. ఈ ఎన్ఎఫ్ఓల ద్వారా మొత్తం రూ.460 కోట్లు మార్కెట్లోకి చేరాయి. స్పెషలైజ్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ల (ఎస్ఐఎఫ్)కు ఆదరణ పెరుగుతోంది. జూన్ చివరికి ఈ ఫండ్లలోని ఆస్తుల విలువ రూ.17,857.77 కోట్లకు చేరింది. నియంత్రణ సంస్థలు, ప్రభుత్వం నుంచి దేశ ప్రజలకు సమాచారం ఇచ్చేందుకు కేటాయించిన '1600' నంబర్ సిరీస్ నుంచి వచ్చే కాల్స్‌ను థర్డ్ పార్టీ యాప్‌లు (ట్రూకాలర్ వంటి కాల్‌మేనేజ్‌మెంట్ యాప్‌లు) స్తంభింప (బ్లాక్) చేయకూడదని టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ స్పష్టం చేసింది. వాణిజ్య సంస్థల ప్రచారం (టెలీ మార్కెటింగ్) కోసం కేటాయించిన '140' నంబర్ సిరీస్ కాల్స్‌ను కూడా ఏ యాప్ ఫిల్టర్ చేయడానికి/ట్యాగ్ చేయడానికి కూడా వీల్లేదని, కేవలం డీఎన్‌డీ రిజిస్ట్రీ ద్వారా మాత్రమే వినియోగదారులు వీటిని బ్లాక్ చేసుకోగలరని ట్రాయ్ వివరించింది. ఆర్‌బీఐ, సెబీ, ఐఆర్‌డీఏఐ, పీఎఫ్ఆర్‌డీఏఐ వంటి నియంత్రణ సంస్థల పరిధిలోని బ్యాంకింగ్, బీమా, ఆర్థిక సేవల సంస్థలు తమ వినియోగదార్లకు చేసే సేవ/లావాదేవీల కాల్స్, పౌరులకు ప్రభుత్వం సంస్థలు ఇచ్చే సమాచారం కోసం '1600' సిరీస్‌తో ప్రారంభమయ్యే నంబర్లను ట్రాయ్ కేటాయించింది. టెలికాం కమర్షియల్ కమ్యూనికేషన్స్ కస్టమర్ ప్రిఫరెన్స్ రెగ్యులేషన్ (టీసీసీసీపీఆర్) కింద 1600 సిరీస్ నుంచి వచ్చే కాల్స్‌ను బ్లాక్ చేయడం చట్టరీత్యా కుదరదు. పౌరులకు అందించే ముఖ్యమైన అధికారిక కాల్స్‌పై నమ్మకాన్ని పెంచడమే దీని ప్రధాన లక్ష్యం. వ్యక్తిగత/ప్రైవేటు నంబర్ల నుంచి వాణిజ్య సంస్థలు ప్రచార కాల్స్ చేయకూడదని ట్రాయ్ నిర్దేశించింది. ప్రకటనలు కోసం కాల్స్ చేసే రిజిస్టర్డ్ టెలీమార్కెటర్లు వినియోగించేందుకు 140 సిరీస్ నంబర్లను వినియోగించాలి. ప్రచార కాల్స్‌ను అనుమతించడం లేదా బ్లాక్ చేయడం ఖాతాదారుల ఇష్టంపై ఆధారపడి ఉంటుంది. ట్రాయ్ డీఎన్‌డీ యాప్ లేదా ఇతర మార్గాల ద్వారా 'డు నాట్ డిస్టర్బ్' రిజిస్ట్రీల్లో తమ ప్రాధాన్యతలను మొబైల్ వినియోగదారులు నమోదు చేసుకోవచ్చు. వినియోగదారులు ఏ రంగానికి చెందిన ప్రచార కాల్స్ వద్దు అనుకుంటారో, 140 సిరీస్ నంబర్ల నుంచి సంబంధిత కాల్స్ వారికి రావు. వినియోగదారులు డీఎన్‌డీ రిజిస్ట్రీలో కొన్ని రంగాల ప్రమోషనల్ కాల్స్ అనుమతించే అవకాశం ఉంది. థర్డ్ పార్టీ యాప్స్ 140 సిరీస్ నంబర్లను స్పామ్ పేరిట ట్యాగ్ చేయడం వల్ల, ఆ కాల్స్ వచ్చినప్పుడు 'స్పామ్'గా చూపితే, కస్టమర్లు తప్పుదోవ పట్టే ప్రమాదం ఉంది. అందుకే వీటిని కూడా ట్యాగ్ చేయడానికి అనుమతి లేదు. వినియోగదారులు ఇకపై 1600, 140 సిరీస్ నంబర్ల నుంచి వచ్చే కాల్స్‌ను స్పామ్ లేదా ఫ్రాడ్‌గా ట్యాగ్ చేయడానికి వీలుండదని ట్రాయ్ స్పష్టత ఇచ్చింది.

# 15 రోజుల్లో రూ.7 లక్షల కోట్లు

### పెరిగిన బ్యాంకు డిపాజిట్లు: ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక



**న్యూఢిల్లీ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికంలో బ్యాంకింగ్ వ్యవస్థ బలంగా పుంజుకొంది. కేవలం పదిహేను రోజుల్లోనే బ్యాంకు డిపాజిట్లు రికార్డు స్థాయికి చేరాయి. ఈ ఏడాది జూన్ 15-30 మధ్య దాదాపు రూ.7 లక్షల కోట్ల మేర బ్యాంకు డిపాజిట్లు పెరిగినట్లు ఎస్‌బీఐ అధ్యయన నివేదిక వెల్లడించింది. పక్షం రోజుల్లోనే బ్యాంక్ డిపాజిట్లు ఈ స్థాయిలో వృద్ధి కావడం గత 29 ఏళ్లలో ఇది మూడోసారి కావడం విశేషం. పక్షం రోజుల్లో మొత్తం బ్యాంకు డిపాజిట్లు రూ.6.97 లక్షల కోట్లకు పెరిగాయని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక పేర్కొంది. ఇందులో సుమారు రూ.3.5 లక్షల కోట్ల నుంచి రూ.4 లక్షల కోట్ల డిపాజిట్లు ఖాతాదారుల నుంచే రావడం గమనార్హం. మిగిలిన డిపాజిట్లలో ఫారిన్ కరెన్సీ నాన్ రెసిడెంట్ బ్యాంక్ ఎక్స్‌టర్నల్ కమర్షియల్ బారోయింగ్స్ నుంచి పెద్ద ఎత్తున నిధులు రావడం కలిసొచ్చిందని పేర్కొంది. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి, రూపాయి విలువ బలోపేతానికి ప్రభుత్వ తీసుకున్న చర్యల వల్ల దాదాపు 7 బిలియన్ డాలర్లు ఎఫ్ఐఐ పెట్టుబడులు దేశంలోకి తరలివచ్చినట్లు సదరు నివేదిక పేర్కొంది. రిజర్వ్ బ్యాంక్ విదేశీ మారకం నిల్వలు 4.4 బిలియన్ డాలర్లకు పెరిగాయి. భారీ డిపాజిట్ల కారణంగా నగదు నిల్వలు పెరగడంతో, సర్టిఫికేట్ ఆఫ్ డిపాజిట్ల ద్వారా బ్యాంకులు తీసుకునే రుణాలు తగ్గుతాయని నివేదిక పేర్కొంది. ఇది దేశ ఆర్థిక వృద్ధికి మంచి సంకేతంగా పలువురు ఆర్థికరంగ నిపుణులు భావిస్తున్నారు.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
| --- | --- |
| ₹ 5.40 | ₹ 5.42 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
**హైదరాబాద్**

| | |
| --- | --- |
| ₹ 1,53,140 (22 క్యారెట్లు) | ₹ 1,67,064 (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
**హైదరాబాద్**
₹ 2,60,000

# ఈపీఎఫ్ ఖాతాల్లోకి వడ్డీ జమ.. చెక్ చేసుకోండిలా..!


గత ఆర్థిక సంవత్సరానికి గానూ చందాదారులకు ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ వార్షిక వడ్డీని జమ చేస్తోంది. ఇప్పటికే దాదాపు 80శాతం ఖాతాల్లో వడ్డీ జమ అయినట్లు ఈపీఎఫ్ఓ వెల్లడించింది. జులై 15 నాటికి చందాదారులందరికీ ఈ మొత్తాన్ని అందజేయనున్నట్లు తెలిపింది. మరి మీ ఖాతాల్లో ఎంత మొత్తం వడ్డీ జమ అయిందో తెలుసుకోవాలనుకుంటున్నారా..? అందుకోసం మీ పీఎఫ్ బ్యాలెన్స్‌ను చూసుకోండి..! పీఎఫ్ బ్యాలెన్స్ ను తెలుసుకోవాలంటే మీ యునివర్సల్ అకౌంట్ నంబరు (యూఏఎన్) యాక్టివేట్‌లో ఉండాలి. ఈపీఎఫ్ఓ మెంబర్ పోర్టల్‌తో పాటు ఉమాంగ్ యాప్‌లోనూ చూసుకోవచ్చు. లేదంటే ఎస్ఎంఎస్ సర్వీస్ నుంచి కూడా తెలుసుకోవచ్చు.
ఈపీఎఫ్ పాస్‌బుక్ సేవలు పునఃప్రారంభం

1. ఈపీఎఫ్ఓ మెంబర్ పోర్టల్
ఈ పోర్టల్‌ను తెరిచి యూఏఎన్, పాస్‌వర్డ్‌తో పాటు క్యాప్చా ఎంటర్ చేసి లాగిన్ అవ్వాలి. ఆధార్‌తో లింక్ అయిన మీ మొబైల్ నంబరుకు ఓటీపీ వస్తుంది. దాన్ని ఎంటర్ చేయాలి. వెబ్‌పేజీలో ఎతివలి ఖజీబబఎనీనీని ఆప్షన్ మీద క్లిక్ చేస్తే ఈపీఎఫ్ బ్యాలెన్స్ కన్పిస్తుంది. అందులోని లావాదేవీల వరుసల్లో జమ అయిన వడ్డీ మొత్తాన్ని చూసుకోవచ్చు.
2. ఉమాంగ్ యాప్: ఉమాంగ్ యాప్‌లో లాగిన్ అయి మీ యూఏఎన్ నంబరును అనుసంధానించాలి. ఒకసారి లింక్ అయిన తర్వాత ఎప్పుడు కావాలంటే అప్పుడు పీఎఫ్ బ్యాలెన్స్, క్లెయిమ్‌ల వంటి సేవలను ఈ యాప్‌లో పొందొచ్చు. యాప్‌లో పీఎఫ్ బ్యాలెన్స్ ఆప్షన్ మీద క్లిక్ చేయగానే.. మూడు నెలల లావాదేవీలు కన్పిస్తాయి. అందులో వడ్డీ మొత్తం ఎంత ఉందో చూసుకోవచ్చు. పూర్తి లావాదేవీల కోసం పీడీఎఫ్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
ఎస్ఎంఎస్ రూపంలో: మీ పీఎఫ్ ఖాతాకు అనుసంధానమై ఉన్న మొబైల్ నంబరు నుంచి 7738299899 నంబరుకు మెసేజ్ చేయాలి. 'ఇఖఈఖాఉఖా ఐంఔ' అని టైప్ చేసి దాని పక్కనే మీ యూఏఎన్ నంబరును జోడించి మెసేజ్ పంపిస్తే.. చివరిగా మీ ఖాతాలో జమ అయిన మొత్తం, ప్రస్తుత బ్యాలెన్స్ వంటి వివరాలను ఈపీఎఫ్ఓ అందిస్తుంది.

# 'ఫార్చ్యూన్ ఇండియా' ఎంపీడబ్ల్యూ జాబితాలో నీతా అంబానీకి అగ్రస్థానం

**ముంబై:** దేశంలో ఆర్థిక, వాణిజ్య రంగాలను సమర్థంగా నడిపిస్తున్న 100 మంది అగ్రశ్రేణి మహిళా లీడర్లను గుర్తించేలా 'ఫార్చ్యూన్ ఇండియా' అత్యంత శక్తిమంతమైన మహిళలు 2026 జాబితాను విడుదల చేసింది. ఈ సందర్భంగా ముంబయిలో ఓ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ ప్రతిష్ఠాత్మక జాబితాలో రిలయన్స్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ నీతా అంబానీ నంబర్ వన్ స్థానంలో నిలిచి తన ప్రత్యేకతను చాటుకోవడంతో పాటు ప్రసంగంతో ఆకట్టుకున్నారు. కరుణ, సమానత్వంతో కూడిన నాయకత్వం వృద్ధి చెందాలని, ఆడపిల్లల అభివృద్ధిపై పెట్టుబడులు పెట్టడమే దేశ భవిష్యత్తుకు పునాది అన్నారు. వ్యాపార, సాంకేతిక, బ్యాంకింగ్, పబ్లిక్ పాలసీ, ఆరోగ్య సంరక్షణ తదితర రంగాలకు చెందిన పలువురు ప్రముఖ మహిళా లీడర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఫార్చ్యూన్ ఇండియా మోస్ట్ పవర్‌ఫుల్ విమెన్ అధికారిక జాబితా విడుదల చేసిన అనంతరం భవిష్యత్తు నాయకత్వం, ఏఐ, ఆర్థిక సాధికారత, సమ్మిళిత వృద్ధి, దేశ నిర్మాణం తదితర కీలక అంశాలపై మహిళా లీడర్లు చర్చించారు.

# 'ఇ20'తో కాలుష్య ఉద్గారాలు పరిమితం





**న్యూఢిల్లీ:** 20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ 'ఇ 20' వల్ల కొన్ని వాహనాల మైలేజీ 3-5% తగ్గే అవకాశం ఉందని కేంద్ర చమురు మంత్రిత్వ శాఖ అంగీకరించింది. మైలేజీ కొంచెం తగ్గడం కంటే, ఇ 20 ఇంధనం వల్ల లభించే ఇతర ప్రయోజనాలే అధికమని పేర్కొంటూ శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. ఇథనాల్ మిశ్రమ పెట్రోల్‌పై వస్తున్న విమర్శలు, అనుమానాలను నివృతి చేస్తూ కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ ప్రశ్నలు-జవాబుల పత్రాన్ని విడుదల చేసింది. ఇ 20 సాధారణ పెట్రోల్ అని, ఇ10 కంటే స్వచ్ఛమైన, నాణ్యమైన, సమర్థ ఇంధనమని పేర్కొంది. చాలా ఏళ్ల శాస్త్రీయ పరీక్షలు, వాహన తయారీదార్లతో సంప్రదింపుల తర్వాతే దీన్ని దేశవ్యాప్తంగా వినియోగంలోకి తెచ్చినట్లు వెల్లడించింది. ఇ20 ఇంధనంలో ఎక్కువ ఆక్టేన్ రేటింగ్ ఉండటంతో వాహనపికప్ బాగుంటుంది. యాక్సిలరేషన్ సరళతరంగా మారుతుంది. ఇంజిన్ లోపల సుపీరియర్ యాంటీ-నాకింగ్ వల్ల వేగవంతమైన కంబషన్‌కు తోడ్పడుతుంది. దీంతో పర్యావరణానికి హాని చేసే కర్బన ఉద్గారాల విడుదల భారీగా తగ్గుతుంది. పాత వాహనాల్లో ఇ20 ఇంధనం వాడటం వల్ల ఇంజిన్ పాడవుతుందనే ఆందోళనలను మంత్రిత్వ శాఖ తోసిపుచ్చింది. ఇ20 పెట్రోల్‌ను అందుబాటులోకి తీసుకురావడానికి ముందే.. ఇది వాడితే ఇంజిన్ మన్నిక, ఇంధన వ్యవస్థలు, తుప్పు నిరోధకత, ఉద్గారాలపై విస్తృత పరీక్షలు నిర్వహించామంది. మారుతీ, హీరో వంటి సంస్థల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్ ప్రకారం.. ఇ 20 వల్ల ఇంజిన్ తుప్పు పట్టడం, అసాధారణ అరుగుదల, విడిభాగాలు దెబ్బతినడం వంటి సమస్యలు ఎక్కడా నమోదుకాలేదు. బంకుల్లో స్వచ్ఛమైన పెట్రోల్, ఇ 10, ఇ 20 పెట్రోల్‌ను విడివిడిగా విక్రయించాలనే డిమాండ్‌ను ప్రభుత్వం తిరస్కరించింది. రిటెయిల్ విక్రయశాలల్లో ఇటువంటి సమాంతర సరఫరా వ్యవస్థలను నిర్వహించడం వల్ల లాజిస్టిక్స్ ఖర్చులు పెరిగి, పంపిణీ వ్యవస్థ మరింత క్లిష్టంగా మారుతుందని వివరించింది. పెట్రోల్ కంటే ఇ20 చౌకగా ఉండాల్సిన అవసరం లేదని మంత్రిత్వ శాఖ పేర్కొంది. రైతులను ఆదుకోవడానికి ఇథనాల్ ధరలను ప్రభుత్వం లాభదాయకమైన రేట్లలో నిర్ణయిస్తున్నట్లు గుర్తు చేసింది. అంతర్జాతీయంగా ముడిచమురు ధర తక్కువగా ఉన్నప్పుడు, పెట్రోల్ కంటే ఇథనాల్ తయారీకే ఎక్కువ వ్యయం అవుతుందని పేర్కొంది. ఇప్పటివరకు ఇథనాల్ బ్లెండింగ్ వల్ల రూ.1.97 లక్షల కోట్ల విలువైన విదేశీ మారకపు ద్రవ్యం (ఫారెక్స్) ఆదా అయింది. దాదాపు 316 లక్షల టన్నుల ముడిచమురు దిగుమతులు తగ్గాయి. 952 లక్షల టన్నుల కర్బన ఉద్గారాలను నిరోధించగలిగారు. ఇథనాల్ కొనుగోళ్ల ద్వారా దేశంలోని రైతులకు రూ.1.66 లక్షల కోట్లకు పైగా నగదు బదిలీ అయింది. మంగళూరులో 17.5 లక్షల టన్నుల సామర్థ్యం కలిగిన వ్యూహాత్మక పెట్రోలియం నిల్వల కేంద్రాన్ని అభివృద్ధి చేసేందుకు తమ బోర్డు సూత్రప్రాయ అనుమతులు ఇచ్చిందని ప్రభుత్వరంగ ఓఎన్‌జీసీ తెలిపింది. ఇందువల్ల దేశ చమురు నిల్వల సామర్థ్యం గణనీయంగా పెరగనుంది. ఎంత కాలంలో ఈ నిర్మాణం పూర్తి చేస్తారు, ఇందుకు ఎంత పెట్టుబడి పెట్టనుందీ సంస్థ వెల్లడించలేదు. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో, ముడిచమురు దిగుమతులకు అవరోధం ఏర్పడిన నేపథ్యంలో, దేశీయంగా వ్యూహాత్మక నిల్వ సామర్థ్యాన్ని పెంచుకోవాలని చమురు సంస్థలను ప్రభుత్వం కోరిన సంగతి విదితమే. ఇప్పుడు 53.3 లక్షల టన్నులే: ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, కర్ణాటకలోని మంగళూరు, పదూర్‌లలో కలిపి 53.3 లక్షల టన్నుల చమురును వ్యూహాత్మకంగా నిల్వ చేసే భూగర్భ కేంద్రాలున్నాయి. వీటిని ఇండియన్ స్ట్రాటజిక్ పెట్రోలియం రిజర్వ్స్ లిమిటెడ్ నిర్వహిస్తోంది. రెండో దశలో పదూర్ కేంద్ర నిల్వ సామర్థ్యాన్ని విస్తరించడంతో పాటు ఒడిశాలోని చండిఖోల్‌లో నూతన కేంద్రాన్ని నిర్మించాలనీ ప్రతిపాదించారు. మంగళూరులో ఓఎన్‌జీసీ కేంద్రం నిర్మాణమైతే.. ప్రస్తుత దేశ వ్యూహాత్మక నిల్వలు మూడోవంతు పెరగనున్నాయి.

# ఈపీఎఫ్ పాస్‌బుక్ సేవలు పునఃప్రారంభం

### మొదలైన క్లెయిమ్‌ల పరిష్కార ప్రక్రియ

హైదరాబాద్: దాదాపు 15 రోజులుగా నిలిచిపోయిన ఈపీఎఫ్ సేవలు తిరిగి ప్రారంభమయ్యాయి. వారం క్రితం మెంబర్ పోర్టల్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చిన సంస్థ.. తాజాగా పాస్‌బుక్ సేవలు పునఃప్రారంభించింది. సాఫ్ట్‌వేర్ ఉన్నతీకరణలో భాగంగా వారం రోజులుగా నూతన ఈపీఎఫ్-2026 పథకం నిబంధనల ప్రకారం ఆన్‌లైన్లో వచ్చిన క్లెయిమ్‌ల పరిష్కార ప్రక్రియను ఇటీవల ప్రారంభించింది. వారం రోజుల్లో పూర్తిస్థాయిలో సేవలు అందుబాటులోకి వస్తాయని ఈపీఎఫ్‌వో వర్గాలు వెల్లడిస్తున్నాయి. కొత్త ఈపీఎఫ్, ఈపీఎస్, ఈడీఎల్ఐ-2026 పథకాల అమలు, సాఫ్ట్‌వేర్ ఉన్నతీకరణ, మెరుగైన ఆటోమేషన్, తదితర ప్రయోజనాల కోసం జూన్ 26 నుంచి ఈపీఎఫ్‌వో సర్వర్లను, కొత్త క్లెయిమ్‌ల స్వీకరణ, పరిష్కారాన్ని నిలిపివేసింది. లఇక 2025-26 ఏడాదికి దాదాపు 80% ఖాతాల్లో వడ్డీ జమ చేసినట్టు వెల్లడించింది. కొత్త నిబంధనల ప్రకారం పాక్షిక ఉపసంహరణల క్లెయిమ్‌లను మెంబర్ పోర్టల్‌లో నాలుగుకు తగ్గిస్తూ పోర్టల్‌లో అప్‌గ్రేడ్ చేసింది. చందాదారుడి ఖాతాలోని వడ్డీతో కలిపి మొత్తం నిల్వలో 25శాతం కనీస నిల్వగా ఖరారు చేసింది. మిగతా 75శాతం ఉపసంహరణకు అర్హమైన నగదుగా చూపిస్తోంది. ఈ లెక్కన చందాదారుడు ఎంత వరకు నగదు ఉపసంహరించుకోవచ్చో ముందుగానే తెలుస్తోంది.




# వ్యాపార రహస్యాల చోరీ..

### ఓపెన్‌ఏఐపై యాపిల్ దావా

**న్యూఢిల్లీ:** గోప్యత విషయంలో టెక్‌సంస్థలు యాపిల్ - ఓపెన్ ఏఐ మధ్య నెలకొన్న పోటీ తాజాగా తీవ్రరూపం దాల్చింది. ఈ నేపథ్యంలో ఓపెన్ ఏఐపై యాపిల్ దావా వేసింది ఈ ఏఐ సంస్థ తమ వాణిజ్య రహస్యాలను దొంగిలించిందని తన దావాలో ఆరోపించింది. ఓపెన్ ఏఐతో సహా యాపిల్‌లో పనిచేసిన ఇద్దరు మాజీ ఉద్యోగులపైనా చట్టపరమైన చర్యలకు దిగింది. డిజైన్, తయారీ ప్రక్రియ, సరఫరా గొలుసు వ్యూహాలతో సహా యాపిల్‌కు సంబంధించిన గోప్యమైన సమాచారాన్ని తెలుసుకునేందుకు వీరంతా కలిసి పనిచేశారని ఆరోపించింది. తమ సంస్థ నుంచి వెళ్లిపోయేటప్పుడు ఆ ఉద్యోగులు కంపెనీ ల్యాప్‌టాప్‌లను తిరిగి ఇవ్వలేదని యాపిల్ పేర్కొంది. ఆ తర్వాత అందులోని ఓ బగ్ సాయంతో తమ ఇంటర్నల్ నెట్‌వర్క్‌లోకి చొరబడి సున్నితమైన రహస్యాలను తెలుసుకున్నారని తెలిపింది. ప్రస్తుతం ఓపెన్‌ఏఐకి హార్డ్‌వేర్ చీఫ్‌గా ఉన్న టాన్.. గతంలో యాపిల్‌లో పనిచేశారు. ఆయన యాపిల్ నుంచి వెళ్లపోవడానికి ముందు సప్లయిర్ల సమాచారం, సంస్థకు సంబంధించిన అంతర్గత వివరాలను తన ఈమెయిల్‌కు పంపించుకున్నారు. ఏఐ సంస్థకు ప్రయోజనం చేకూర్చేందుకు రహస్య సమాచారాన్ని పద్ధతి ప్రకారం ఉపయోగించుకున్నారని దావాలో యాపిల్ ఆరోపించింది. ఓపెన్‌ఏఐలో జరిగే ఇంటర్వ్యూల్లో 'షో అండ్ టెల్' సెషన్‌ల కోసం అప్పటి యాపిల్ ఉద్యోగులను విడిభాగాలను తీసుకురావాలని టాన్ ప్రోత్సహించినట్లు పేర్కొంది. ప్రస్తుతం 400 మంది మాజీ ఉద్యోగులు ఓపెన్‌ఏఐలో పనిచేస్తున్నారని వెల్లడించింది. తమ వద్ద హార్డ్‌వేర్ రంగంలోని వాణిజ్య రహస్యాలకు సంబంధించిన విభాగాల్లో పనిచేసిన ఉద్యోగులు.. ఇప్పుడు ఆ వివరాలను ఓపెన్‌ఏఐలో ఉపయోగించుకోవడానికి హక్కు ఉండదని పేర్కొంది. ప్రస్తుతం ఓపెన్‌ఏఐ హార్డ్‌వేర్ రంగంలోకి వేగంగా అడుగులు వేస్తోంది. దానిలో భాగంగా హార్డ్‌వేర్ స్టార్టప్ ఐఓ ప్రొడక్ట్స్‌ను సొంతం చేసుకునేందుకు 6.5 బిలియన్ డాలర్లను వెచ్చించింది. దానిని యాపిల్ డిజైనర్ జానీ ఐవ్ స్థాపించారు. అయితే అతడి పేరును యాపిల్ దావాలో చేర్చలేదు. ఏఐ ఉత్పత్తుల అభివృద్ధి విషయంలో నెలకొన్న పోటీతో రెండు సంస్థల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. తమ గోప్య సమాచారం ఏఐకి చేరుతుందనే ఆందోళన నేపథ్యంలో చర్చిద్దామని అడిగామని, కానీ ఓపెన్ ఏఐ నుంచి ఎలాంటి సమాధానం రాలేదని తన ఫిర్యాదులో పేర్కొంది.

# వెనెజువెలా విలయం.. 4 వేలు దాటిన మరణాలు

**కరాకస్:** వెనెజువెలాలో జూన్ 24న సెకన్ల వ్యవధిలో సంభవించిన రెండు భారీ భూకంపాలు పెను విషాదాన్ని మిగిల్చాయి. ఈ విలయంలో ఇప్పటివరకు 4 వేలకు పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయినట్లు అక్కడి ప్రభుత్వం వెల్లడించింది. 16,740 మంది గాయపడగా.. భవన శిథిలాల కింద వేలాది మంది చిక్కుకున్నారు. ఇంకా చాలా మంది జాడ తెలియరాలేదు. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబు తున్నారు. మరోవైపు శుక్రవారం కారకాస్‌లో 3.0 తీవ్రతతో భూకంపం సంభవించడంతో స్థానికంగా ఉన్న భవనాలను ఖాళీ చేయించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మరో వైపు దేశంలో కొనసాగుతోన్న భూకంప సహాయక చర్యల కోసం.. యూకే ఆంక్షల కింద విదేశాలలో స్తంభింపజేసిన సుమారు 30 టన్నుల వెనెజువెలా బంగారాన్ని విడుదల చేయాలని కింగ్ చార్లెస్ ఎఎఎని కోరినట్లు అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ వెల్లడించారు.



# ఇకపై ఫార్వర్డ్, స్క్రీన్‌షాట్ టికెట్స్ చెల్లవు

### రైల్వే శాఖ




న్యూఢిల్లీ(జనంసాక్షి): రైలు ప్రయాణం సమయంలో టికెట్లను టీటీఈలు తనిఖీ చేయడంపై భారతీయ రైల్వే శాఖ కీలక ప్రకటన చేసింది. వాట్సప్ ఫార్వర్డ్ లేదా స్క్రీన్‌షాట్ తీసిన టికెట్లు ఇకపై చెల్లబోవని స్పష్టం చేసింది. ఒరిజినల్ టికెట్లనే అనుమతిస్తామని పేర్కొంది. టికెట్ దుర్వినియోగాన్ని నిరోధించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. రైల్వే టికెట్ వెరిఫికేషన్ సమయంలో వాట్సప్‌లో షేర్ చేసిన లేదా స్క్రీన్‌షాట్ టికెట్‌లను టీటీఈలు అనుమతించబోరని రైల్వే శాఖ పేర్కొంది. వీటిని ఎడిట్ లేదా ట్యాంపరింగ్ చేసే ప్రమాదం ఉందని, ఒకే టికెట్‌ను పలువురికి ఫార్వర్డ్ చేసే అవకాశం ఉందని తెలిపింది. వీటిని అరికట్టడంలో భాగంగా ఇకపై రైల్వే బుకింగ్ ప్లాట్‌ఫాం ద్వారా కొనుగోలు చేసే ఇ-టికెట్‌లు లేదా చెల్లుబాటు అయ్యే ప్రింటెడ్ టికెట్లనే అనుమతిస్తామని స్పష్టం చేసింది. ప్రయాణికులు కేవలం వాట్సప్ స్క్రీన్‌షాట్స్ లేదా ఫార్వర్డ్ మెసేజ్‌లను చూపిస్తే.. వారిని టికెట్ లేని ప్రయాణికులుగా పరిగణిస్తారు. ఆ సమయంలో ఆ ప్రయాణికులు కొత్త టికెట్ కొనాల్సి ఉంటుంది. జరిమానాతో పాటు రైల్వే నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఐఆర్‌సీటీసీ కనెక్ట్ యాప్‌లో బుక్ చేసిన ఇ-టికెట్ ఉండాలి. టికెట్ బుకింగ్ సమయంలో మొబైల్‌కు వచ్చే కన్ఫర్మేషన్ మెసేజ్. ఒరిజినల్ ఇ-టికెట్ ప్రింటెడ్ కాపీ (అవసరమైతే) తీసుకోవాలి. టికెట్‌తో పాటు ఆధార్ కార్డ్, పాన్ కార్డ్ వంటి ప్రభుత్వ గుర్తింపు కార్డులు వెంట తీసుకెళ్లాలి.

# భారత్ లక్ష్యం యుద్ధం కాదు

### కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టీకరణ



విశాఖపట్నం(జనంసాక్షి): భారత్ లక్ష్యం యుద్ధం కాదని, ప్రపంచ శాంతి, స్థిరత్వమే తమ విధానమని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఆపరేషన్ సింధూర్ యుద్ధం కాదని, భారత భద్రతకు ముప్పు వాటిల్లితే దేశం ఎలా స్పందిస్తుందో ప్రపంచానికి చూపించిన చర్య అని వ్యాఖ్యానించారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సముద్ర భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని, భారత్ వ్యతిరేక శక్తులకు అవసరమైన సమయంలో తగిన సమాధానం ఇస్తామని రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించారు. భారత నౌకాదళంలో అత్యాధునిక యుద్ధ నౌక ఐఎన్ఎస్ మహేంద్రగిరి చేరడం దేశ భద్రతకు మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో ఐఎన్ఎస్ మహేంద్రగిరిని జాతికి అంకితం చేసిన ఆయన.. ఇది భారత నౌకాదళ శక్తిని మరింత పెంచే కీలక అడుగని పేర్కొన్నారు. భారత సముద్ర భద్రతలో విశాఖపట్నం కీలక కేంద్రంగా ఎదిగిందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు దూరదృష్టితో రాష్ట్రంలో ఏరోస్పేస్, రక్షణ రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని ప్రశంసించారు. దేశ రక్షణ సామర్థ్యాన్ని మరింత పెంచే దిశగా అత్యాధునిక సాంకేతికతపై దృష్టి సారించామని తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
12 జూలై 2026

# ఎర్రకుంటపై కబ్జా నీడ!

## 150 ఎకరాల సాగుకు ముప్పు





- నీటి నిల్వ ప్రాంతాన్ని మట్టితో నింపేస్తూ ఆక్రమణల యత్నం
- అధికారుల మౌనం.. రైతులకు ఆందోళన

**కరీంనగర్ బ్యూరో, జూలై 11 (జనంసాక్షి):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం చెంజర్ల గ్రామ పరిధిలోని ఎర్రకుంట కబ్జాకోరుల చెరలో చిక్కుకుందని స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సర్వే నంబర్ 670లో ఉన్న ఈ కుంటలో ప్రొక్లెయిన్లతో యథేచ్ఛగా మట్టి పోసి చదును చేస్తుండగా, ఫిర్యాదులు చేసినప్పటికీ రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు స్పందించడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలను పరిరక్షించాల్సిన అధికారుల నిర్లక్ష్యం భూబకాసురులకు వరంగా మారిందని విమర్శిస్తున్నారు.
ప్రస్తుతం కుంటలో నీటి నిల్వ ఉండే ప్రాంతాన్ని కూడా మట్టితో కప్పేస్తూ, భవిష్యత్తులో అక్కడ కుంటే లేదన్నట్లుగా మార్చేందుకు పక్కా ప్రణాళికతో పనులు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఎర్రకుంట భూగర్భ జలాలకు ప్రధాన ఆధారంగా ఉండటంతో, దీనిపై కబ్జా కొనసాగితే పరిసర ప్రాంతాల్లోని బావులు, బోర్లు ఎండిపోయే ప్రమాదం ఉందని, దాదాపు 100 నుంచి 150 ఎకరాల వ్యవసాయ భూమి తీవ్రంగా ప్రభావితమవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమని రైతులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి చెంజర్ల ఎర్రకుంట వద్ద జరుగుతున్న అక్రమ మట్టి నింపే పనులను వెంటనే నిలిపివేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అలాగే కుంటకు సంబంధించి సర్వే నిర్వహించి హద్దులను స్పష్టంగా నిర్ణయించాలని, ఆక్రమణలకు పాల్పడుతున్న వారితో పాటు వారికి సహకరిస్తున్న అధికారుల పాత్రపై కూడా సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# 30 నెలలుగా వైద్యులు లేకుండా ఆసుపత్రి



- మాతాశిశు ఆసుపత్రిలో డాక్టర్లను నియమించకపోతే నిరాహార దీక్షలు
- డాక్టర్లు లేక గర్భిణీలు, నవజాత శిశువులు, మహిళలు ఇబ్బందులు
- మంథని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ

**మంథని, జూలై 11 (జనంసాక్షి):** గ్రామీణ ప్రాంతాల్లోని పేదింటి ఆడబిడ్డల కాన్పు కష్టాలను మంథని ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని, అధికారంలోకి వచ్చిన 30 నెలలుగా మంథని మాతాశిశు ఆసుపత్రిలో డాక్టర్లను నియమించకపోవడం దీనికి నిదర్శనమని మంథని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ విమర్శించారు. మంథని పట్టణంలోని మాతాశిశు ఆసుపత్రిలో డాక్టర్లను నియమించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆసుపత్రి ఎదుట బీఆర్ఎస్ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఒకరోజు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాలకు మేలు జరిగేలా సంక్షేమ పథకాలు అమలు చేశారని, అందులో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రులకు ధీటుగా మాతాశిశు ఆసుపత్రులను తీసుకువచ్చారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ నాయకత్వంలో మంథనిలో మాతాశిశు ఆసుపత్రి నిర్మించి పేదింటి ఆడబిడ్డల కాన్పు కష్టాలు తొలగించడం జరిగిందన్నారు.
అయితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మంథని ఎమ్మెల్యే గెలిచిన వెంటనే మాతాశిశు ఆసుపత్రిలోని డాక్టర్లను ఇతర ప్రాంతాలకు పంపించారని, ప్రస్తుతం కేవలం సిబ్బంది మాత్రమే ఉన్నారని తెలిపారు. పలుమార్లు ఆసుపత్రికి వచ్చి వైద్యులను నియమించి ఆడబిడ్డల కష్టాలు తీర్చాలని కోరినా మంథని ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని విమర్శించారు. 30 నెలలుగా మాతాశిశు ఆసుపత్రిలో వైద్యులను నియమించకపోవడంతో ఎంతో విలువైన పరికరాలు, యంత్రాలు బూజుపట్టి పోతున్నాయని, కనీసం పరికరాలను వినియోగించుకోవాలని ఆలోచన చేయకపోవడం బాధాకరమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ హయాంలో ఆసుపత్రి నిర్మించినా అందులో వైద్యులు నియమించకుండా నిర్వీర్యం చేయాలని చూస్తున్నారని ఆమె విమర్శించారు. ఇప్పటికైనా మంథని ఎమ్మెల్యే స్పందించి మాతాశిశులో అవసరమైన వైద్యులను నియమించాలని, లేనిపక్షంలో మహిళలతో కలిసి నిరాహార దీక్షలు చేపడతామని శైలజ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకురాలు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కేదారి గీత, మాజీ ఎంపీపీ ఎగోలపు కమల, మాజీ జడ్పీటీసీలు తగరం సుమలత, మాధారవేణి శారదా, మాజీ ఉపసర్పంచ్ పుప్పాల భాగ్య లక్ష్మి, సర్పంచులు కనవేన స్వప్న, కొండ ప్రేమలత, తొంబరపు సుజాత, పోలుదాసరి వనిత, తాటికొండ లక్ష్మీ, నాయకురాలు సౌజన్య రెడ్డి పాల్గొన్నారు.

## భవానీ పేట్‌లో ఆయిల్ ఫామ్ సాగుపై మెగా ప్లాంటేషన్ డ్రైవ్

**బోధన్, జూలై 11 (జనంసాక్షి) :** బోధన్ మండలం భవానిపేట్ గ్రామంలో శనివారం ప్రీయూనిక్ ఇండియా ప్రైవేటు కంపెనీ ఆధ్వర్యంలో ఉద్యాన, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్ ను నిర్వహించారు. ఆయిల్ పామ్ పంటపై ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీలు పొందుతూ, దిగుబడి సాధిస్తున్న రైతులు సంతోషం వ్యక్తం చేస్తు మరి కొన్ని ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగును పెంచుతున్నారు. భవానిపేట్ గ్రామంలో పల్లెంపాటి కిరణ్ బాబు అనే రైతు 4 సంవత్సరాల క్రితం 7.50 ఎకరాలలో ఆయిల్ పామ్ చెట్లు నాటారు. సులువైన తేలికైన చేతతొ అధిక దిగుబడులు సాధిస్తూ నేడు మరొక 5.50 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు విస్తరణకు ఈ రోజు మొక్కలు నాటారు. అదే గ్రామానికి చెందిన గొడవర్తి శ్రీనివాస్ అనే రైతు మరొక 5.50 ఎకరాల్లో, బలుసు శ్రీనివాస్ అనే రైతు 2.50 ఎకరాల్లో మరియు శ్రీనివాస్ క్యాంప్ గ్రామంకు చెందిన నరసరాజు గారు ఇంకొ 7 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగును పెంచుటకు ఆసక్తి చూపుతున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడిఏ బొబ్బ శ్రీనివాస్ రావు, ఉద్యాన శాఖ హెచ్ఈఓ అసర్, ఏఈవో ముజామిల్, నిజామాబాద్ జిల్లా ప్రీయూనిక్ కంపెనీ మేనేజర్ సాయి కిరణ్, క్లస్టర్ అధికారులు సంపత్, అమూల్, శ్రీనివాస్, ఆంజనేయులు, సుబ్బారావు, ఎల్లారావు, రంగారావు, కిరణ్‌బాబు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై
# అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి

**జీవో నెం. 9ను వెంటనే రద్దు చేయాలి : ఎంపీ ఆర్. కృష్ణయ్య**



**ముషీరాబాద్, జూలై 11 (జనం సాక్షి):** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే స్పందించాలని, ఈ అంశంపై అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకోవాలని ఎంపీ ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ర్యాగ అరుణ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంపీ ఆర్. కృష్ణయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం విద్యార్థులు, బీసీ సంఘాలు పెద్ద ఎత్తున ధర్నాలు, దీక్షలు చేపడుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమని ఆయన విమర్శించారు. ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే విద్యార్థుల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పాత విధానాన్నే కొనసాగించాలని, ఇందుకు విరుద్ధంగా తీసుకొచ్చిన జీవో నెం. 9ను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ ప్రతిపక్షాల అభిప్రాయాలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ సమస్యపై వెంటనే అఖిలపక్ష సమావేశం నిర్వహించి, అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, విద్యార్థి సంఘాలతో సంప్రదింపులు జరిపి నిర్ణయం తీసుకోవాలని కోరారు.
రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీల కోసం ఒక్క కొత్త సంక్షేమ పథకాన్ని కూడా ప్రవేశపెట్టలేదని, ఇప్పటికే ఉన్న పథకాలను సైతం రద్దు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత 50 ఏళ్ల ఉద్యమాల ఫలితంగా వివిధ ప్రభుత్వాలు బీసీ, ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేశాయని, వాటిని నిర్వీర్యం చేసే ప్రయత్నాలను సహించబోమన్నారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని ప్రకటించిన ఆయన, ఈ నెల 14న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద సత్యాగ్రహ దీక్షలు, 16న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమం చేపడతామని వెల్లడించారు. ఈ సమావేశంలో యువజన సంఘం అధ్యక్షుడు జీలపల్లి అంజితో పాటు బీసీ సంఘాల నాయకులు, విద్యార్థి ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నడుచుకుంటూ వెళ్లినవాడు
# శవమై వచ్చాడు!

## సాన్వి ఆస్పత్రిలో దారుణం





- ఫోన్లలో మాట్లాడుతూ కాలయాపన చేసిన డాక్టర్లు
- పరిస్థితి విషమించాకే 'సిటీకి వెళ్లండి' అంటూ చేతులెత్తేసిన వైనం
- వైద్యం పేరిట ప్రాణాలు తీస్తున్నా? ఆస్పత్రి నిర్లక్ష్యంపై ఇబ్రహీంపట్నంలో ప్రజా ఆగ్రహం
- డీఎంహెచ్‌ఓ వెంటనే స్పందించి ఆస్పత్రిని సీజ్ చేయాలని బంధువుల డిమాండ్

**ఇబ్రహీంపట్నం, జూలై 11 (జనంసాక్షి):**
ప్రైవేట్ ఆసుపత్రుల్లో కాసుల కక్కుర్తి, వైద్యుల బాధ్యతారాహిత్యం కారణంగా నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్న ఘటనలు రోజురోజుకూ మితిమీరి పోతున్నాయి. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలోని మంచాల్ రోడ్డులో ఉన్న సాన్వి ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా తాజాగా మరో నిరుపేద కుటుంబంలో తీరని విషాదం నిండింది. నమ్ముకుని వచ్చిన రోగికి సరైన చికిత్స అందించకపోగా, పరిస్థితి విషమించేలా చేసి చేతులెత్తేసిన సాన్వి ఆసుపత్రి తీరుపై స్థానికులు, బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఘటనకు సంబంధించిన వివరాల ప్రకారం రంగారెడ్డి జిల్లా యాచారం మండలం చింతుల్ల గ్రామానికి చెందిన సామర్తి నరసింహా (50) శనివారం ఉదయం కొద్దిపాటి అస్వస్థతకు గురయ్యారు. కేవలం సాధారణ చెకప్ కోసం ఆయన ఇబ్రహీంపట్నంలోని సాన్వి ప్రైవేట్ ఆసుపత్రికి స్వయంగా నడుచుకుంటూ వచ్చారు.
అయితే ఆసుపత్రిలోని డ్యూటీ డాక్టర్లు, సిబ్బంది ప్రాథమిక సూత్రాలను విస్మరించి, సరైన రోగ నిర్ధారణ చేయకుండానే పలు రకాల పరీక్షల పేరిట కాలయాపన చేశారు. అనంతరం రోగికి ఏవేవో హై-డోస్ ఇంజెక్షన్లు ఇచ్చారు. ఆ ఇంజెక్షన్లు ఇచ్చిన కొద్దిసేపటికే నరసింహా పరిస్థితి ఆకస్మికంగా విషమించింది. ఊపిరి తీసుకోవడానికి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నా ఆసుపత్రి సిబ్బంది సకాలంలో స్పందించలేదు. చేయి దాటాక చేతులెత్తేసిన యాజమాన్యం: రోగి స్పృహ కోల్పోయే స్థితికి చేరుకోగానే సాన్వి ఆసుపత్రి యాజమాన్యం తమపైకి ప్రమాదం రాకుండా చూసుకునేందుకు నాటకమాడింది. "ఇక్కడ పరిస్థితి సీరియస్‌గా ఉంది, వెంటనే సిటీకి (హైదరాబాద్) తీసుకెళ్లండి" అంటూ నరసింహా కుటుంబ సభ్యులను భయాందోళనలకు గురిచేసి బలవంతంగా బయటకు పంపించేశారు. కంగుతిన్న కుటుంబ సభ్యులు ప్రాణాలు దక్కించుకోవాలనే ఆరాటంతో కేవలం కిలోమీటర్ దూరంలో ఉన్న మరో ప్రైవేట్ ఆసుపత్రికి నరసింహాను తరలించారు. అయితే అక్కడ పరీక్షించిన వైద్యులు నరసింహా అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. సాన్వి ఆసుపత్రిలో ఇచ్చిన తప్పుడు మందుల వల్లే నరసింహా ప్రాణాలు కోల్పోయాడని బంధువులు ఆరోపిస్తున్నారు. ఆసుపత్రి ఎదుట బంధువుల ఆందోళన: అర్హత లేని వ్యక్తులతో వైద్యం!
నరసింహా మరణవార్త తెలియడంతో చింతుల్ల గ్రామస్థులు, మృతుడి బంధువులు భారీ సంఖ్యలో సాన్వి ఆసుపత్రికి చేరుకుని ఎదుట ఆందోళనకు దిగారు. ఆసుపత్రి యాజమాన్యానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. "వైద్యులు కనీస బాధ్యత లేకుండా ఫోన్లలో మాట్లాడుతూ నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఆసుపత్రిలో క్వాలిఫైడ్ డాక్టర్లు లేరు, అంతా అర్హత లేని ఆర్ఎంపీలు, అనుభవం లేని నర్సింగ్ సిబ్బందితోనే వైద్యం చేయిస్తున్నారు" అని మృతుడి బంధువులు తీవ్ర ఆరోపణలు చేశారు. పరిస్థితి పూర్తిగా చేయి దాటి, రోగి చనిపోయే స్థితికి వచ్చాకే తమను వేరే ఆసుపత్రికి పంపారని, ఇది ముమ్మాటికీ సాన్వి ఆసుపత్రి చేసిన హత్యేనని మృతుని కుటుంబం డిమాండ్ చేసింది. రంగంలోకి పోలీసులు.. డీఎంహెచ్‌ఓ చర్యలకు వినతి: ఈ ఘటనతో ఇబ్రహీంపట్నం పరిధిలో తీవ్ర ఉద్రిక్తత నెలకొనడంతో సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. బాధితుల నుంచి ఫిర్యాదు స్వీకరించి, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇబ్రహీంపట్నం పరిధిలోని పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఎలాంటి అనుమతులు, కనీస సదుపాయాలు లేకుండా కేవలం బోర్డులు పెట్టి దందా సాగిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంటనే స్పందించి సాన్వి ఆసుపత్రిపై తనిఖీలు నిర్వహించి దాని లైసెన్స్‌ను రద్దు చేయాలని, బాధ్యులైన వైద్యులను, యాజమాన్యాన్ని కఠినంగా శిక్షించాలని బాధితులు మరియు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## ఆయుర్వేద ఉత్పత్తులపై వినియోగదారుల మొగ్గు

**ఖైరతాబాద్, జూలై 11 (జనం సాక్షి) :** డైఇథిలీన్ గ్లైకాల్(డీఈజీ), ఇథిలీన్ గ్లైకాల్(ఈజీ) వంటి విషపూరిత రసాయనాలతో కలుషితమైన దగ్గు సిరప్‌లపై వచ్చిన నివేదికల నేపథ్యంలో వినియో గదారుల్లో భద్రతపై అవగాహన పెరిగిందని వైద్య సుజాత చౌదరి శనివారం ఒక ప్రకటనలో తెలి పారు. ఈ నేపథ్యంలో సిరప్‌ల నాణ్యత, భద్రతను మరింత బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ నిబంధనల్లో సవరణలు తీసుకొచ్చిందన్నారు. తులసి, ములేఠీ, సొంత్, బనఫ్షా వంటి ఔషధ మూలికలతో తయారయ్యే ఆయుర్వేద దగ్గు సిరప్‌లపై వినియోగదారుల విశ్వాసం పెరుగుతోందని పేర్కొన్నారు. భద్రత, నాణ్యత, ప్రభావశీలతపై పెరుగుతున్న దృష్టి కారణంగా ఆయుర్వేద ఫార్ములేషన్లకు ఆదరణ లభిస్తోందన్నారు. మందులను ఎల్లప్పుడూ విశ్వసనీయ వనరుల నుంచే కొనుగోలు చేసి, లేబుల్‌పై ఉన్న సూచనల ప్రకారం లేదా రిజిస్టర్డ్ వైద్య నిపుణుల సలహాతో మాత్రమే వినియోగిం చాలని సూచించారు.

## మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ సేవలు

**మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డి**



**చేవెళ్ల, జూలై 11 (జనంసాక్షి) :** ఎస్ఐఆర్ ప్రత్యేక ఓటరు జాబితాపై చేవెళ్ల మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డి తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో జరుగుతున్న ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ, హెల్ప్ డెస్క్ ను శనివారం మున్సిపల్ కమిషనర్ యాదగిరితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మున్సిపల్ పరిధిలోని ప్రతి అర్హ ఓటరు తమ ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారాన్ని సంబంధిత బూత్ లెవల్ అధికారులకు తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు. ప్రజల సౌకర్యార్థం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ హెల్ప్‌డెస్క్ సేవలను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రేపు ఆదివారం కూడా మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్, ఆన్ లైన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకుండా ఉండేందుకు చివరి తేదీ వరకు వేచి చూడకుండా వీలైనంత త్వరగా తమ ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించాలని, ఓటరు జాబితా సవరణ ప్రక్రియను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుని పూర్తి సహకారం అందించాలని పిలుపునిచ్చారు. చైర్ పర్సన్ వెంట మేనేజర్ లు ఉమేందర్, వెంకటేష్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న
# పట్టించుకోని రేవంత్ రెడ్డి : ఎంపీ ఈటెల



**శామీర్ పేట్, జూలై 11(జనం సాక్షి) :** జవహర్‌నగర్ డంప్‌యార్డ్ సమస్యపై నిరసనకు దిగిన పలువురు నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని శామీర్ పేట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నాయకుల అరెస్ట్ విషయాన్నీ తెలుసుకున్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ శామీర్ పేట్ పోలీస్ స్టేషన్ కి వెళ్లి అరెస్ట్ అయినా వారికీ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటెల మీడియాతో మాట్లాడు తూ.. డంప్‌యార్డ్ కారణంగా స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. జవహర్ నగర్, దమ్మాయిగూడ, బాలాజీనగర్, కీసర, ఘట్ కేసర్ ప్రాంతాల్లోని భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయన్నారు. ఇక్కడి నుండి ఎంపిగా గెలిచిన రేవంత్ రెడ్డి డంపింగ్ యార్డు కు వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో కేసు వేశాడని గుర్తు చేశారు. ఇప్పుడు సీఎంగా ఉన్న రేవంత్ రెడ్డి ఎందుకు అడ్డుకుంటలేదని ప్రశ్నించారు. డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న వారిని అక్రమంగా అరెస్టు చేయడం దారుణం అన్నారు. జవహర్ నగర్ ప్రజల తరుపున నిరసనను అడ్డుకోవడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని ఆయన పేర్కొన్నారు.

## మాస్టర్ ప్లాన్ రహదారుల
# సవరణకు ఎమ్మెల్యే వినతి

**సానుకూలంగా స్పందించిన హెచ్ఎండీఏ కమిషనర్**



**మల్కాజిగిరి జూలై 11 (జనంసాక్షి):** మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలో ప్రజలకు తీవ్ర ఇబ్బందికరంగా మారిన హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్ రహదారుల ప్రతిపాదనలను వెంటనే సవరించి సమస్యలను పరిష్కరించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలోని పలు కీలక ప్రతిపాదనలను ఆయన దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కౌకూర్, శ్యామల లక్ష్మీనగర్, డాక్టర్స్ కాలనీ, విలాస్ స్ప్రింగ్ కాలనీల మాస్టర్ ప్లాన్‌లోని 60 మీటర్ల ప్రతిపాదిత రహదారిని తక్షణమే రద్దు చేయాలని, మల్కాజిగిరిలోని మీర్జల్‌గూడ, చిన్మయ మార్గ్ లో ప్రజల ఆస్తులకు నష్టం వాటిల్లకుండా ఈ మార్గంలో ప్రతిపాదించిన 60 అడుగుల రహదారి విస్తరణను 30 అడుగులకు కుదించాలి. ఏఎస్‌రావు నగర్-నేరేడ్‌మెట్, ఏఎస్‌రావు నగర్, సాయినాథ్‌పురం, జేకే. కాలనీ, సమతా నగర్, కాకతీయ నగర్ ప్రాంతాల మీదుగా వెళ్లేలా రూపకల్పన చేసిన 100 అడుగుల రహదారి ప్రతిపాదనను మాస్టర్ ప్లాన్ నుంచి పూర్తిగా తొలగించాలనీ కోరారు. అలాగే నిలిచిపోయిన సిఆర్ఎంపి రోడ్ల నిర్మాణం, అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు ప్రత్యేక నిధులు మంజూరు చేసి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, బాధితులకు ఎలాంటి నష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ ఈ అంశాలపై సమగ్ర విచారణ జరిపి, ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా తగిన నిర్ణయం తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

# ఉచిత ప్లాస్టిక్ సర్జరీతో చిన్నారి మహేశ్వరికి కొత్త జీవితం

- అమెరికన్ వైద్యుల సేవతో పుట్టుకతో ఉన్న లోపానికి శాశ్వత పరిష్కారం
- పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్-లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ ల్యాండ్ హైదరాబాద్ సేవలకు ప్రశంసలు
- ప్రైవేటు ఆసుపత్రుల్లో లక్షలు ఖర్చు.. ఉచితంగా శస్త్రచికిత్స


కొత్త ఫోటో


పాత ఫోటో



**వనపర్తి, జూలై 11 (జనంసాక్షి):** పుట్టుకతోనే నుదుటిపై వెంట్రుకలతో కూడిన నల్లటి మచ్చ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెద్దగూడెంలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థిని మహేశ్వరికి ఉచిత ప్లాస్టిక్ సర్జరీ ద్వారా కొత్త జీవితాన్ని అందించారు.
పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పి. మధుకర్ స్వామి, డీసీపీ గారి సారథ్యంలో, పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ మరియు లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ ల్యాండ్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఏడాది జనవరిలో హైదరాబాద్‌లో నిర్వహించిన ఉచిత ప్లాస్టిక్ సర్జరీ శిబిరంలో అమెరికన్ వైద్యుల బృందం ఈ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించింది.
శస్త్రచికిత్స అనంతరం మహేశ్వరిలో గణనీయమైన మార్పు కనిపిస్తోందని, గతంలో మానసికంగా ఇబ్బంది పడిన ఆమె ప్రస్తుతం ఆత్మవిశ్వాసంతో, ఉత్సాహంగా పాఠశాలకు హాజరవుతూ చదువులోనూ, ఇతర కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొంటోందని ఆమె తల్లి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు జానకి కొండన్నతో పాటు గ్రామస్థులు పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ చేపడుతున్న సేవలను అభినందించారు. ఈ మహోన్నత కార్యక్రమానికి సహకరించిన డీసీపీ పి. మధుకర్ స్వామి, డాక్టర్ విద్యా భూషణ్, డాక్టర్ గులాబీ రాణి, రాష్ట్ర కోఆర్డినేటర్ గద్దె భాస్కర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రైవేటు ఆసుపత్రిలో ఇదే శస్త్రచికిత్స చేయించాలంటే లక్ష రూపాయలకు పైగా ఖర్చవుతుందని వైద్యులు చెప్పారని, తమ కుటుంబ ఆర్థిక పరిస్థితి వల్ల అది సాధ్యం కాదని, పూర్తిగా ఉచితంగా శస్త్రచికిత్స నిర్వహించి తమ కుమార్తెకు ఆత్మవిశ్వాసంతో కూడిన కొత్త జీవితాన్ని అందించిన నిర్వాహకులకు మహేశ్వరి తల్లిదండ్రులు భావోద్వేగంతో ధన్యవాదాలు తెలిపారు.
పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ గద్దె భాస్కర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జనవరి నెలలో హైదరాబాద్‌లో అమెరికన్ ప్లాస్టిక్ సర్జన్ల ఆధ్వర్యంలో ఉచిత ప్లాస్టిక్ సర్జరీ శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జన్మతః పెదవి చీలిక, ముఖం, ముక్కు, చెవులు, చేతులు లేదా ఇతర అవయవాల్లో లోపాలతో బాధపడుతున్న గ్రామీణ నిరుపేదలు ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులైన బాధితులు ముందస్తుగా పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్‌ను సంప్రదించి నమోదు చేసుకుంటే ఉచిత వైద్య సేవలు పొందే అవకాశం ఉంటుందన్నారు. సేవే లక్ష్యంగా నిరుపేదలకు ఉచిత వైద్య సహాయం అందించాలనే సంకల్పంతో పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ చేపడుతున్న ఈ కార్యక్రమం పలువురి జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతోంది.

## సర్ గణన ప్రక్రియను వేగవంతం చేయండి

**అధికారులకు జెడ్‌సి నారాయణ్ అమిత్ ఆదేశం**

**శేరిలింగంపల్లి, జూలై 11 (జనంసాక్షి):** 'సర్' ప్రక్రియను మరింత వేగవంతం చేయడం ద్వారా నిర్ణీత గడువులో సమర్థవంతంగా పూర్తి చేయాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్/జోన్ ఈఆర్‌వో నారాయణ్ అమిత్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధి జెపి నగర్, దీప్తి శ్రీనగర్, మాదాపూర్ డివిజన్ పరిధి మై హోమ్ అబ్రా, ఫార్చ్యూన్ టవర్స్ ప్రాంతాలలో శనివారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియ కొనసాగుతున్న తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్ ప్రక్రియ పురోగతిని ప్రస్తుతం కొనసాగుతున్న తీరులోనే ముందుకు తీసుకువెళ్లాలన్నారు. నోడల్ అధికారులు, సూపర్‌వైజర్లు, బూత్ లెవల్ అధికారుల మధ్య సమన్వయాన్ని మరింత మెరుగుపరచుకోవడం ద్వారా కార్యక్రమం విజయానికి పునాదులు వేసుకోవాలని సూచించారు. గణన ప్రక్రియను అంచనా వేసి పనుల వేగం పెంచాలని, అనుకున్న సమయానికి ఎట్టి పరిస్థితుల్లోనూ 100% పూర్తి చేయాల్సిందేనని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ప్రతి ఓటరు వివరాలను పక్కాగా నమోదు చేయాలని, ఎలాంటి పొర పాట్లకు తావు లేకుండా పూర్తి పారదర్శకతను కొనసాగించాలని అధికారులకు సూచించారు.

# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే భూ రీ-సర్వే లక్ష్యం

## భూ భారతి అమలుకు రీ-సర్వే కీలకం

- మార్చి-2027 నాటికి 3 విడతల్లో పూర్తి చేయాలి
- లైసెన్స్ సర్వేయర్లకు ఎకరానికి రూ.60 చెల్లింపు
- సాదాబైనామా దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలి



**రాజన్న సిరిసిల్ల జిల్లా, జులై 11 (జనంసాక్షి):** భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే రాష్ట్రవ్యాప్తంగా భూ రీ-సర్వేను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు.
భూ రీ-సర్వే, భూ భారతి అమలు, సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం, ఇందిరమ్మ ఇళ్లు, రెండు పడక గదుల ఇళ్ల పంపిణీ, విద్యార్థుల యూనిఫాంల పంపిణీ తదితర అంశాలపై శనివారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ తదితరులు పాల్గొన్నారు. కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ వి. విక్టర్, ఆర్డీఓలు, ఏడీ సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ధరణిని రద్దు చేసి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని, రైతుల భూములకు పూర్తి భద్రత కల్పించడమే లక్ష్యమన్నారు. భూ భారతి అమల్లోకి వచ్చి 15 నెలలు పూర్తయినా కొన్ని సమస్యలు ఉన్నాయని తెలిపారు. ధరణి కాలంలో పెండింగ్‌లో ఉన్న 9.6 లక్షల సాదాబైనామా దరఖాస్తులను భూ భారతిలో అవకాశం కల్పించి పరిష్కరించాలని ఆదేశించారు. భూ భారతి సమర్థవంతంగా అమలు కావాలంటే భూ రీ-సర్వే తప్పనిసరి అని మంత్రి పేర్కొన్నారు. శిక్షణ పొందిన 5,700 మంది లైసెన్స్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని, రెగ్యులర్ సర్వేయర్లు, లైసెన్స్ సర్వేయర్లు సమన్వయంతో పని చేయాలని సూచించారు. పైలట్ ప్రాజెక్టుగా నక్షాలు లేని 413 ప్రాంతాల్లోని ఐదు గ్రామాల్లో నిర్వహించిన రీ-సర్వేతో 95 శాతం భూ సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు.
మార్చి-2027 నాటికి మూడు విడతల్లో రీ-సర్వే పూర్తి చేయడమే లక్ష్యమన్నారు. రీ-సర్వేలో పని చేసే లైసెన్స్ సర్వేయర్లకు ఎకరానికి రూ.60 చెల్లించాలని, వారికి బీమా, సామాజిక భద్రత కల్పించాలని తెలిపారు. జూలై 28లోపు విధుల్లో చేరని లైసెన్స్ సర్వేయర్ల లైసెన్సులు రద్దు చేయాలని ఆదేశించారు. సాదాబైనామా దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిష్కరించాలని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, రెండు పడక గదుల ఇళ్ల పంపిణీని వేగవంతం చేయాలని సూచించారు. ఇసుక, కంకర సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ తదితరులు పాల్గొన్నారు. కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తదితరులు స్థానికంగా పాల్గొన్నారు.



# విహెచ్ మౌన దీక్ష

## అయోధ్య రామమందిరం హుండీ చోరీపై సిబిఐ విచారణ జరపాలి

- సంఘీభావం ప్రకటించిన ఎమ్మెల్యేలు కవ్వంపల్లి, ఆది శ్రీను
- కమలనాథులు చోరీని కప్పిపుచ్చడం విడ్డూరం
- రామ నామాన్ని దోపిడీకి ఉపయోగించొద్దు

**ఇల్లంతకుంట, జులై 11 (జనంసాక్షి):** అయోధ్య రామమందిరం విరాళాల చోరీ వ్యవహారానికి కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు శనివారం మౌన దీక్ష చేపట్టారు. ఇల్లంతకుంట మండలం రామోజీపేట గ్రామంలో ఏర్పాటు చేసిన శిబిరంలో వీహెచ్ మౌన దీక్షకు పూనుకోగా, మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్‌సి సెల్ ఛైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీను సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాముడి పేరుతో భక్తుల నుంచి వసూలు చేసిన కోట్లాది రూపాయల విరాళాలు స్వాహా కావడం, భక్తితో ఇచ్చిన కానుకలను దొంగిలించడం భక్తుల మనోభావాలను దెబ్బతీసిందని విమర్శించారు. రామనామాన్ని నిత్యం స్మరించే కమలనాథులు రామ మందిరంలో జరిగిన చోరీలపై చోద్యం చూడటం విడ్డూరంగా ఉందని ఆయన విమర్శించారు.
రామ మందిరం కోట్లాది హిందువుల ఆత్మగౌరవానికి, విశ్వాసానికి సంబంధించిన అంశమని, అలాంటి పవిత్ర కార్యక్రమంలో జరిగిన భారీ అవినీతిని కేంద్ర ప్రభుత్వం, బీజేపీ నాయకత్వం కప్పిపుచ్చడానికి ప్రయత్నించడం సిగ్గుచేటని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ మతాలకు, విశ్వాసాలకు వ్యతిరేకం కాదని, మతం పేరుతో జరిగే దోపిడీని, మోసాన్ని కాంగ్రెస్ సహించబోదని డా. కవ్వంపల్లి స్పష్టం చేశారు.
రాముడి పేరును రాజకీయాలకు, దోపిడీకి ఉపయోగించడం కమలనాథులకు క్షమత్వం కాదని పేర్కొన్నారు. కేంద్రం వెంటనే స్పందించి విరాళాల లెక్కలను బహిర్గతం చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, సర్పంచులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

### గోదావరిఖని ఏసిపి మడత రమేష్

**మంథని, (జనంసాక్షి) :** మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని చెడు వ్యసనాలకు లోను కావద్దని గోదావరిఖని ఏసిపి మడత రమేష్ పేర్కొన్నారు. శనివారం మంథని పట్టణం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/ కళాశాల (బాలురు)లో పెద్దపెల్లి జిల్లా సాంఘిక సంక్షేమ గురుకులాల సమన్వయ సంస్థ అధికారి, ప్రిన్సిపల్ శ్రీనాథ్ అధ్యక్షతన తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా గోదావరి ఖని ఏసిపి మడత రమేష్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు తల్లిదండ్రులు తమ జీవితం పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. తల్లిదం డ్రులు విద్యార్థుల ప్రవర్తనను ఎల్లప్పుడు గమనించాలని పేర్కొన్నారు. సోషల్ మీడియా ప్రభావం తమ పిల్లలపై పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సూచించారు. జీవితంలో కష్టపడి చదువుకుంటేనే ఉన్నత స్థాయికి చేరుకుంటామని ఆయన పేర్కొన్నారు. గురుకులాలలో అత్యున్నత స్థాయిలో విద్యార్థులకు బోధన అందించేందుకు అర్హత గల ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గురుకులాలను నడిపిస్తుందని, యువత కేవలం విద్య మీదనే దృష్టి సారించాలని ఆయన సూచించారు. డ్రగ్స్, మత్తు పదార్థాలుకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. మత్తు పదార్థాలు జీవితాన్ని నాశనం చేస్తాయని, తాత్కాలిక ఆనందం కోసం ఉజ్వలమైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. విద్యార్థులకు ప్రత్యేక సమావేశం ద్వారా ఏసీపి మడత రమేష్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మంథని సీఐ బుద్దే స్వామి, ఎస్సై సందీప్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ నవీన్, జూనియర్ వైస్ ప్రిన్సిపల్ రాజ్ కుమార్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# రామగుండం ఏరియా-1లో తాడిచర్ల-2 బ్లాక్ సాధన విజయోత్సవాలు



**గోదావరిఖని, జనంసాక్షి :** తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్‌కు మైనింగ్ లీజు మంజూరు కావడం సందర్భంగా నిర్వహిస్తున్న విజయోత్సవాల సందర్భంగా రామగుండం ఏరియా-1 పరిధిలోని జీడీకే-1,3 ఇంక్లైన్ గనిలో శనివారం ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామగుండం ఏరియా-1 జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై సింగరేణి కార్మికులను అభినందించారు. ఈ సందర్భంగా జియం డి లలిత్ కుమారు మాట్లాడుతూ తాడిచర్ల-2 బ్లాక్ సాధన సింగరేణి సంస్థ భవిష్యత్తుకు ఎంతో కీలకమైన మైలురాయిగా నిలుస్తుందని జియం పేర్కొన్నారు., ఈ విజయోత్సవం మన సంస్థ అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి ప్రతి ఉద్యోగి సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.
అదేవిధంగా రామగుండం ఏరియా-1 జీఎం కార్యాలయం, అన్ని గనులు డిపార్ట్మెంట్ లలో తాడిచర్ల-2 బ్లాక్ కేటాయింపు విజయోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ స్వీట్లు పంపిణీ చేసి తాడిచర్ల-2 బ్లాక్ సాధన పట్ల తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సందేశంతో కూడిన కరపత్రాలను ఉద్యోగులందరికీ పంపిణీ చేశారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపిస్తూ, తాడిచర్ల--2 బొగ్గు బ్లాక్ మైనింగ్ లీజు సాధనతో సింగరేణి సంస్థకు సుస్థిర భవిష్యత్తు లభించిందని, సంస్థ అభివృద్ధి, కార్మిక సంక్షేమం, కొత్త బొగ్గు గనుల సాధన, ఉత్పత్తి వ్యయ నియంత్రణ, సాంకేతిక అభివృద్ధి, పునరుత్పాదక ఇంధన రంగంలో విస్తరణ వంటి అంశాలపై ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉద్యోగులకు వివరించారు. అనంతరం నిర్వహించిన విజయోత్సవ వేడుకల్లో అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు ఒకరికి ఒకరు స్వీట్లు, మిఠాయిలు తినిపించుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. కార్యక్రమానికి హాజరైన అందరికీ మిఠాయిలు పంపిణీ చేసి వేడుకలను ఉత్సాహభరితంగా నిర్వహించారు.
ఇట్టి కార్యక్రమములో రామగుండం రీజియన్ క్వాలిటీ జనరల్ మేనేజర్ సుజోయ్ మజుందార్, , యస్. ఓ టు జియం చంద్ర శేఖర్, గుర్తింపు సంఘం ఎఐటియుసి డిప్యూటి జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, జిడికే 1 గ్రుఫ్ ఏజంట్ యల్ రమేష్, 11వ గ్రూప్ ఏజంట్ చిలుక శ్రీనివాస్, జీడీకే ఓసి.5 పివో రమేష్, పర్సనల్ మేనేజర్ తిరుపతి, సీఎంఓఏఐ ఏరియా వైస్ ప్రెసిడెంట్ పెరుమాళ్ళ శ్రీనివాస్, సీనియర్ పివో హనుమంతరావు, జియం ఆఫీస్ ఇంచార్జ్ రాజు, జీఎం కార్యాలయం ఉద్యోగులు మరియు ఆర్జీ.1 లోని జిడీకే 1,2,2 ఏ,11 ఇంక్లైన్ గనులు, ఓసి.5, అన్ని విభాగాల్లో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకతకై మరింత గడువు పెంచాలి

- బీసీ సాధికారిత సంఘం ఉత్తర తెలంగాణ జిల్లాల ఇన్చార్జి పొలాస నరేందర్



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జులై 11 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియ ఇంటింటికి బీఎల్ఓలు మరియు వివిధ రాజకీయ పార్టీల పరంగా బీఎల్ఏలు సమిష్టిగా సమన్వయంతో ఎన్యూమరేషన్ ఫారాలను అందజేస్తూ,వాటిని నింపిన పిదప తిరిగి తీసుకుంటున్నారన్నారు. జూన్ 25 న ప్రారంభించిన ఎస్ఐఆర్ ప్రక్రియ జులై 24 వరకు ముగిస్తుందని ఎన్నికల సంఘం ప్రకటించిందని ఉత్తర తెలంగాణ జిల్లాల బీసీ సాధికారక సంఘం ఇన్చార్జి పొలాస నరేందర్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ బీఎల్ఓలు ఇంటింటికీ ఎన్యూమరేషన్ ఫారాలు ఇవ్వడానికి వచ్చిన సమయం,ఇచ్చిన ఫారాలు తీసుకొనడానికి వచ్చే సమయం తెలియక ఉద్యోగరీత్యా,వ్యాపారరిత్య, వ్యవసాయరిత్య, ఇతర పనులపై వెళ్లడంతో డోర్ లాక్ ఉండడం, మరికొందరు వలస కార్మికులు బ్రతుకు తెరువుకై దూర ప్రాంతాలకు వెళ్ళడం వల్ల వారు అందుబాటులో లేకపోవడంతో వారి ఓట్లు తప్పి తప్పిపోయే ప్రమాధం ఎక్కువగా ఉందన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ గడువును మరింత పెంచాలని రాష్ట్ర,కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆయన కోరారు. బడుగు బలహీన వర్గాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ,బీసీ,మైనార్టీ వర్గాల్లో చాల వరకు నిరక్షరాస్యులు ఉండడంతో వారికి సక్రమంగా ఫారాలు నింపరాక,నింపే వారు అందుబాటులో లేక,కొంత వరకు సమాచారం తేలియక ఓటు హక్కు కొల్పోవచ్చున్నారు. ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టుచున్న సర్ ప్రక్రియ పూర్తి కావడానికి మరింత గడువు పెంచాలని ఎన్నికల సంఘానికి అయన విజ్ఞప్తి చేశారు.

# వంట గ్యాస్ కోసం అల్లాడుతున్న మధ్యాహ్న భోజన సిబ్బంది

- కట్టెలతో వంట చేయాల్సి వస్తుందని సిబ్బంది ఆవేదన
- ఆన్లైన్ బుకింగ్ విధానం తప్పిద్దంలో పాఠశాలకు సిలిండర్లు రావడంలేదు
- పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీరాజ్యం



**ముత్తారం జూలై 11(జనంసాక్షి) :** ముత్తారం మండలం పోతారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత కొన్ని రోజులుగా వంట గ్యాస్ సరఫరా లేకపోవడంతో పాఠశాలలో మధ్యాహ్న భోజన వంటకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాఠశాలలో 80 మంది వరకు విద్యార్థులు మధ్యాహ్న భోజన పథకం ద్వారా భోజనం చేస్తున్నారు. కానీ గ్యాస్ సిలిండర్ అందకపోవడంతో సిబ్బంది కట్టెలు,పొయ్యిలతో వంట చేయాల్సి వస్తుందని మధ్యాహ్న భోజన సిబ్బంది తెలిపారు. ప్రతి నెలా గ్యాస్ బుక్ చేసినా టైంకు బుకింగ్ అవడం లేదని దానితో పాఠశాలకు రావడం లేదు కాని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టి ఆకలి తీర్చాలనే సంకల్పంతో పాఠశాల ఆవరణలోని ఎండిన కట్టెలు ఎరుకొని వచ్చి కట్టెలతో వంట చేస్తే పొగకు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాం. సమయానికి వంట పూర్తి కావడం లేదు. పిల్లలు ఆలస్యంగా భోజనం చేస్తున్నారు" అని సిబ్బంది వాపోయారు. వంట గ్యాస్ లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు తెలిపారు. ఈ విషయంపై ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీరాజ్యం వివరణ కోరగా ఆయన మాట్లాడుతూ,విద్యార్థులకు సకాలంలో నాణ్యమైన భోజనం అందించాలంటే గ్యాస్ తప్పనిసరిగా ఉండాలని. పాఠశాలకు సంబంధించిన వంట గ్యాస్ సిలిండర్ల ఆన్లైన్ బుకింగ్ విధానాన్ని రద్దుచేసి ఎప్పుడు పడితే అప్పుడు పాఠశాలకు సిలిండర్లు పంపించాలని అయన తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి గ్యాస్ సరఫరా చేయాలి" అని అయన కోరారు.

## ప్రభుత్వానికి వందల కోట్ల బకాయిలు ఉన్న వారికి

# చట్టాలు చుట్టాలుగా మారాయి

- సీఎంఆర్ బియ్యం కాజేసిన వారిపై చర్యలు ఎందుకు లేవు?
- తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గుంజపడుగు హరిప్రసాద్
- దోపిడీదారులను కాపాడుతున్న ప్రభుత్వం, అధికారులు



**కరీంనగర్, జులై 11 (జనంసాక్షి):** తెలంగాణ ప్రభుత్వం వివిధ మిల్లులకు కేటాయించిన ధాన్యం ఆ మిల్లుల్లో లేకపోవడాన్ని గుర్తించిన సివిల్ సప్లై అధికారులు దోషులపై చర్యలు తీసుకోవడంలో ఎందుకు వెనుకడుగు వేస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గుంజపడుగు హరిప్రసాద్ డిమాండ్ చేశారు. ఒకరిద్దరి మీద కేసులు పెట్టి అసలైన తిమింగలాలను కాపాడుతున్నారని, ఇదివరకే నిషేధిత జాబితాలో ఉన్న మిల్లర్లకు తిరిగి ధాన్యం కేటాయింపులు చేయకూడదనే నిబంధన ఉన్నప్పటికీ ప్రభుత్వం వారికే మళ్లీ మళ్లీ ధాన్యం కేటాయింపులు చేయడం వెనుక ఉన్న మతలబ్ ఏమిటో చెప్పాలన్నారు. ఈ సీజన్‌లో కూడా నిషేధిత మిల్లులకు ధాన్యం కేటాయింపులు చేసి ఇదివరకే వందల కోట్ల బకాయిలు ఉన్న వారిని కాపాడుతున్నారని విమర్శించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వివిధ మిల్లుల నుంచి దాదాపు 700-800 కోట్లు ప్రభుత్వానికి రావాల్సి ఉందని తెలిపారు. సివిల్ సప్లై కార్పొరేషన్‌లో భారీ అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని, దీనిపై ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. లేనియెడల తెలంగాణ రక్షణ సేన సివిల్ సప్లై కార్యాలయం ముందు రైతులు, ప్రజలతో కలిసి ఆందోళన చేపట్టాలని హెచ్చరించారు. ఈ దోపిడీలో ప్రభుత్వ పెద్దలు, అధికారులు, ప్రతిపక్షాల నాయకులు మిలాఖత్ కావడంతోనే వందల కోట్ల ధాన్యం బకాయి ఉన్న విజిలెన్స్, టాస్క్ ఫోర్స్ తనిఖీల్లో అక్రమాలు రుజువైన మిల్లర్లకు మళ్లీ ధాన్యం కేటాయింపులు చేస్తున్నారని ఆరోపించారు. సన్న బియ్యం పంపిణీకి ముందు, మిగిలిన దొడ్డు బియ్యం వేలం ప్రక్రియలో కూడా వందల కోట్ల భారీ కుంభకోణం జరిగిందని, దీనికి సంబంధించిన వివరాలు త్వరలోనే బయటపెడతామని తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షులు గుంజపడుగు హరిప్రసాద్ ప్రకటించారు.

# అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

- వర్షాలు లేని సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- రావులచెరువులోకి డ్రైనేజీ నీరు చేరకుండా శాశ్వత చర్యలు
- 40 వేల మంది విద్యార్థులకు అల్పాహారం, భోజనం కోసం హరే కృష్ణ గోదాముల ఏర్పాటు
- మంథని మార్కెట్ ఏరియా, ప్రభుత్వ ఆసుపత్రి, సమీకృత కార్యాలయాలు, రావులచెరువు పనులను తనిఖీ చేసిన కలెక్టర్



**మంథని, జులై 11 (జనంసాక్షి):** పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం మంథని పట్టణంలో నిర్మించనున్న మార్కెట్ ఏరియా, సమీకృత ప్రభుత్వ కార్యాలయాల సముదాయం, నూతనంగా నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి, రావులచెరువు పునరుద్ధరణ పనులు, రావులచెరువు సమీపంలో చేపడుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లాలోని సుమారు 40 వేల మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం, భోజనం అందించేందుకు ఏర్పాటు చేస్తున్న హరే కృష్ణ గోదాముల ఏర్పాటును కూడా పరిశీలించి అధికారులతో పనుల పురోగతి పై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని, ఈ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకొని అన్ని పనులను వేగవంతం చేయాలని సూచించారు. పనుల్లో ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా నిర్ణీత గడువులోపు నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.
మంథనిలో నిర్మిస్తున్న మార్కెట్ ఏరియా, సమీకృత ప్రభుత్వ కార్యాలయాల సముదాయం, మార్కెట్ ఏరియాలో 100 ఫీట్ల రోడ్డు పనులను పరిశీలించి తరగతి గతిన పూర్తి చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ వేగంగా పూర్తి చేయాలని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించే విధంగా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. రావులచెరువు పునరుద్ధరణ పనులను నాణ్యతతో పూర్తి చేసి చెరువును సంరక్షించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా డ్రైనేజీ నీరు ఎట్టి పరిస్థితుల్లోనూ రావులచెరువులోకి చేరకుండా శాశ్వత ప్రాతిపదికన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. అనంతరం హరే కృష్ణ గోదాముల ఏర్పాటును పరిశీలించిన కలెక్టర్, జిల్లాలోని సుమారు 40 వేల మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం, భోజనం అందించే కార్యక్రమానికి అవసరమైన మౌలిక వసతులు, నిల్వ సదుపాయాలు, పంపిణీ ఏర్పాట్లు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పనులను వేగంగా పూర్తి చేసి కార్యక్రమాన్ని సకాలంలో ప్రారంభించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో మంథని ఆర్డీఓ సురేష్, మంథని మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సయేందర్ రెడ్డి, కౌన్సిలర్ పెంటరీ రాజు, తహసీల్దార్ ఆరిఫుద్దీన్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, సంబంధిత శాఖల అధికారులు, ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# సీతారాంపూర్‌లో సాంకేతిక సంచలనం

- ఐవివై (సిబిఎస్), సిద్ధార్థ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ సంయుక్త ఆధ్వర్యంలో బ్రోవై రోబోటిక్స్ ఎక్స్‌పో
- విద్యార్థులను మంత్రముగ్ధులను చేసిన ఆధునిక ఆవిష్కరణలు
- విద్యార్థులు వారి తల్లిదండ్రులకు, ప్రత్యక్షంగా ఏఐ, రోబోటిక్స్, సైబర్ భద్రతపై అవగాహన



**కరీంనగర్ బ్యూరో జులై, 11 (జనంసాక్షి) :**
సాంకేతిక రంగంలో వేగంగా దూసుకుపోతున్న కృత్రిమ మేధస్సు ప్రపంచాన్ని విద్యార్థులకు చేరువ చేయాలనే లక్ష్యంతో ఐవీవై విద్యాసంస్థలు, సిద్ధార్థ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం అత్యంత వైభవంగా బ్రో వై " రోబోటిక్స్ ఎ ఏఐ ఎక్స్‌పో - 2026" నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎఫ్ ఐసీసీఐ తెలంగాణ హెల్త్ ప్యానల్ , మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిమ్స్ హాస్పిటల్, ఇండియన్ నేవీ, సర్టిఫైడ్ సీఈఓ ఐఐమ్ సర్జ్ కేప్టెన్ డా.విజయ్ కుమార్ బోడసింగు, వారి బృందం విచ్చేసారు. ఐవీవై విద్యాసంస్థల వ్యవస్థాపకులు పసుల మహేష్, దాసరి శ్రీపాల్ రెడ్డి, డైరెక్టర్ పసుల జయశ్రీ, ప్రిన్పాల్ కె. లలిత, కోల మాలతి, సంప్రదాయబద్ధంగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్రోవ్ ఏఐ నిపుణుల బృందం విద్యార్థులు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, మిషన్ లెర్నింగ్, సెన్సార్ టెక్నాలజీ, ఆటోమేషన్, డ్రోన్ సాంకేతికత, సైబర్ సెక్యూరిటీ, సైబర్ క్రైమ్ నివారణ, డిజిటల్ భద్రత, సెల్ఫ్ లర్నింగ్, ఏఐతో పాటు లర్నింగ్ భవిష్యత్ ఉద్యోగ అవకాశాలు వంటి అనేక ఆధునిక సాంకేతిక అంశాలను ప్రత్యక్ష ప్రదర్శనల ద్వారా సులభంగా వివరించారు. రోబోలు ఎలా పనిచేస్తాయి? మనం ఇచ్చే ఆదేశాలను ఎలా అర్థం చేసుకుంటాయి? ఏఐ మన రోజువారీ జీవితంలో ఎలా ఉపయోగపడుతోంది? ఆన్‌లైన్ మోసాల నుండి ఎలా రక్షించుకోవాలి? వంటి అంశాలను ప్రత్యక్ష డెమోలతో వివరించగా, విద్యార్థులు, తల్లిదండ్రులు ఆసక్తిగా వీక్షించి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ఐవీవై విద్యాసంస్థల వ్యవస్థాపకులు పసుల మహేష్, కో చైర్మెన్, దాసరి పాల్ రెడ్డి, డైరెక్టర్ పసుల జయశ్రీ మాట్లాడుతూ... భవిష్య ప్రపంచం పూర్తిగా సాంకేతికత ఆధారంగానే నడుస్తుందని అందుకే విద్యార్థులు పుస్తక పరిజ్ఞానంతో పాటు ఏఐ రోబోటిక్స్, సైబర్ భద్రత, వంటి ఆధునిక నైపుణ్యాలను, అలవర్చుకోవాలని ఇలాంటి అవకాశాలను విద్యార్థులకు అందించడం మా లక్ష్యం అని తెలిపారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచి సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకుంటే ప్రపంచ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. ఎక్సపో లో ఏర్పాటు చేసిన లైవ్ రోబో డెమోలో ఏఐ యాక్టివిటీ, సైబర్ సెక్యూరిటీ జోన్, ఇంటరక్టివ్ టీచింగ్, టెక్ గేమ్స్, వివిధ ప్రదర్శనలు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకొని అందరినీ మంత్రముగ్ధులను చేశాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆధునిక సాంకేతిక ప్రపంచాన్ని ప్రత్యక్షంగా అనుభవించారు.

# సమస్యల వలయంలో టౌన్ ప్లానింగ్

- రెండు సర్కిళ్లకు ఒక్కడే అధికారి
- అక్రమ నిర్మాణదారులకు వరం



**మల్కాజిగిరి జూన్ 11 (జనంసాక్షి) :**
మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మల్కాజిగిరి, మౌలాలి సర్కిళ్లలో టౌన్ ప్లానింగ్ విభాగం తీరు దారుణంగా తయారైంది. లక్షలాది మంది నివసించే ఈ రెండు కీలక సర్కిళ్లకు కలపి ప్రస్తుతం ఒకే ఒక్క టౌన్ ప్లానింగ్ అధికారి విధులు నిర్వర్తిస్తుండటం గమనార్హం. అంతేకాకుండా, మల్కాజిగిరి జోనల్ పరిధిలోని ఇతర సర్కిళ్ల బాధ్యతలను కూడా ఆ ఒక్క అధికారికే కట్టబెట్టడంతో ఆయనపై పనిభారం తీవ్రంగా పెరిగింది. ఫలితంగా ఏ ఒక్క సర్కిల్‌లోనూ పనులు వేగవంతంగా సాగక, ప్రజలకు పౌర సేవలు అందకుండా పోతున్నాయి. మల్కాజిగిరి, మౌలాలి సర్కిళ్ల పరిధిలో క్షేత్రస్థాయి విధులను చూసుకోవాల్సిన సెక్షన్ అధికారి తన బాధ్యతలను సక్రమంగా నిర్వహించడంలో విఫలమయ్యారన్న ఆరోపణలు వచ్చాయి. దీనిపై స్పందించిన ఉన్నతాధికారులు సదరు అధికారిణిని సర్కిల్ విధుల నుంచి తప్పించి జోనల్ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఈ మార్పు జరిగి 10 రోజులు దాటుతున్నా, ఆమె స్థానంలో మరొకరిని నియమించకపోవడంతో కార్యకలాపాలు స్తంభించిపోయాయి. నిబంధనల ప్రకారం ఇళ్లు, భవనాలు నిర్మించుకోవడానికి దరఖాస్తు చేసుకున్న స్థానికులు అనుమతుల కోసం రోజూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. దీంతోపాటు క్షేత్రస్థాయిలో పరిశీలించే క్రింది స్థాయి సిబ్బందికి ఓటరు జాబితా సవరణ పనులను అప్పగించారు. అధికారులు లేకపోవడాన్ని అక్రమ నిర్మాణదారులు ఆసరాగా చేసుకుంటున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారుల తనిఖీలు పూర్తిగా నిలిచిపోవడంతో అనుమతులకు విరుద్ధంగా అదనపు అంతస్తులను నిర్మించేస్తున్నారు. రెండు సర్కిళ్లకు తోడు మొత్తం జోన్ బాధ్యతలు చూడాల్సి రావడంతో ఒక్కడే ఏమీ చేయలేక,క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసే అవకాశం లేకపోవడంతో అక్రమార్కుల ఆటలకు అడ్డుకట్ట పడటం లేదు. సిబ్బంది కొరతతో ఒకవైపు స్థానికులకు ఇబ్బందులు ఎదురవుతుంటే, మరోవైపు ప్రభుత్వానికి రావాల్సిన రాబడి సైతం దెబ్బతింటోంది. తక్షణమే స్పందించి మల్కాజిగిరి, మౌలాలి సర్కిళ్లకు పూర్తిస్థాయిలో సెక్షన్ అధికారులను నియమించాలని, అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

# ఆర్‌డీఎస్ చుట్టూ జలరాజకీయం

- కాగితాలపైనే వాటాలు.. గద్వాల రైతుకు కన్నీళ్లే!
- ఆర్‌డీఎస్ ఆనకట్టకు100 మీటర్ల ఎగువన అక్రమ లిఫ్ట్
- కర్ణాటక రూ.85 కోట్లతో ఇరిగేషన్ పనులు
- తెలంగాణకు రావలసిన నికర జలాలు 15.90 టీఎంసీలు
- గద్వాల జిల్లాకు కేవలం 5నుండి 6టీఎంసీలు మాత్రమే..
- ఎండిపోతున్న 87,500 ఎకరాల సాగుభూమి





**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, జులై 11(జనం సాక్షి) :** రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ వివాదం అనేది కర్ణాటక, తెలంగాణ లోని ఉమ్మడి మహబూబ్‌నగర్,గద్వాల ప్రాంతం, మరియు ఆంధ్రప్రదేశ్ రాయలసీమ,కర్నూలు రాష్ట్రాల మధ్య దశాబ్దాలుగా నడుస్తున్న కీలకమైన నదీ జలాల పంపిణీ గొడవ. తుంగభద్ర నదిపై కర్ణాటకలోని రాయచూర్ జిల్లా రాజోలి వద్ద నిర్మించిన ఈ ఆనకట్ట ప్రధానంగా జోగులాంబ గద్వాల, అలంపూర్ ప్రాంతాల సాగునీటి అవసరాలను తీరుస్తుంది.ప్రస్తుతం ఈ మూడు రాష్ట్రాల మధ్య ఉన్న ప్రధాన వివాదాలు, రాజకీయ జల జగడాల పై "జనం సాక్షి" సమగ్ర విశ్లేషణ. ఆర్డీఎస్ బ్యాక్ వాటర్ నీటి కేటాయింపులు వర్సెస్ వాస్తవ వినియోగం కాగితాలపై వాటాలను బచావత్ ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం ఆర్‌డీఎస్ కింద తెలంగాణకు 15.90 టీఎంసీల,కొన్ని రికార్డుల ప్రకారం 17.1 టీ ఎం సి ల నీటి వాటా ఉంది. వాస్తవంగా అందుతున్నది కాలువల పూడిక, ఎగువ రాష్ట్రాల అక్రమ వాడకం వల్ల తెలంగాణకు కేవలం 5 నుండి 6 టీఎంసీల నీరు మాత్రమే అందుతోంది. దీనివల్ల గద్వాల, అలంపూర్ పరిధిలోని దాదాపు 87,500 ఎకరాల ఆయకట్టు ఎండిపోతోందని ఈ ప్రాంత వాసుల వాదన. ఆర్డీఎస్ పై కర్ణాటక అక్రమ ప్రాజెక్టుల వివాదం కర్ణాటక ప్రభుత్వం ఆర్‌డీఎస్ ఆనకట్టకు ఎగువన కేవలం 100 మీటర్ల దూరంలో తాగునీటి పేరుతో అక్రమంగా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు కురిడి, చిక్కలపర్వి, చిక్కలమంచి బ్యారేజీలు నిర్మిస్తోందని తెలంగాణలోని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.ఈ ప్రాజెక్టులు పూర్తయితే గద్వాల జిల్లాకు వచ్చే నీటి ప్రవాహం పూర్తిగా నిలిచిపోతుందని స్థానిక రైతాంగంలో తీవ్ర భయాందోళనలు నెలకొ న్నాయి. ఆంధ్రప్రదేశ్, కర్ణాటకల మధ్య సరిహద్దు గొడవలు స్లూయిస్ రంధ్రాల వివాదం, ఏపీలోని కర్నూలు జిల్లా కోసిగి మండలం సాతనూరు సమీపంలో ఉన్న ఆనకట్ట రెండు స్లూయిస్‌ల ద్వారా రాయలసీమ నేతలు నిరంత రాయంగా నీటిని తరలిస్తున్నారని కర్ణాటక ఇంజనీర్లు కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు ఫిర్యాదు చేశారు.ఆర్‌డీఎస్ ఆనకట్టకు కాంక్రీట్ స్కిన్ వాల్ నిర్మించి ఆధునీకరిస్తే తమ వైపునకు వచ్చే లీకేజీ నీరు ఆగిపోతుందని కర్నూలు జిల్లా రైతులు, రాజకీయ నాయకులు ఈ పనులను దశాబ్దాలుగా అడ్డుకుంటు న్నారు. గుండ్రేవుల ప్రాజెక్ట్ డిమాండ్ ను కర్నూలు జిల్లా కరువు తీరాలంటే ఆర్‌డీఎస్ కుడి కాలువ పరిధిలో తుంగభద్రపై గుండ్రేవుల జలాశయం నిర్మించాలని ఏపీ డిమాండ్ చేస్తుండగా, ఇది తమ ప్రయోజనాలకు గండి కొడుతుందని తెలంగాణ వ్యతిరేకిస్తోంది.ప్రస్తుత తాజా పరిణామాలు 2026 సం: కేంద్రం మధ్యవర్తిత్వం, సీఎంల భేటీతో ఈ జల జగడాలకు శాశ్వత పరిష్కారం కనుగొనడానికి కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్.పాటిల్ ఆధ్వర్యంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, కర్ణాటక డిప్యూటీ సీఎం డి.కె.శివకుమార్ జూన్ 2026లో తుంగభద్ర డ్యామ్ వద్ద ప్రత్యేకంగా భేటీ అయ్యారు.హై లెవెల్ కమిటీలో ఈ మూడు రాష్ట్రాల మధ్య నీటి సమస్యలపై అధ్యయనం చేసి, "తుంగభద్ర మోడల్" తరహాలో శాంతియుత ఒప్పందాలు కుదిర్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది.రాజకీయ వేడిలో తెలంగా ణకు పూర్తి వాటా తెచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం ద్వారా ప్రత్యామ్నాయ వ్యూహాలు రచిస్తుండగా, కర్ణాటక అక్రమ ప్రాజెక్టులపై ప్రభుత్వం సరిగ్గా స్పందించడం లేదని బీఆర్ఎస్ నేతలు ఆర్‌డీఎస్ సైట్‌ను సందర్శించి ధర్నాలు చేస్తున్నారు.

### ఆర్డీఎస్‌పై తెలంగాణ ప్రభుత్వం

ఇటీవల జూన్ 2026లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జలసౌధలో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో మరియు కేంద్ర జలశక్తి మంత్రితో జరిపిన భేటీలలో తెలంగాణ ప్రభుత్వం తన గళాన్ని బలంగా వినిపించింది. కర్ణాటక ప్రభుత్వం ఎలాంటి కేంద్ర జల సంఘంతెలంగాణ ప్రభుత్వం చేసిన వరుస ఫిర్యాదుల నేపథ్యంలో, జూన్ 2026 లో కేఆర్ఎంబీ ఇంజనీరింగ్ అధికారుల బృందం ఆర్‌డీఎస్ సైట్‌ను నేరుగా సందర్శించి, కర్ణాటక చేస్తున్న అక్రమ నీటి మళ్లింపులను, నిబంధనల ఉల్లంఘనలను రికార్డు చేసింది. బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపులను కర్ణాటక పూర్తిగా ఉల్లంఘిస్తోందని చూపిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర జలశక్తి మంత్రికి నివేదిక సమర్పించారు. కర్ణాటక ప్రాజెక్టుల వల్ల గద్వాల ఆయకట్టుకు జరుగుతున్న అన్యాయంపై చట్టపరమైన విచారణ జరిపేందుకు కేంద్రం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీకి తెలంగాణ ప్రభుత్వం గట్టి సాక్ష్యాధారాలను అందజేస్తోంది. ఈ చర్యలు ఇలా ఉండగా, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ,జూలై 2026 మొదటి వారంలో ఆర్‌డీఎస్ ప్రాజెక్టును సందర్శించి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచింది. కర్ణాటకలో ఇప్పటికే 60% కురిడి ప్రాజెక్టు పనులు పూర్తయినా, కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం ఉత్తరాలు రాయడానికే పరిమితమైం దని, తక్షణమే సుప్రీంకోర్టులో లీగల్ స్టే తెచ్చి పనులు ఆపించకపోతే గద్వాల నడిగడ్డ ఎడారిగా మారుతుందని వారు డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కర్ణాటక ఇరిగేషన్ మంత్రి బోస్ రాజ్ లతో మే-జూన్ 2026 లో ప్రత్యేకంగా భేటీ అయ్యారు.దిగువ రాష్ట్రం అయిన తెలంగాణ అనుమతి లేకుండా ఎగువన ఎలాంటి కొత్త ఫ్లడ్ లిఫ్ట్ స్కీమ్‌లు లేదా బ్యారేజీలు నిర్మించడానికి వీల్లేదని, అది అంతర్రాష్ట్ర నదీ జలాల చట్టాలకు విరుద్ధమని స్పష్టం చేశారు. తుమ్మిళ్ల ఎత్తిపోతల వంటి ప్రత్యామ్నాయాలు తాత్కాలిక ఉపశమనాన్ని ఇస్తాయే తప్ప, ఆర్‌డీఎస్ నికర జలాలకు ప్రత్యామ్నాయం కాలేవు. కేంద్ర ఉన్నత స్థాయి కమిటీ ముందు తెలంగాణ ప్రభుత్వం తన వాదనలను గట్టిగా వినిపించి, తుంగభద్ర బోర్డు ద్వారా కర్ణాటక జలదోపిడీకి శాశ్వతంగా అడ్డుకట్ట వేయాలి. రాజకీయ విమర్శలను పక్కన పెట్టి, అధికార, ప్రతిపక్షాలు కలిసికట్టుగా పోరాడితేనే గద్వాల ఆయకట్టు పచ్చబడుతుంది, నడిగడ్డ రైతాంగానికి నిజమైన న్యాయం జరుగుతుంది.



## టీటీడీ తరహాలో యాదగిరిగుట్ట అభివృద్ధి

- ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఎం.సత్యనారాయణ రెడ్డి

**యాదగిరిగుట్ట (జనంసాక్షి) :** టీటీడీ తరహాలో యాదగిరి గుట్టను అభివృద్ధి చేస్తామని ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నూతన ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలి అధికారిక బోర్డు సమావేశం శనివారం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ భక్తులకు మెరుగైన వసతులు కల్పించడం, యాదగిరిగుట్టను దేశంలోనే ఆదర్శ ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. టీటీడీలో అమలవుతున్న భక్తి సేవా విధానాలను అధ్యయనం చేసి, యాదగిరిగుట్టలో అమలు చేయడానికి చర్యలు చేపడతామని చెప్పారు. ఈ బాధ్యతలను అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తొలి సమావేశంలోనే బోర్డు సభ్యులందరూ క్షేత్రాభివృద్ధిపై నిర్మాణాత్మక సూచనలు చేయడం సంతోషకరమని అన్నారు. యాదగిరిగుట్టకు వచ్చే భక్తులు దర్శనం అనంతరం వెంటనే వెళ్లిపోతున్నారని, రాత్రి బస చేసేలా నాణ్యమైన వసతి సౌకర్యాలు కల్పించడం అత్యవసరమని చైర్మన్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఆమోదించిన బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయం, సుమారు 250 నుంచి 300 మంది భక్తులు బస చేసే సూట్లు, డబుల్, సింగిల్ రూములు, డార్మిటరీల నిర్మాణ పనులను వేగవంతం చేస్తామని తెలిపారు. పుష్కరిణిలో నీటి కొరత, కోతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా అధ్యయనం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. టెంపుల్ సిటీ ప్రాజెక్టు, దాతల విధానం పై సమీక్షించి తగిన నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. కొండపైకి వెళ్లే మెట్ల మార్గానికి ఎండ, వానల నుంచి రక్షణ కల్పించేలా పైకప్పు నిర్మాణానికి దాత ముందుకు వచ్చారని తెలిపారు. హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ బస్సు సౌకర్యాల పై ప్రత్యేక సర్వే నిర్వహించి అవసరమైన సర్వీసులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. భక్తులకు మార్గదర్శకంగా సైన్‌బోర్డులు, భవిష్యత్తులో స్వాగత తోరణం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

## రూ.224 కోట్లతో రహదారి పనులకు నేడు శంకుస్థాపన

- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట (జనంసాక్షి) : రూ.224 కోట్ల రహదారి పనులకు మంత్ర కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నేడు శంకుస్థాపన చేయనున్నట్టు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించనున్న భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. శనివారం యాదగిరిగుట్టలో మీడియా సమావేశం నిర్వహించారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ కింద ఆలేరు నియోజకవర్గంలో రూ.224 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బీటీ రహదారుల నిర్మాణ పనులకు వంగపల్లిలో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు హాజరవుతారని చెప్పారు.

## మోడీ నేరుగా ప్రజలతోనే కనెక్ట్ అవుతారు

- మధ్యలో ఇతరుల జోక్యం కోరుకోరు
- మీడియాను దూరంగా పెట్టడంపై జర్నలిస్ట్ ప్రశ్న
- విదేశాంగ అధికారి రుద్రేంద్ర టాండన్ జవాబు



**ఆక్లాండ్, జులై 1(జనంసాక్షి) :** ప్రస్తుతం మూడు దేశాల పర్యటనలో భాగంగా న్యూజిలాండ్‌లో ఉన్న భారత ప్రధాని నరేంద్ర మోదీ పొలిటికల్ కమ్యూనికేషన్ స్టైల్‌పై అంతర్జాతీయ మీడియా నుంచి ఆసక్తికర ప్రశ్న ఎదురైంది. భారత రాయబార కార్యాలయ అధికారులతో జరిగిన ఓ ముఖాముఖి సమావేశంలో, ఓ స్థానిక జర్నలిస్ట్ నేరుగా దౌత్యవేత్తలను ఉద్దేశించి 'ప్రధాని మోదీ మీడియా సమావేశాలు ఎందుకు నిర్వహించరని ప్రశ్నించారు. దీనికి భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారి, ప్రముఖ దౌత్యవేత్త రుద్రేంద్ర టాండన్ అత్యంత చాకచక్యంగా స్పష్టమైన సమాధానమిచ్చారు. జర్నలిస్ట్ అడిగిన ప్రశ్నకు విదేశాంగ అధికారి రుద్రేంద్ర టాండన్ స్పందిస్తూ.. ప్రధాని రాజకీయ వ్యూహాలను ఒక ప్రభుత్వ అధికారిగా తాను ప్రశ్నించలేనని చెప్తూనే, భారతీయ రాజకీయాల నేపథ్యాన్ని వివరించారు. 'ప్రధాని మోదీ పక్కా భారతీయ రాజకీయవేత్త. సాధారణంగా భారతీయ నాయకులు తమ ఓటర్లతో నేరుగా సంబంధాలు కలిగి ఉండటానికే ఇష్టపడతారు. మధ్యవర్తులు లేదా మీడియా ద్వారా ప్రజలతో మాట్లాడటం కంటే, నేరుగా ప్రజలకే తమ సందేశాన్ని చేరవేయాలని భావిస్తారు' అని టాండన్ పేర్కొన్నారు. ప్రధాని మోదీ ఈ 'డైరెక్ట్ కాంటాక్ట్' విధానంలో అద్భుతమైన నైపుణ్యం సాధించారని, అందువల్లే ఆయన భారతదేశంలో అత్యధిక కాలం పనిచేసిన ప్రధానులలో ఒకరిగా నిలిచారని గుర్తుచేశారు. ప్రజలు ఆయన విధానాన్ని ఆదరించబట్టే వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చారని దౌత్యవేత్త స్పష్టం చేశారు. ప్రధాని మోదీ విదేశీ పర్యటనల్లో ఇలాంటి ప్రశ్నలు రావడం ఇదేం మొదటిసారి కాదు. గత మేలో నార్వే రాజధాని ఓస్లో పర్యటన సందర్భంగా కూడా అక్కడి ప్రధాని జోనాస్ గహర్ స్టోర్‌తో కలిసి మోదీ సంయుక్తంగా మీడియా ముందుకు వచ్చినప్పుడు.. హెల్ లింగ్ అనే నార్వేజియన్ జర్నలిస్ట్ ప్రధాని మోదీని ఉద్దేశించి 'మీరు జర్నలిస్టుల ప్రశ్నలకు ఎందుకు సమాధానం ఇవ్వరు?' అని బహిరంగంగా అడిగారు. అప్పట్లో ఈ అంశం సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది.

## బొగ్గు గ్యాసిఫికేషన్‌లోకి సింగరేణి అడుగులు

**భూగర్భ బొగ్గు గ్యాసిఫికేషన్ పైలట్ ప్రాజెక్టుకు సన్నాహాలు**

**సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్దప్రకాష్ జ్యోతి**




**హైదరాబాద్ (జనంసాక్షి) :** సింగరేణిని బహుముఖంగా విస్తరించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బొగ్గు గ్యాసిఫికేషన్ రంగంలోకి ప్రవేశించే అవకాశాలను సింగరేణి సమగ్రంగా పరిశీలిస్తోందని సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి తెలిపారు. శుక్రవారం సాయంత్రం సింగరేణి భవన్‌లో పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ పరిధిలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హైడ్రోకార్బన్స్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ నాగులపల్లి శ్రీకాంత్ తో జరిగిన సమావేశంలో కోల్ గ్యాసిఫికేషన్‌పై సింగరేణి చేపడుతున్న చర్యలను సీఎండీ వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రాంగణంలో రోజుకు 400 టన్నుల సామర్థ్యంతో అమ్మోనియం నైట్రేట్ మెల్ట్ ప్లాంట్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై ఇంజినీర్స్ ఇండియా లిమిటెడ్ అధ్యయనం నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టు పెట్టుబడిపై రాబడి ఆశాజనకంగా లేదని, మరింత మెరుగుపరిచేందుకు ప్లాంట్ సామర్థ్యాన్ని పెంచడం, కేంద్ర ప్రభుత్వ వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ వినియోగం, స్వదేశీ సాంకేతికత వంటి ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఇదే విషయంపై తాల్చేర్, ఎంసీఎల్-బీహెచ్ఈఎల్, జేఎస్పీఎల్ తదితర కోల్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులను అధ్యయనం చేయడానికి ఈ నెలలో సింగరేణి అధికారుల బృందం పర్యటించనున్నట్లు తెలిపారు. అలాగే భీమారం, చెన్నూరు సౌత్, నైనీ ప్రాంతాల్లో సర్ఫేస్ కోల్ గ్యాసిఫికేషన్ అవకాశాలపై సాంకేతిక-ఆర్థిక విశ్లేషణ కొనసాగుతోందన్నారు. భూగర్భ బొగ్గు గ్యాసిఫికేషన్ విషయంలో కూడా బెల్లంపల్లి, రామగుండం ప్రాంతాల్లోని లోతైన బొగ్గు నిల్వల్లో ఐదు బ్లాక్‌లను గుర్తించినట్లు తెలిపారు. తొలి పైలట్ ప్రాజెక్టును బెల్లంపల్లి డిప్‌సైడ్ బ్లాక్లో చేపట్టేందుకు డ్రిల్లింగ్ ఏర్పాట్లు జరుగుతున్నాయని, సీఎంఐఎఫ్ఆర్ శాస్త్రవేత్తల సాంకేతిక మార్గదర్శకత్వంలో ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ (ఆపరేషన్స్), కె.వెంకటేశ్వర్లు (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్), గౌతమ్ పోట్రు (పర్సనల్‌అండ్ ఫైనాన్స్), ఈడీ (కోల్ మూవ్‌మెంట్) బి. వెంకన్న, జీఎం (కోఆర్డినేషన్ అండ్ మార్కెటింగ్) టి.శ్రీనివాస్, జీఎం(పీపీ) జి.దేవేందర్, జీఎం(బిజినెస్ డెవలప్‌మెంట్) రాందాస్, జీఎం(ఆర్ అండ్ డీ) వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాలకతీతంగా ఉద్యమకారుల గుర్తింపు

- త్వరలో సీఎం రేవంత్‌కు తుది నివేదిక
- కమిటీ చైర్మన్ కే కేశవరావు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను రాజకీయాలకు అతీతంగా, క్షేత్రస్థాయిలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తి చేసేందుకు తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజేఏసీ) పూర్తి స్థాయి సహకారం అందించనున్నట్లు ప్రకటించింది. ఉద్యమకాలంలో తెలంగాణ సమాజాన్ని ఏకతాటిపైకి తీసుకొచ్చిన టీజేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు, వివిధ జేఏసీలు, ఉద్యమ సంఘాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఈ నిర్ణయం వెల్లడించారు. తెలంగాణ అమరవీరుల స్మారక చిహ్నం (అమరదీపం)లో జరిగిన ఈ ముఖాముఖి సమావేశంలో ఉద్యమ కాలం నాటి ఉమ్మడి స్టీరింగ్ కమిటీ డైరెక్టరీ ఆధారంగా వివిధ ఉద్యోగ, ఉద్యమ సంఘాల ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలు, సూచనలను కమిటీకి రాతపూర్వకంగా సమర్పించారు. ప్రస్తుతం ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేకుండా నిజమైన ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియకు సంపూర్ణ మద్దతు అందిస్తామని వారు స్పష్టం చేశారు. టీజేఏసీ స్టీరింగ్ కమిటీ వ్యక్తం చేసిన ఏకగ్రీవ మద్దతును కమిటీ చైర్మన్ కే. కేశవరావు, సభ్యులు స్వాగతించారు. రాజకీయాలకు అతీతంగా లభిస్తున్న ఈ సహకారంతో గ్రామీణ స్థాయి వరకు ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ ఖచ్చితంగా గుర్తించడం సాధ్యమవుతుందని కమిటీ పేర్కొంది. రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల (ఐఅండ్‌పీఆర్) శాఖ నిర్వహిస్తున్న డిజిటల్ స్క్రీనింగ్ ఆధారంగా పారదర్శకమైన తుది నివేదికను రూపొందించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సమర్పిస్తామని కేశవరావు తెలిపారు. సమావేశానికి టీజేఏసీ తరఫున ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ఉద్యోగ సంఘాల జేఏసీ నుంచి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఏలూరి శ్రీనివాసరావు, టీఎన్‌జీవో నాయకులు కె. స్వామిగౌడ్, జి. దేవీప్రసాద్, కారం రవీందర్ రెడ్డి, ఆర్టీసీ జేఏసీ నుంచి దొంతు ఆనందం, రాజిరెడ్డి, ఎలక్ట్రిసిటీ జేఏసీ నుంచి కె. రఘు, అడ్వకేట్ జేఏసీ నుంచి ఎం. రాజేందర్ రెడ్డి, ఎన్. ప్రహ్లాద్, డాక్టర్స్ జేఏసీ నుంచి డా. సురేష్ చంద్ర, ఇంజినీర్స్ జేఏసీ నుంచి శ్రీధర్ దేశ్‌పాండే, టి. వెంకటేశం, ఎం. బాలనర్సయ్యతో పాటు టీఎమ్మార్పీఎస్, తెలంగాణ వికాస సమితి, ఉపాధ్యాయ సంఘాలు, ఎంపీజే, ప్రైవేట్ స్కూల్స్ జేఏసీ ప్రతినిధులు హాజరయ్యారు. ఉద్యమకాలంలో టీజేఏసీలో భాగస్వాములైన టీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ తదితర రాజకీయ పక్షాల స్టీరింగ్ కమిటీ సభ్యులు కూడా సమావేశంలో పాల్గొన్నారు.

## ఇంటి నుంచే లింగ సమానత్వం పాటించాలి

- పితృస్వామ్య భావజాలాన్ని ప్రతి ఇంటిలో బహిరంగంగా మాట్లాడాలి
- స్టాండ్ విత్ హర్ ప్యానెల్ చర్చలో నిపుణుల పిలుపు




**హైదరాబాద్, జూలై 11 (జనంసాక్షి) :** కుటుంబాల్లోనే లింగ సమానత్వం ప్రారంభం కావాలని, పితృస్వామ్య భావజాలాన్ని మార్చేందుకు ప్రతి ఇంటిలో బహిరంగా మాట్లాడాలని, పరస్పర గౌరవం, భావోద్వేగాన్ని నిజాయితిగా వ్యక్తపరచాలని మహిళా భద్రత విభాగం డైరెక్టర్ జనరల్ చారు సిన్హా పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌లోని డా. బి.ఆర్. అంబేద్కర్ యూనివర్సిటీలో ఉన్న వీ-హబ్ (ఔవఎబఎ)లో స్టాండ్ విత్ హర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐదో ప్యానెల్ చర్చా కార్యక్రమంలో ఆమె ముఖ్య వక్తగా పాల్గొన్నారు. "కుటుంబాల్లో సమానత్వం, పరస్పర శ్రద్ధ, భావోద్వేగ నిజాయితీ – లింగ సమానత్వం, పితృస్వామ్య ధోరణులు' అనే అంశంపై ఈ చర్చ జరిగింది. విద్యా, సినీ, సామాజిక సేవ, మీడియా, పోలీసు రంగాలకు చెందిన ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొని కుటుంబ వ్యవస్థలో నెలకొన్న లింగ వివక్ష, సామాజిక ఆచారాలు, భావోద్వేగ వ్యక్తీకరణ, సంరక్షణ బాధ్యతలు, మహిళలు-పురుషులకు లభించే అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. సమానత్వం, పరస్పర గౌరవం, అనురాగం, భావోద్వేగ నిజాయితీతో కూడిన కుటుంబాల నిర్మాణమే సమాజ మార్పుకు పునాది అని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా చారు సిన్హా మాట్లాడుతూ "ఎవరూ రాయని ఒక నియమావళి ఉంది... కానీ అందరూ దానినే అనుసరిస్తున్నారు" అని పేర్కొన్నారు. కుటుంబాల్లో మహిళలు, పురుషులు ఎలా ఉండాలనే సామాజిక అంచనాలు రాతపూర్వకంగా లేకపోయినా తరతరాలుగా కొనసాగుతున్నాయని ఆమె అన్నారు. ఇలాంటి చర్చల ద్వారా ప్రజల్లో అవగాహన పెరిగితే కుటుంబాల్లో మార్పు వస్తుందని, ఆ మార్పు సమాజాన్ని మరింత సమానత్వ దిశగా తీసుకెళుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయం , స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ కె. సునీతా రాణి మాట్లాడుతూ, "కుటుంబం బంధం కావాలి... బంధనం కాకూడదు" అని పేర్కొన్నారు. కుటుంబ సంబంధాలు స్వేచ్ఛ, సమానత్వం, భావోద్వేగ సంక్షేమాన్ని పెంపొందించేలా ఉండాలని, సంప్రదాయ లింగ వివక్షను కొనసాగించే విధంగా ఉండకూడదని ఆమె సూచించారు. అన్నపూర్ణ స్టూడియోస్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్, సినీ నిర్మాత, నటి సుప్రియా యార్లగడ్డ మాట్లాడుతూ, వ్యక్తులపై సమాజం విధించే లింగ ఆధారిత పరిమితులు తొలగితే వారి నిజమైన ప్రతిభ, వ్యక్తిత్వం వెలుగులోకి వస్తుందని అన్నారు. కుటుంబాలు ప్రతి సభ్యుడికి స్వేచ్ఛగా ఎదిగే అవకాశాన్ని కల్పించాలని ఆమె సూచించారు. ప్లాంటేరియం వీగన్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు పూర్ణిమ దీపిక మాట్లాడుతూ, ముఖ్యంగా మహిళలు తమను తాము నిర్లక్ష్యం చేయకుండా ఆత్మ సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు. "ఇది స్వార్థంలా అనిపించినా... మిమ్మల్ని మీరు చివరి స్థానంలో పెట్టుకోకండి" అని ఆమె అన్నారు. ప్రముఖ దర్శకుడు శశి కిరణ్ తిక్క మాట్లాడుతూ, లింగ సమానత్వంపై పురుషులు కూడా బహిరంగంగా మాట్లాడాల్సిన అవసరం ఉందన్నారు. "ఈ విషయాలపై పురుషులు మాట్లాడాలి. మాట్లాడినప్పుడే సమస్యలకు పరిష్కారం లభిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయం సామాజిక శాస్త్రాల విభాగం పరిశోధక విద్యార్థి అమన్ కుమార్ కుటుంబాల్లోనే లింగ పాత్రలు ఎలా ఏర్పడతాయో, తరతరాలకు ఎలా సంక్రమిస్తాయో సామాజిక శాస్త్ర దృక్కోణంలో వివరించారు. సీనియర్ జర్నలిస్ట్ ఉమా సుధీర్ ఈ చర్చకు సమన్వయకర్తగా వ్యవహరిస్తూ భావోద్వేగ నిజాయితీ, సంరక్షణ బాధ్యతల భాగస్వామ్యం, కుటుంబాల్లో సమాన అవకాశాలపై అర్థవంతమైన చర్చను ముందుకు నడిపించారు.

ఈ చర్చ ముగింపులో కుటుంబాలే పిల్లల్లో విలువలు, ఆలోచనలు, ప్రవర్తన రూపుదిద్దుకునే తొలి వేదిక అని ప్యానెల్ సభ్యులు పేర్కొన్నారు. కుటుంబాల్లో పితృస్వామ్య ధోరణులను సవాలు చేయడం, భావోద్వేగాలను స్వేచ్ఛగా వ్యక్తపరిచే వాతావరణం కల్పించడం, సంరక్షణ బాధ్యతలను సమానంగా పంచుకోవడం, పరస్పర గౌరవాన్ని పెంపొందించడం ద్వారా మాత్రమే సమానత్వం, సమగ్రత కలిగిన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని వారు అభిప్రాయపడ్డారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370